
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

7-10-83
150 పైసలు



కొత్త పెళ్ళికూతురు తన అనుభవాన్ని చెబుతోంది. యవ్వనంలో ముఖంపై వచ్చే మొటిమలెలా పోతాయో చెబుతోంది.

"యవ్వనంలో మొటిమలు రావడం సహజం వాటిని శుభ్రంచేసి అదుపులో పెట్టడానికే ఎప్పుడూ క్లియరసిల్ వాడటం."



"నాకు 18 ఏళ్లొచ్చేసరికి మొటిమలు రావడం మొదలెట్టాయి...

అయితే నేనంతగా పట్టించుకోలేదు. ఇంకొంచెం ఎదిగిన తర్వాత ఒక రోజున ఒక అబ్బాయి చూడటానికి వచ్చాడు నన్ను.


మరి అతను చూసీ చూడటంతోటే నచ్చలేదన్నాడు

నేనైతే కలలో గూడా అనుకోలేదు మొటిమలు యింత పనిచేస్తాయని, యిలా దారిలో అడ్డుకుంటాయని. నా స్నేహితురాలు జయతో చెప్పానిది ..

ఇక అప్పుడు జయ నాకు క్లియరసిల్‌తో ఒకదారి చూపించింది

నేను క్లియరసిల్ రోజుకు రెండుసార్లు రాసుకోవడం మొదలెట్టా. క్రమం తప్పకుండా వాడుతూ వచ్చాను. మరి తర్వాత ఒక రోజున ఏమైందంటే, నా స్నేహితురాలి యింట్లో అదే అబ్బాయి కలిసాడు, యిక అలాగే కన్ను ఆర్పకుండా చూస్తూ వుండిపోయాడు!"

క్లియరసిల్ వేనిషింగ్ మెడికేషన్ మరియు క్లియరసిల్ స్కిన్ కలర్‌డ్ మెడికేషన్—యీ రెండూ తమ విశిష్టమైన త్రివిధ చర్యతో పనిచేస్తాయి




1. మొటిమలను తెరుస్తాయి
2. మొటిమలను శుభ్రం చేస్తాయి
3. మొటిమలను ఆరబెడతాయి

క్లియరసిల్‌కి ఇప్పుడొక జోడు!

ఒకప్రక్కే మీ రెరిగిన క్లియరసిల్ స్కిన్ కలర్‌డ్ మెడికేషన్ మొటిమల్ని కనిపించకుండా చేస్తూ, తన ప్రభావాన్ని చూపిస్తుంది. మరొకప్రక్కే, కొత్త క్లియర్‌సిల్ వేనిషింగ్ మెడికేషన్ చర్మంలో కలిసిపోతుంది, రాసుకున్నట్టే కనిపించకుండాను, మరి తన ప్రభావాన్ని చూపిస్తుంది. అలంకరణతో సౌందర్యం, మందుకి మందూను.

క్లియరసిల్ ప్రతి రోజూ రెండుసార్లు రాసుకోండి

మొదట మీ ముఖాన్ని కడుక్కోండి. ముఖం అంతటిపైనా క్లియరసిల్ రాసుకోండి; మొటిమలున్నచోట మరి కొంచెం ఎక్కువగా, మొటిమలు పోయిన తర్వాత గూడా క్లియరసిల్ రాసుకుంటూనే ఉండండి, ఎందుకంటే క్లియరసిల్, చర్మంలో ఎక్కువగా గల నూనెని లాగేస్తుంది, తద్వారా మొటిమల్ని రాకుండా అదుపులో పెడుతుంది.



కొత్త వేనిషింగ్ మెడికేషన్

స్కిన్ కలర్‌డ్ మెడికేషన్

క్లియరసిల్ – ప్రపంచంలోని నం. 1 మొటిమల క్రీమ్

OBM-8625-R TEL

దేశ విఖ్యాతిగాంచిన విమల్ చీరల్లో సరిక్రొత్త శ్రేణికై
విచ్చేయండి నేడే మంగళ్ దీప్‌కి.



VIMAL®
A RELIANCE PRODUCT

మంగళ్‌దీప్

కోఠి, హైదరాబాద్, ఫోన్ : 45786

ఆంధ్ర ప్రదేశ్‌లో అన్నిటికన్నా పెద్దదైన విమల్ షోరూం

Mudra/RTI/1273 TEL

విపరీత ధోరణులు

ఈ మధ్య మన వారపత్రికలో రావినూతల సువర్ణాకన్నన్‌గారి ఒక కథ చదివాము. అందులో సుభద అని ఒక పాత్ర ఉంది. అది 'సుభద్ర' అయి ఉండాలి, లేదా 'శుభద' అయి ఉండాలి అనుకుని చదువుతోంటే కథ పొడుగునా అదే పేరు కనిపించింది. దీన్నిబట్టి ఈ ''కొత్తదనం'' రచయిత్రి 'సృష్టే' అనుకోవలసి వస్తోంది. ఆవిడ పేరునుకూడా'సువర్ణ'నుంచి ''సువర్న''గా మార్చుకునే ఉండాలి. వ్యక్తుల పేర్లు వాళ్ళ ఇష్టప్రకారం పెట్టుకోవచ్చుననే ఒక వాదం ఉంది. దాన్ని ఎవరూ కాదనరు. అయితే ఆ పేర్లు పెట్టుకోవడంలో ఒక అర్థం, ఉద్దేశ్యం ఉండాలి కదా! ''సు'' అనేది ఒక ఉపసర్గ. దాన్ని 'అడ్డమైన' అక్షర సమూహాలకీ చేరిస్తే బొత్తిగా అర్థమే ఉండదు. అలాగే వర్ణ,సువర్ణ అనే వాటికి స్పష్టమైన అర్థాలున్నాయి. మా ఇష్టం వచ్చినట్లు మార్చుకుంటాం అంటే ఎవళ్ళూ ఏమీ చేయలేరు.

బహుశా తెలుగుభాషలోని అక్షరాలను కుదించే ప్రయత్నమో, లేదా ఉచ్చారణా సౌలభ్యంకోసమో రచయిత్రి ఇలా చేశారా అంటే అదికూడా వాదనకు నిలవదు. చదువుకోనివాళ్ళు, తొందరగా మాట్లాడేవాళ్ళుకూడా 'ర' అనే అక్షరం తరువాత 'ణ'నే వాడతారుగాని 'న' అనే అక్షరాన్ని కాదు. ఇది అందరికీ తెలిసిన విషయమే.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే రచయితలు, మేధావులు తమ సామర్థ్యాన్ని చూపెట్టవలసినది వ్యక్తులపేర్లను అస్తవ్యస్తం చేయడంలోకాదు. భావంలో పుష్టి ఉంటేనే రచన రాణిస్తుంది.

పట్టాభిరామిరెడ్డి ''పఠాభి'' అని వ్రాసుకోవడంవలనా లేక ఆయన ప్రత్యేక రచనావిధానం వలనా, పైకి వచ్చింది? రచయిత్రిగారూ, కొంచెం ఆలోచించండి! పత్రికవారూ! ఇప్పటికే దుష్ట సమాసాలతోనూ, ''స్వాంతన'', ''వ్యాహోళి'', ''ఖచ్చితం'', ''భాద'' వంటి రచనా రాక్షసాలతోనూ, ముద్రారాక్షసాలతోనూ తెలుగు భాష నడుము విరిగిపోతోంది. మీరు సైతం ఈ యజ్ఞంలో మరో సమిధ కాకండి.

కల్లూరి సత్యరామప్రసాద్
(కోలార్ బంగారు గనులు)

పద్యాలు

9–9–83 నాటి ఇ'వేమన' పద్యం చాలా బాగున్నది. కథలలో నియమపరీక్ష, నేల పై నెలరాజు కథలు మా ఇంటిల్లపాదిని చాలా ఆకర్షించినవి.

ఆకురాతి నాగ శ్రీనివాస్ (గొల్లపూడి)



'హిందూ'మతం కాదు

ప్రతివారం ఆంధ్రసచిత్రవారపత్రికలోని జయ్‌దుబాషీగారి 'న్యూఢిల్లీ లేఖ' చదివే వారిలో నేను ఒకడిని. 2–9–83 వారపత్రికలోని 'విభజించేవి తేడాలు కావు పోలికలే' అన్న వ్యాసం చాల చక్కగా ఉంది. ప్రస్తుతం సమాజం మత పరంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఇది జవాబు. కాని శ్రీ దుబాషీగారు హైందవులూ, సిక్కులూ, బుద్ధులను వివిధ మతాల వారిగా చిత్రీకరించారు. హిందూ అనేది ఒక మతం కాదు. అది ఒక జాతి, అనేక సంవత్సరాలుగా వస్తున్న నాగరికత. అందుకే భారతదేశాన్ని హిందూ దేశమంటారు. బౌద్ధమతాన్ని స్థాపించిన బుద్ధుడు హిందువే. దుఃఖానికి కారణం కోర్కెలు, వాటి నిర్మూలనకై బౌద్ధమతాన్ని స్థాపించాడు. అయినా వారు హిందూ సమాజంలో భాగమే. అలాగే మహమ్మదీయ దాడులను ఎదుర్కోవటానికై గురుగోవిందసింహుడు 'ఖలసా' సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టి సిక్కుమతాన్ని స్థాపించాడు. దేశరక్షణకు ఆత్మార్పణ చేసిన వారిలో సిక్కులే ఎక్కువ. గురుగోవిందుని అభిప్రాయం ప్రకారం సిక్కులు హిందూ సమాజానికి దూరం కావాలని కోరుకోలేదు. హిందూధర్మంలో శైవ, వైష్ణవ, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మొదలైన అనేక మతాలున్నాయి. అనేక సమస్యలకు వారి వ్యాసాల ద్వారా సమాధానమిస్తున్న శ్రీ దుబాషీగారు 'హిందూమతం' అని వాడటం బాధాకరమైన విషయం.

మాడ్గుల జయదేవ్ (వికారాబాదు)

న్యూఢిల్లీ లేఖ

''న్యూఢిల్లీ లేఖ'' నిర్వహించుచున్న డా॥ జయ్‌దుబాషిగారు ఎంతో అభినందనీయులు. వారి ఆలోచనాసరళి, ప్రస్తుతం జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై వారి సూచనలు, అభిప్రాయములు జాతికి ఎంతో మార్గదర్శకమైనవిగాను, ఆలోచింపజేసేవిగాను ఉన్నవనుటలో ఎట్టి సందేహము లేదు. గంజాయి వనంలో 'తులసి' మొక్కగా మన 'పత్రిక' మేధావుల ఆలోచనా సరళిని, అభిప్రాయాలను సామాన్య ప్రజానీకం ముందుంచడంలో సఫలీకృతము కాగలదని ఆకాంక్షిస్తున్నాను.

గడ్డం వేంకటేశ్వర వరప్రసాద్
(మచిలీపట్నం)

ఆంధ్రుల అభిమాన పత్రిక ఆంధ్రపత్రిక !

కేవలం ఆంధ్రులకోసం పుట్టింది ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రిక. వ్యాపారదృష్టితో గాక, ఆంధ్రులు చదివి ఆనందించదగ్గ పత్రికగా ఎన్నో రచనలను, కథలను, వ్యాసాలను,కవిత్వాన్ని, వార్తలను అందించిన ఆంధ్ర సచిత్ర వారపత్రికకు 75 సం. నిండిందంటే ఈ పత్రిక పై ఆంధ్రులకు ఎంతటి ఆదరాభిమానాలున్నాయో అర్థమవుతోంది. ఈ పత్రికకు మూలపురుషుడు అన్నదాత, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు చనిపోయినా ఈనాడు ఆయన ఆంధ్రులకు అమరజీవి.

వినాయకచవితినాడు వారపత్రికగా జన్మించిన ఆంధ్రపత్రిక తెలుగుజాతికి వెలుగు పత్రిగా మరొక 25 ఏండ్లుకూడా ముగించుకొని నూరేండ్ల పండుగ జరుపుకోవాలని ఆశిస్తున్నాను.

టి. అమృతరావు, మాజీ శాసనసభ్యుడు
(గుంటూరు)

ప్రత్యేక శైలి

''నళిని'' ముఖచిత్రం ముగ్ధమనోహరంగా వుంది. ''న్యూఢిల్లీ లేఖ''లో డా॥ జయ్‌దుబాషీగారు తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకుని నేటి సామాజిక పరిస్థితులను అద్దం పట్టినట్లు వివరిస్తున్నారు. ఈ సంచికలో ప్రచురించిన ''రాజకీయోల్బణం'' గురించి తెలియజేసిన విషయాలు ఆలోచింపచేసే విధంగా వున్నాయి.

కొమ్మినేని ప్రసాద్ (గుంటూరు)

హైదరాబాద్ నోట్ బుక్

9–9–83 సంచికలోని హైదరాబాదు లేఖలో పరిచయం చేసిన మా గురువుగారి వ్యాసం చూసి పరమానంద భరితుడనయినాను. ఆ 'స్వామి' వారి దగ్గర చందస్సు దగ్గర్నుంచి సాహిత్యానికి కావలసిన సర్వస్వమూ నేర్చుకున్న నేను ఆయనకు ఎల్లప్పుడు ఋణపడే ఉంటాను. ఆయన వ్రాసిన 'లలిత' పారాయణం గురించిన పుస్తకంలో అఖిలాంధ్రలోకము గుర్తించింది. వేద పారాయణాభిలాషులు ముఖ్యంగా లలితోదేవ్యపాసకులు ఆయనకు చాల ఋణపడి ఉన్నారు. నేటికి ఆయనకు ప్రతిదినము శంకా నివృత్తి కోసం వస్తున్న వందల కొలది ఉత్తరాలు చాలు నిరూపణకు.

అలాగే ఆయన మొట్టమొదట ఆంగ్లములో, హిందీలో కంద పద్యం రాసారు.

తిరుమల రామచంద్రగారు మా రాయల సీమ మట్టిలోని మాణిక్యాన్ని వెలికి తీసుకు వచ్చినందుకు చాల కృతజ్ఞతలు.

కె. వెంకటరెడ్డి (హైదరాబాదు) ★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

వాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 7–10–'83

రుధిరోద్గారి నామ సం. ఆశ్వయుజ శు. పాడ్యమి

సంపుటము 76 సంచిక 4

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-50

అరు మాసాల చందా రు. 42-90

పోస్ట్‌లో ఏడాది చందా రు. 85 80

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :


'మూడు ముళ్ళు'లో చంద్రమోహన్

కథలు :

సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

లోకం పోకడ * డోమెన్



మేధావులూ - రాజకీయవాదులూ

"ఇది శ్రీమతి గాంధీ దేశంలాంటిదికాదు. ఇక్కడ వ్యక్తి స్వాతంత్ర్యం ఉంది. అందుచేత ఎవరయినా ఇక్కడికి వస్తానంటే రావచ్చు. అంతమాత్రాన ఇక్కడ శ్రీమతి గాంధీకి స్వాగతం లభించరాదు, ఆమెని సత్కరించరాదు, ఆమె రాక ఒక విశేషంగా పరిగణించరాదు. ఈ దేశంలోని ప్రజాప్రతినిధులు ఆమెని గుర్తించరాదు. ప్రధాన మంత్రిగా ఉంటూ శ్రీమతి గాంధీ పనికట్టుకుని చట్టంద్వారా పరిపాలనని నాశనంచేశారు, వేలమంది ప్రత్యర్థులని విచారణలేకుండా నిర్బంధించారు, ప్రభుత్వాన్ని తమ వ్యక్తిగత సంస్థగా మార్చివేశారు. ఆమె ఒక నీతిలేని రాజకీయవాది. బ్రిటన్‌కిచ్చి కొంత అంతర్జాతీయ ప్రతిష్ఠని తిరిగి తెచ్చుకుందామని ఆమె ఆశ — ఇటీవలే ఆమె ఒక ఉపఎన్నిక గెలిచారు. శ్రీ పీటర్‌షోర్, లార్డ్ కారింగ్‌టన్, శ్రీ మయికేల్‌ఫుట్ — వీరు ముగ్గురూ ఆమెకి ఈ విషయంలో తోడువడుతున్నట్లున్నారు."

ఇది 1978 లో ఒక బ్రిటిషు పత్రికలోని సంపాదకీయంలోనిది. అంతకి ముందే ఆమె చిక్కమగళూరు ఉపఎన్నికలో గెలిచారు. అది ఏ పత్రిక ? లండన్ టయిమ్స్ సంస్థవారి "సన్‌డే టయిమ్స్" పత్రిక.

అప్పటి సంపాదకీయాన్ని ఇప్పుడు ఎందుకు ఉదహరిస్తున్నాను ? ఈ మధ్య నేను "ఇందిరా గాంధీ 1028 రోజులు" అనే పుస్తకాన్ని చదివాను. అది పట్టి చెత్త. రాసినవాళ్ళు ఇద్దరు ఆడవారు. తాము పత్రికారచయితల మంటారు వాళ్ళు. వాళ్ళ పేర్లు మాత్రం—ఎవరికీ తెలీదు. బహుశ శ్రీమతి గాంధి సొంత పత్రికకి దేనికయినా రాస్తారేమో ! వాళ్ళు తమ పుస్తకంలో ఈ సంపాదకీయాన్ని ఉదహరించారు.

బ్రిటన్‌లో పేరు పొందిన ఉత్తమ పత్రికలు సాధారణంగా నోరు జారవు. "ఆవిడ నీతిలేని రాజకీయ వాది" అన్న వ్యాఖ్య చూడండి. మయికేల్‌ఫుట్, పీటర్‌షోర్‌లని గురించి అన్న మాటలు గమనించిండి. వాళ్ళు లేబర్ పార్టీ రాజకీయ వాదులుట. మయికేల్‌ఫుట్ ఒక సోషలిస్టుట. ఒక నియంతతో సావాసం చెయ్యటానికి ఆయన సిగ్గుపడవద్దూ ? ఆయన అత్యవసర పరిస్థితినే పొగిడాడు. అయితే, ఆయన లాంటివాళ్ళు అంతే. వాళ్ళకి కావలసింది దొరికితే ఏదయినా చేస్తారు.

శ్రీమతి గాంధీ ప్రచార మంత్రం ఆమెకి అవసరం అయినప్పుడు చాలా బాగా పని చెయ్యగలదు. ఆమె ప్రచారాన్ని చూసి ఎందరు మోసపోయినా, "సన్‌డే టయిమ్స్" లాంటి పత్రికలు మోసపోవు కదా ! ఆమె స్తుతిని ఎవరు నమ్ముతారు ? శ్రీమతి గాంధికి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పి.హెచ్.డి. ఇచ్చిందట. కాని, ఆ విశ్వవిద్యాలయం యొక్క వైస్‌ఛాన్సలర్ ఎవరనుకున్నారు ? మాజీ ప్రధాన మంత్రి హరాల్డ్ మాక్మిలన్. ఆయనకి నీతినియమాలు ఎక్కడ ? శ్రీమతి గాంధీని గురించి ఒక్క సుప్రసిద్ధ రచయిత ఒక పుస్తకం రాశాడా ? ఆవిడ ఇంత పెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధానమంత్రి కదా ? (ఎమర్జెన్సీలో ఈ ప్రజాస్వామ్యాన్నే ఆవిడ దెబ్బతీశారు.) జయప్రకాష్‌నారాయణ్, సుభాష్ చంద్రబోస్ మొదలయినవాళ్ళమీదా పుస్తకాలు వచ్చాయి... ఈవిడని గురించో ?

ఇంకా ఆలోచించిచూస్తే— శ్రీమతి గాంధీ పరిపాలనని వర్ణిస్తూ ఒక మంచి రచన వచ్చిందా ? వచ్చిన రచనలు ఎంతకాలం నిలిచేవి? ఖ్వాజా అహమద్ అబ్బాస్ లాంటి పద్య రచయితలు సయితం ఆమె పరిపాలనని చూసి ఉత్తేజితులు కాలేకపోతున్నారు. [ఆవిడని ఆయన ఎప్పుడూ పొగడ్తాడు, దాన్నిగురించి సందేహం లేదు.] ఒక సమాజం ఉందంటే దాని తాలూకు సాహిత్యం అంటూ ఉంటుంది కదా ? ఆ సాహిత్యాన్ని సృష్టించేవాళ్ళు ఉంటారు కదా ? వాళ్లెవరూ ఏమీ శ్రీమతి గాంధీని గురించి రాయరేమీ ? గాంధీ, బోస్, సావర్కార్ మొదలయినవాళ్ళని గురించి ఎన్ని పాటలు రాశారు ! దండియాత్ర, జలియన్‌వాలాబాగ్‌లని గురించి ఎందరు పాడారు ! శ్రీమతి గాంధీని గురించో ? ఒక నాయకురాలికి ఉండవలిసిన లక్షణమా ఇది? ఆమె ఒక ముఠా నాయకురాలు. అంతే !

అత్యవసర పరిస్థితినే తీసుకోండి. అప్పుడు ఎన్ని రచనలు వెలిశాయి ! 15 భాషలలో 250 మంది కవులు 280 ఖండకావ్యాలు రాశారు. వీటిని బొంబాయిలోని పాపులర్ ప్రకాషన్ సంస్థ కలిపి ప్రచురించింది. "అత్యవసర పరిస్థితి కంఠస్వరాలు" [వాయిసెస్ ఆఫ్ ఎమర్జెన్సీ] అని

న్యూఢిల్లీలేఖ




డా. జయదుభాషి

పేరు పెట్టారు దీనికి. అచ్చు అయినవే ఇన్ని ఉంటే అజ్ఞాతంగా ఉండిపోయినవి ఎన్ని అయి ఉండాలి ! ఉర్దూలో మహమద్ హాసన్ అనే కవి రాసిన దానికి ఇది తర్జుమా :

కంఠస్వరాలు ప్రతిధ్వనించటం
మర్చిపోయాయి
మాటలు మ్యూసియమ్‌లో పెట్టిన
నకిలీ నాణాలు
చేతులకి కలాలు లేకుండా పోతున్నాయి
నాలుకలని కోసేశారు
పదాల అర్థాలు తలకిందులయ్యాయి
అంతా అర్థరహితమయినట్లు
ఒకే ఒక నాలుక — ఒక బాకు — ఇంకా
ఆడుతోంది
ఒకే ఒక కలం — నియంతది —
కదులుతోంది.

శ్రీమతి గాంధీ "మేధావులు" అంటూ కొందరిని అవహేళన చేస్తారు. సమయం వస్తే వీళ్ళేకదా ఒక దేశం యొక్క అంతరాత్మని కాపాడేది ? వీళ్ళకి ఆవిడమీద నమ్మకంలేదేమీ ? ప్రపంచంలో ఏ మేధావీ శ్రీమతి గాంధీని ప్రశంసించడు, ఎందుకు ? అసలు రాజకీయవాదుల భాషే వేరు... అది మీ భాషా, నా భాషా లాంటిదికాదు. రాజకీయవాదులు కొందరికి రాజకీయాలు ఒక వృత్తి. వాళ్ళ ఆలోచనలు అధికారం చుట్టూతా మాత్రమే తిరుగుతాయి. మేధావులకి ఈ పద్ధతి విరుద్ధం. అందుకనే ఆవిడకి విదేశాలలో మయికేల్‌ఫుట్, స్వదేశంలో ముల్క్‌రాజ్ ఆనంద్ — అబ్బాస్ లాంటివాళ్ళు మాత్రమే గతి. ఆత్మగౌరవం కలవాళ్లెవరూ ఆమె జోలికి వెళ్లరు. ఈ వాస్తవాన్ని ఆమె గ్రహించలేకపోతున్నారు. ఆమె దురదృష్టం అది. మనమేమి చేస్తాము ! ? ★


ఒయాసిస్ సుందరి ...
FEEL CONFIDENT ALL DAY
Oasis
TOILET SOAP
నా తనువుకు తగ్గ సబ్బు ఒయాసిస్
నా మనసు మెచ్చిన సబ్బు ఒయాసిస్
నేను నమ్మిన సబ్బు ఒయాసిస్
తెలుపు, గులాబి మరియు
ఆకు పచ్చ రంగులలో లభిస్తుంది.
ఒయాసిస్
టాయిలెట్ సబ్బు
ఓస్వాల్ ఏగ్రో మిల్స్ లిమిటెడ్,
న్యూ ఢిల్లీ వారి నాణ్యమైన ఉత్పాదన.

మహాత్మా గాంధి



స్వతంత్ర భారతజాతి జనకుడు గాంధి మరణించెను. ఆయన మరణించినది రుగ్మతవల్లకాదు. వృద్ధాప్యమువల్లకాదు. నిరాహార దీక్షాప్రాయోపవేశమువల్లను కాదు.

ఆయన హత్యచేయబడెను. శుక్రవారము సాయంత్రము ప్రార్థనసభకు పోవుచుండగా, ''హిందురాష్ట్ర సేవక'' పత్రికా సంపాదకుడు నాథూరామ్ వినాయక్ గాడ్సే అనునతడు రివాల్వరుతో కాల్చి చంపెను. ఆ వార్త వినిన వెంటనే భారతవర్షము నిశ్చేష్టితమయినది. ఆయన మరణముకాక ఆయన హత్య చేయబడెననునది యావద్భారత ప్రజాహృదయములందు చిచ్చు పెట్టినది. గాంధి హత్య చేయబడెననునది ఊహకుకూడ అందని భయంకరమైన విషాద సంఘటన. అది జరిగినదని నమ్ముటకు సాధ్యము కాదు. కాని జరిగినది. మానవ స్వభావము ఎంత నీచస్థితికి పతనము కాగలది దీనివల్ల వ్యక్తమగుచున్నది. భారతదేశ మానసిక స్థితి ఎంత నైచ్య స్థితి యందున్నది వెల్లడి అయినది. హత్యా కార్యమునకు ఒడవడిన యువకుడు అణగియున్న ఆ నీచస్థితికి ప్రతినిధి తప్ప వేరుకాదు. గాంధి హత్యారూపమున అది ప్రబద్ధలైనది.


లేనియెడల గాంధిని చంపుటేమిటి! ఆయన యెపుడు తన జీవిత విషయమున ఆసక్తిని చూపలేదు. తన ప్రజను సన్మార్గవర్తనులను చేయుటకు తన అసువులను అర్పింప వెనుకాడలేదు. మృత్యుదేవతే వెనుకాడినది. కడపటి నిరాహారదీక్షానంతరము, బాంబువేయబడినపుడు, తరువాత ఆయన పలికిన మాటలు గమనింపుడు. ''ప్రార్థనలు పూర్తియగువరకు అది బాంబు ప్రేలుడని నాకు తెలియదు. అది నాపై ప్రయోగింప ఉద్దేశింపబడినదని నాకు తెలియదు. నాపై ప్రయోగింప ఉద్దేశింపబడిన, అది నా ముందు ప్రేలినపుడు నేను ఏ విధముగ ప్రవర్తించెడివాడనో భగవంతునికి మాత్రమే తెలియగలదు. అందువల్ల నే నెవరి ప్రశంసలకు పాత్రుడనుకాను. బాంబుకు గురి అయి, దాని ప్రయోగించిన వానిపైన ఎట్టి ద్వేషము లేక మందస్మిత వదనుడనై మరణించిన అపుడు ఈ ప్రశంసకు అర్హతను పొందగలిగి యుండెడి వాడను.''


ఇలా చెప్పిన గాంధి హత్య చేయబడెను. రివాల్వరుతో కాల్చిన వ్యక్తి, బాంబు వేసిన వ్యక్తి ఒకే ముఠాకు చెందినవారని తెలియుచున్నది. బాంబు వేసిన అనంతరము గాంధి మాటలు వారిని కలచినట్లు లేదు. మానవత్వమనునది ఏమాత్రమున్నను ఈ ఘాతుక కృత్యమునకు ఒడిగట్టి యుండెడివారు కాదు. హత్యాకారుడు కేవలము పండిత నెహ్రూ అనినట్లు పిచ్చివాడు తప్ప వేరుకాదు.

''బాంబుకు గురియయిన, దానిని ప్రయోగించిన వానిపైన ఎట్టి ద్వేషము లేక మందస్మిత వదనుడనై మరణించిన అపుడు ఈ ప్రశంసలకు అర్హతను కలిగియుండెడివాడను'' అనినట్లే రివాల్వరు దెబ్బతినినపుడు ఒరగిపోయెను. గుండు దెబ్బ తగిలిన వెంటనే చేతులు మోడ్చి రామ నామమును పలికెను. తన బాధను గురించి తలచలేదు. ''రామ, రామ''అనుట హంతకునిపై ఆయన కారుణ్యమునకు నిదర్శనమేమో ? గాంధి ఎపుడు బాధపడి, పరిహార మిచ్చుట ఇతరులకే కదా ! ఆ రామనామ స్మరణ కూడ అందుకే కావచ్చు.

గాంధి హత్యావార్త యావద్భారత దేశమును చలనములేని నిర్జీవ ప్రతిమను చేసినది. నాడు రాఘవుడు లేని అయోధ్య భరతునికి కనుపడినట్లు నేడు గాంధి లేని భారతదేశము ప్రజకు కనుపడుచున్నది. గాంధి లేడను ఊహ భారత ప్రజ భరింపలేకున్నది. నేడు భారత విలాపమును చూచిన గాంధి నిజముగా జాతి జనకుడని వెల్లడి అయినది. ఆసేతు హిమాచలము కంటతడి పెట్టని వ్యక్తి లేడు. బాధపడని మానవుడు లేడు. విచారమున మునుగని గృహము లేదు. పండిత నెహ్రూ చెప్పినట్లు దేశము నుండి జ్యోతి వెడలిపోయినది. చరిత్రలో ఎపుడు కూడ దేశమునకు ఇంత విపత్తు సంభవింపలేదు. 30 సంవత్సరములు దేశమునకు ఏకైక నాయకుడుగనుండి దేశమునకు స్వాతంత్ర్యమును సంపాదించియిచ్చెను. స్వతంత్ర భారతమునకు జనకుడయ్యెను. ఆయన భారత దేశమునకు సాక్షాత్తు అంతస్సాక్షి. ఎవరేమిచేయ దలచిననూ ఆయనేమి అనుకొనునో ఏమి చెప్పునో అని ఆయనను సంప్రతించి, ఆయన అభిప్రాయమును తెలుసుకొనకుండ ఉండలేకపోయిరి. ప్రతి విషయమున, ప్రతి సందర్భమున ఆయన ఊహ, ఆయన నిర్ణయము, శుద్ధమైనదిగ కనిపించినది. మనోవాక్కర్మలను ఆయనపట్ల భిన్నత్వము లేకపోవుటవల్లనే ఆయనకు మానవత్వములోనే దైవత్వము వచ్చినది. ఆయన అంతర్వాణికి అదే మూలము. ఆ వాణి ఇక భారతీయులకు ఆయన భౌతికశరీరముద్వారా వినపడదు. శ్రీ కృష్ణపరమాత్ముని గీతాబోధ నిలిచినటు ఆయన బోధలు నిలిచి, విన ఇచ్ఛయున్నవారికి వినబడగిలవు. ఆయన జీవించియుండగ ఆయనను సక్రమముగ అనుసరించి యుండక పోవచ్చును. ఆయనతో వాదించి యుండవచ్చును. ఆయనను విమర్శించి యుండవచ్చును. ఆయనను హేళన చేసియుండవచ్చును. కాని ఇపుడలా చేయుటకు వీలులేదు. ప్రధాని పండిత నెహ్రూ చెప్పినట్లు, ఇపుడాయన సూచించినదానికి భిన్నముగ

సంపాదకీయము
ఆంధ్రపత్రిక 1948 ఫిబ్రవరి 4





ప్రవర్తింప సాహసింపజాలము. కురుక్షేత్రమున అర్జునుడు కృష్ణునితో ఈ విధముగ అనెను.

* సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ! హే యాదవ! హె సఖేతి.
అజానతా మహిమానంత వేదం
మయా ప్రమాదాత్ ప్రణయేనవాపి.
యచ్చా వహాసార్థ మసత్కృతోసి
విహారశయ్యాసన భోజనేషు.
ఏకో థవా ప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వా మహమప్రమేయమ్.

ఓ దేవా! నీ మహిమను తెలియక నిన్ను సామాన్య స్నేహితునిగాను దలచి చనువునను, పొరపాటునను నేన నిర్లక్ష్యముగను సామాన్యుని వలె పిలుచుచుంటిని. మరియు విహారాహారశయనాదులందును నిన్నొంటరిగ గాని ఇతరుల ఎదుటగాని పరిహసించి అపరాధములను చేసితిని. నా యపరాధములను మన్నించుటకు నిన్ను వేడుచున్నాను.

నేడు గాంధిని గురించి అదే విధముగ అనుకొనవలసి యున్నది.


గాంధి హత్య భారతదేశమునకు లజ్జాకరమైనదిగాని, ఆయనకు కాదు. బహుశః ఆయన దివ్యమైన, మహిమాన్వితమైన మరణమునే పొందెను. మత సామరస్యమునకు జీవితము నర్పించెదనని ఆయన అనవరతము చెప్పుచుండెను. మతవైమనస్యమునకే ఆహుతి అయ్యెను. ఆయన జీవితము సాధించలేనిది ఆయన మరణము సాధింపగలదు.

1926 సం॥లో స్వామి శ్రద్ధానందును ఒక ముస్లిము యువకుడు హత్య చేసినపుడు గాంధి ఈ విధముగ వ్రాసెను.

''అత్యాశగ కనుపడవచ్చును. కాని స్వామిజీ ఔన్నత్యమును బట్టి ఆయన రక్తము మన పాపములను తుడిచి, మన హృదయములను క్షాళిత మొనర్చి శక్తివంతమైన ఈ రెండు సంఘములను (హిందువులు, ముస్లిములు) దృఢముగా బంధించగలదని ఆశకు ఆస్కారమిచ్చుచున్నది.'' స్వాతంత్ర్య పోరాటము జరుగుచున్నపుడు కారాగృహము బయటయున్న గాంధికన్న బంధింపబడిన గాంధి ఎక్కువ శక్తివంతుడని అందరూ అనుచుండుటకద్దు. అదే విధముగ మరణించిన అనంతరము గాంధి ఎక్కువ శక్తివంతుడు కాగలడు. మరణము మూలమున ఆయనకు అమరత్వము సిద్ధించినది.

కాని ఒక సత్యము మాత్రము వెల్లడి అయినది. అహింసా మార్గము హింసా మార్గము కన్న ఉచ్చమైనదని గాంధి హత్యవల్ల ప్రపంచమునకు తెలియవచ్చినది. ఆధ్యాత్మిక నైతిక శక్తులు తప్ప ఆయనకు వేరు ఆయుధములు లేవు. అహింస ఆయన భౌతిక శరీరమును రక్షింపలేకపోయి యుండవచ్చునుగాని, అజేయమని వెల్లడి అయినది. ఆయన మరణము తక్షణము దేశములో కలుగజేసిన మానసిక పరివర్తనము ఆ అంశమును స్థిరపరచుచున్నది. దౌర్జన్యము ఒక పరిమితిని దాటిన పిమ్మట శక్తిహీనము. అక్కడనుండి అహింసకే స్థానము. గాంధిని జీవితరంగము నుండి తప్పించిన దేశ రాజకీయ రంగమున ఆయన ప్రభావము తగ్గిపోవునని ఆశించినవారు, కేవలము భ్రమ చెందిరని చెప్పవలెను. నేడు ఆయన వ్యక్తి లేకపోవచ్చును గాని, ఆయన ప్రభావము అంతరింపజాలదు. గాంధి, గాంధి తత్వము ఈ దేశమున సుస్థిరముగ పాతుకొనిపోయినవి. అవి నానాటికి వ్యాప్తి చెందునేగాని సన్నగిలజాలవు. అంతేకాదు అంతర్జాతీయముగ పూర్వము లేని పలుకుబడి రాగలదు. వివిధ దేశములనుండి వచ్చిన ప్రశంసా వాక్యములు అందుకు నిదర్శనములు. ఆయన సిద్ధాంతము ఆయనను హత్య చేసినవంటి వారియెడ ప్రయోజనరహితము కావచ్చును. కాని అటువంటి వారు ఈ భూమిపైన ఎందరు గలరు! బహుకొద్ది. నేడు ప్రపంచమంతయు గాంధీ సిద్ధాంతమును అంగీకరించి అనుష్ఠింపకపోవచ్చును. కాని, నాయకులు అనేకులు ఆ సిద్ధాంత ఆధిక్యతను గ్రహించగలిగిరి. కొద్ది కాలములోనే అది తప్ప గత్యంతరము లేదని గుర్తించవచ్చును. సర్వ వినాశమగు ఆటంబాంబు నిర్మాణానంతరము అహింసయెడ అందరి దృష్టి మరలుచున్నది. ●

దాంపత్యంలో ఆత్మదర్శనం



ఆఫీస్ లంచ్ అవర్‌లో తన్నుగూర్చి జరిగిన చర్చే లలిత మనసును అల్లకల్లోలం చేస్తున్నది. గుండెల్లో ఏదో తెలియని వ్యథ సుళ్లు తిప్పుతున్నది. ప్రత్యేకించి మరే విషయంలో తన్ను వాళ్లు విమర్శించినా, పరిహసించినా, తన ఆలోచనలు, అలవాట్ల పట్ల ఉక్రోషం చూపినా, విసుర్లు విసిరినా తనింతగా కుసినారి పోవాల్సిన అగత్యం ఏర్పడి ఉండేది కాదు.

డా॥పి.వి. రమణ

తన జీవితానికి సారథిగా, కర్తగా, తన భవిష్యత్తుకు భద్రమైన పెన్నిధిలా తను భావించే తన భర్త మీద ఆ విసుర్లు.

మనసులోకి ఆ మాటలు తెచ్చుకొంటున్న కొద్దీ బాధతో, పరితాపంతో హృదయం మరిగి పోతూ ఉంది. మొదట తాను తేలిగ్గా తీసుకొని ఆ విసుర్లు వింటున్నా, వాళ్ల అంతరార్థం పసి గట్టాక, గుండెల్లో వణుకు. మనసులో కోత. నరాల్లో సల సల మరిగే తైలం.

"మీ ఆయనింత బ్రభాజమానమేమే లలితా" సుధ వెక్కిరింపు.

"ప్రపంచ జ్ఞానం బొత్తిగా అలవడకుండా చేయకే లలితా; శుక మహర్షి జాబితాలో కల్సిపోతాడు; నీ కింకా సంతానం గూడా లేదు" అరుణ సలహా; పరిహాసం.

వాళ్ల వెక్కిరింపుల్లో, పరిహాసాల్లో నిజమున్నదేమోవన్న శంక లలితను అదేపనిగ వేధిస్తున్నది. మనసు నిలకడ తప్పుతున్నది. తనింకా మాతృమూర్తి కాలేకపోవటం మనసును కోత కోస్తున్నది. అందుకు తనదే నా అపరాధం!

సుబ్బారావుతో తను జీవితం పంచుకొని నాలుగేండ్లయింది. లాలింపులు, ఊరింపులేగాని, వేరే ఏ విధమైన సాధింపులు, వేధింపులు తానెరుగదు. ఒక్క పరుషమైన మాట గాని, తన కయిష్టమైన పని గాని భర్త నుండి తాననుభవించి ఎరుగదు. తన మనసులోని ఆలోచన బయటకు వచ్చీ రాకముందే కార్యరూపాని కుపక్రమించేవాడు. ఇంటి క్కావాల్సిన వెచ్చాల్నుండి, వేడుకలవరకూ అన్నీ తన సలహామీదనే! తన తోడుతోనే సుబ్బారావు పాటించేవాడు. ఇంతెందుకు? తను ఏదిచెప్తే అదే శాసనంగా తీసుకొనేవాడు.

"కేవలం తీపేకాదే; కాస్త కారం గూడా ఉండాలి. లేకపోతే మొహం మొత్తిపోతుంది. మీ ఆయన పాపం తన వ్యక్తిత్వం మరిచి, గంగి రెద్దులా నీ వాడించినట్లల్లా ఆడటం నేర్చు కొన్నాడు."

కమల అన్న మాటల్లో ఆంతర్యమేమిటి? తను గంగిరెద్దులా భర్తను ఆడిస్తున్నదా? గానుగెద్దులా పని చేయిస్తున్నదా? ఇద్దరూ కలిసి ఇంటి పనులు కలగలిపి చేసుకోవటం నేరమా? మరి దాంపత్యమంటే కొట్లాటలు, కాట్లాటలకు నిలయం కావాలా?!

"వానచినుకులు భూమి కెంతవసరమో, కన్నీళ్ళూ భామామణి కంతవసరమేనే. లేనప్పుడు సుఖం విలువేం తెలుస్తుందే లలితా."

అరుణ ఎందుకిట్లా పోరుతూంటుంది అస్తమానం. తన్నుకొస్తున్న ఆలోచనల్తో లలిత మనసు వ్యగ్రమవుతున్నది. జీవననది అనురాగ ధారలతో ఏక ప్రవాహమై సాగినప్పుడే కదా బ్రతుకుకు సార్థకత! అట్లాగాక వీళ్ల వివరి స్తున్నట్లు, విసుర్లు విసురుతున్నట్లు ఆ జీవన ప్రవాహమే పాయలు పాయలై, పడిగలు పడిగలై ఇసుక మేటలువేసి దాంపత్య జీవితం చైతన్య రహితం కావాలా?

వాళ్ళ ఆంతర్యాలు అర్థమై, అసహ్యం పుట్టిస్తున్నా లలితలోనూ ఏదో తెలియని అశాంతి; ఆమె నరనరాల్లోనూ తీవ్రప్రకంపనం. అమృతమయమనుకొన్న తన జీవితంలోనూ వీళ్ళకు అసమగ్ర రూపాలే కన్పిస్తున్నాయా? ఆమె నరాలు చిట్లిపోయేటంతగా తీవ్ర చలనం లలితలో. నాలుగున్నరకే ఆఫీసు నుండి పరుగులా బయటకు వచ్చింది లలిత. అందిన బస్సునెక్కి ఇంటికి చేరింది. ఇంటి ముంగిట జామచెట్టు నీడన పడక కుర్చీ వాల్చుకుని నిస్త్రాణగా పడుకొంది. తాముంటున్న ఆ చిన్న ఇల్లే మధురానుభవాల సౌరభాలను గుబాళింపజేసే పొదరిల్లుగా, తొలిపొద్దు రాగరంజిత సూర్యకిరణాల చక్కిలిగింతలకు పరవశించి జాలువారే చిరుమంచు జల్లుగా, భావించింది లలిత. పైకి చూసింది. నీలితెరల మధ్య సమ్మోహన కరంగా ఉన్న ఆకాశం; దానికి మకిలి పూసి నట్లు, కాటిక పూతలు పూసినట్లు మబ్బులు; వీళ్ళ విమర్శలు, ఎత్తిపొడుపులు ఆ మబ్బులవంటి వేనేమో! పవిత్రమైన వైవాహిక బంధాన్ని ఎంత చులకన చేసి మాట్లాడారు! జీవితాంతం పెనవేసుకొనే అనుబంధాలకు ఎన్ని అడ్డుగోడలు కట్టాలని తాపత్రయపడ్డారు? హృదయాన్ని గాయపర్చటమంటే తాయిలాలు తిన్నంత ఆనందం వాళ్ళకి; ఏమి జన్మలో! కణతలు పట్టుకొంది లలిత.

స్కూటర్ ఆగిన శబ్దం. ఆరాటపడుతూ లోనికొచ్చాడు సుబ్బారావు ఒక్క అంగలో గెంతి వచ్చినట్లు. ఉదాసీనంగా, అన్యమనస్కంగా ఉన్న లలితను చూసి ఓ క్షణం ఆశ్చర్యపోయాడు.

"ఆదేమిటి లలితా; నా కోసం ఆగకుండా వచ్చేశావు; నీ కోసం మీ ఆఫీసు దగ్గర వేటాడి నంతపని జేశాననుకో."

లలిత జవాబివ్వలేదు. ఓ క్షణం నిశితంగా సుబ్బారావు వైపు చూసింది.

ఆ చూపు సుబ్బారావు మనసు లోలోతు పొరల పురివిప్పింది. అతను మరింత ఆశ్చర్య పోయాడు. లలిత చూపులు ఇవి కావు. ఆ చూపుల్లో జన్మజన్మల నుండి తీగ సాగుతూ వచ్చిన అనుబంధాల మధుర ఆకర్షణ లుంటాయి; సిరివెన్నెల జల్లులుంటాయి. జీవన వీణ నుండి పెల్లుబికే సప్తరాగాల స్పర్శ లుంటాయి; పరవశ పరామర్శలుంటాయి; తనకు తెలుసు; ఈ తీక్షణత లలిత వీక్షణాల్లో ఉండదు.

"అట్లా ఉన్నావేం లలితా?" అనున యంగా అడిగాడు సుబ్బారావు.

"ఎట్లా ఉన్నాను?"

మరోమారు నివ్వెరపోయాడు సుబ్బారావు లలిత ప్రవర్తనకు; పొడి పొడి మాటలకు. ఇవి లలిత మాటలు కావు. తనకు తెల్సు. పచ్చిక పట్టుల మీద పారాడే చల్లని పవనాల హొరతు లుంటాయి ఆ మాటల్లో. రాగాత్మలను మాధుర్యపరిచే మార్దత ఉంటుంది. సంశయాల మధ్య అల్లుకుపోతున్నాడు సుబ్బారావు.

"ఒంట్లో బాగాలేదా లలితా?" లాలనగా అడిగాడు.

"ఒంట్లో బాగానే ఉంది. మీరిట్లా నా వెంటపడి వేధించటం, వెలితి పర్చటమే బాగా లేదు."

సుబ్బారావు అవాక్కైపోయాడు. అతని అంతరంగంలో ఘోష;

"వేధించానా నిన్ను లలితా?"

"అవును; అవును; అవును" లలిత మనసును, దాని స్వచ్ఛతను పత్తిపట్టి దూసుకు వచ్చిన మాటలు.

సుబ్బారావులో ప్రాకిపోతున్న ఏదో భయం. ముసుగులా వ్యాపిస్తున్న అయోమయం. లలిత వైపు అర్థంగానట్లు చూశాడు; ఆర్ద్రంగా చూశాడు; ఆందోళనగా చూశాడు; మారు మాట్లాడకుండా వరండాలోకి వెళ్లి కుర్చీలో కూర్చొన్నాడు.

సాయం సంధ్య; కాల గమనంలో మరో మలుపు, అస్తమించబోయే సూర్యుని కొన మెరుపు. ఎంత వదిలేద్దామనుకొన్నా ఆఫీసులో కొలీగ్స్ మాటలు లలిత మనస్సును చుట్టు కొంటూనే ఉన్నాయి. ఆమెను దహించి వేస్తూనే ఉన్నాయి. ఆ క్షణంలో సుబ్బారావు పట్ల తాను ప్రవర్తించిన తీరు గాని, అందు కతడు చెందిన నైరాశ్యంగాని, పొందిన వేదన గాని ఆలోచించే స్థితి లలిత కోల్పోయింది. మనసులో మేకులు దిగినట్లు కదలబారి పోయింది లలిత. గుండెను కవ్వంతో చిలికినట్లు కల్లోలపడింది. ఎందుకింత అవమాన పరుస్తూ మాట్లాడారు వాళ్ళు? అతని అర్ధాంగిని కావటం భాగ్యమను కొంది. ఈ బ్రతుకంతా అతని చల్లని నీడలోనే సాగిపోవాలని ఆరాటపడింది. భర్త ప్రేమాను రాగాల అభిషేకాల మధ్య వేడుకగా జీవించటం తప్పా? మనసిచ్చిన మనిషితో అల్లుకుపోయి, లేదా హత్తుకుపోయి తిరగటం నేరమా? లలితలో పాదుకుపోతున్న కక్ష; పగ.

బరువైపోతున్న నిశ్శబ్దం. ఆలోచనల తెరల మధ్య, ఆవేదన పొరల మధ్య కరువైపోతున్న మాటలు. ఈ నాలుగేండ్ల తమ దాంపత్య జీవితంలో లలిత ఇట్లా ప్రవర్తించటం మొదటి సారి. సుబ్బారావుకు ఇది విడ్డూరంగానే కాదు, విషాదంగానూ ఉంది. ఈ సమయంలో గాలి కూడా వినరాదన్నంతగా తమ మధ్య సాగే గుస గుసలు; పరస్పరం ఒకరి కళ్ళల్లో ఒకరు ఆర్తితో, ఆరాధనతో దాంపత్య జీవన పరమార్థ అనుభూతి ముద్రలకై వెతుకులాట. సుబ్బారావు మనసులో సన్నని కోత; సందేహ జలపాతాల హోరు. వరండాలో నుండి లలిత ప్రవర్తనను గమనిస్తున్న

సుబ్బారావుకు ఆమేదో తీవ్ర ఆలోచనల మధ్య, ఆందోళనల మధ్య నలిగిపోతున్నదన్న సత్యం ధృఢపడింది. పోనీ, పోయి అనునయిద్దామంటే అన్యమనస్కంగానే కాదు, అసహనంగానూ ప్రవర్తిస్తూంది. ఆ ఉద్రేకంపాలు తగ్గాక, లలితే వచ్చి తన్ను వేధించే విషయం గూర్చి చెపుతుందన్న ఆశతోనే మవునంగా ఉండిపోయాడు.

ఆలోచనల్తో సతమతమవుతున్న లలిత మనసులోనూ మంట; కప్పుకుపోతున్న వేదన. భర్త అన్నవాడు భార్య బాధ్యతల్ని సంపూర్ణంగా స్వీకరించటం తప్పా? తన పురోగమనానికి, భౌతిక జీవనానికి రక్షణగా, భూమికగా, మనసుకు లాలస నిలయంగా, వేయి బంధాలతో, దాంపత్య అనుబంధాన్ని సంధానంగా చేయబోవటం, అదీ ఒక ప్రవక్తగా, ప్రయోక్తగా, పెన్నిధిగా ప్రేమ మూర్తిగా ఆనందపు వెల్లువలను తన జీవితంలో నింపబూనటం ఇతరుల కళ్ళమంటకు కారణమవుతుందా? గుడిలో దీపం వెల్గించే వారిని, జ్ఞానశిఖరంపై నిలిచి దివ్యబోధనలు చేసే వారినీ కూడా విమర్శించటం కొందరి జన్మహక్కేమో! లేదా వారి సంకుచితతత్వ అవనిక మనసు మహా కలశాన్ని ఆచ్ఛాదన చేసి ఉంచుతుందేమో! ఏమో! లలిత కళ్ళల్లో రెక్కలు విప్పుకుంటున్న చీకట్లు. ఆమె నెమ్మదిగా లేచింది. భర్త వైపు

దాంపత్యంలో ఆత్మదర్శనం

చూసింది. చేతిలో ఏదో పుస్తకమున్నా ధ్యాసంతా తనమీదనే తన భర్త "బ్రభాజమానమా?" అంటే? భార్య కొంగు పట్టుకు తిరిగేవాడనా? లేక ఏ సమర్థతా లేని వాడనా? ఆమెకు సరైన భావం స్ఫురించలే. మొత్తానికి "తన్ను విడిచి ఉండలేడన్న" అర్థంతోనే వాళ్ళా మాటలంది. ఏదో ఒక్కసారి అంటే సరిపెట్టుకోవచ్చు సరదాకు అన్నార్లే అని. ఇప్పటి కెన్ని సార్లు వీళ్ళా విసుర్లు ఆరంభించి? తమ అన్యోన్యతను చూసి ఓర్వలేని ఏడుపు అది. తమ ప్రేమాదరాల కళాత్మక దివ్య జీవనాన్ని చూసి తట్టుకోలేక కక్కే విషమది. ఫూల్స్..., కసితీరా మరోమారు తిట్టుకొంది. ఈ చిన్న విషయానికే తినింత సెన్సిటివ్‌గా ఆలోచిస్తున్నదేమిటి? మానసికంగా తాను ఇంత బలహీనురాలా!

"అరె...ఆయనకు కాఫీకూడా ఈయలేదా" అకస్మాత్తుగా మనసులో కొచ్చి ఉన్న పళంగా ఇంట్లోకి వెళ్ళింది. లలిత పరుగు వరుగు నడక సుబ్బారావును గంద్రగోళ పరిచింది. పలకరించక పోతేమానె, కనీసం కన్నెత్తైనా పరామర్శించక పోవటం అతనికి మరింత బాధ కల్గించింది. ఇంకో రెండు నిముషాలాగి అసలు విషయమేమిటో లలితనే అడుగుదామని తన్ను తాను సముదాయించుకొన్నాడు.

"కాఫీ తీసుకోండి" కాఫీ గ్లాసుతోవచ్చింది లలిత. "మరి నీవు" ఆశ్చర్యపోతూ అన్నాడు సుబ్బారావు. ఇద్దరూ కలిసే కాఫీ త్రాగటం ఆనవాయితీ. దానికి ఇప్పుడు అవరోధం.

"అబ్బబ్బ... ముందీ గ్లాసు అందుకోండి" లలిత మనసులో ఇంకా అసహనపు చారలు


కిక్కురుమనకుండా గ్లాసందుకొన్నాడు సుబ్బారావు. లలిత మాటను అతిక్రమించటం ఏ స్థితిలోనూ అతని కలవాటు లేదు.

"వచ్చి అర్థాంగనైనా దేవిగారికి ఇప్పటికి దయగలిగింది."

తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు. లలిత ముఖంలో కుదురుకోపోతున్న ప్రశాంతత తిరిగి చెదిరి పోయింది.

"అట్లా దేవిగార్లు, గీవిగార్లు అని పిలవక పోతే మామూలుగా పిలవలేరూ."

సుబ్బారావు తత్తరపడ్డాడు. విచిత్రంగా లలిత వైపు చూశాడు. ఆమెలో గూడుకట్టుకొంటున్న ఆవేదన, నిబ్బరాన్ని చాటు చేసుకున్న అశాంతి ముసుగు వైఫల్యంలో చిక్కుపడిపోయినట్లుగా అర్థంకాని తపన. మొత్తానికి లలితచుట్టూ బాధాతప్తవలయాలు. "ఎక్కుపెట్టిన బాణ



మేదో'' లలితపట్ల సిద్ధమై ఉందన్న ఆంతర్యం తెలిసొచ్చిందతనికి. దాని పరిణామమేతీరులో ఉంటుందో ! సుబ్బారావులో సన్నని వణుకు.

''మార్కెట్ కెళ్దామా ? కూరలు తీసుకు రావాలిగా ?''

''ఏం అవసరంలేదు. ఈ పూటకు ఊరగాయల్తో సరిపెట్టుకోవచ్చు. రేపుదయం బండివాడొస్తాడు; కావాల్సినవి తీసికోవచ్చు'' నిశ్చలంగా అంది లలిత.

సుబ్బారావు మరోమారు బిత్తరపోయాడు. ఈ సస్పెన్స్‌ను భరించలేనంతగా బేలమై పోయాడు. ఆహ్లాదం, ఆనందం, పారవశ్యం ఈ ఇంటినుండి, అసలు వాతావరణంనుండే మాయమైపోయాయా అన్న సందేహంలో తన్నుకులాడిపోయాడు.

''అది కాదు లలితా; మార్కెట్‌లో మనకు నచ్చిన తాజా కూరలు తెచ్చుకోవటం మామూలుగా మనకు'' తన ధర్మంగా అన్నాడు.

లలిత చివ్వున తలెత్తింది.

''ఏం ఆ ముష్టి కూరగాయలకోసం ఇద్దరం పోయిరావాలా ?''

సుబ్బారావు విలవిల్లాడిపోయాడు. భూగోళం మామూలుగా తిరుగుతూందా అన్న సందేహంలో కొట్టుకు మిట్టుకులాడాడు. కొత్త ముద్రలు వేస్తున్నది లలిత. కొత్త స్వరాలతో పలుకుతున్నది. జీవన మాధుర్యానికి, రాగపరిపూర్ణతకు అకారణంగా గండి పడింది. దాంపత్య సౌందర్య లాలస అనుభూతికి, జీవన తన్మయత్వానికీ ఎక్కడో గండి పడింది. అసమగ్రత, అశాంతి స్థావరమేర్పర్చుకొంటున్నాయి. ఏమిటో ఈ అకాల గ్రహణం. అగోచరంగా, అస్పష్టంగా ప్రవహించే ఈ అశాంతికి కారణమేమిటో తెల్సుకోలేక కదలబారిపోయాడు. అనేక జీవన రాగ సమ్మోహన స్వరమేళ నాలపించే వీణ తంత్రి ఎక్కడో విచ్ఛిన్నమైంది. ఏదో చట్రంలో ఇరుక్కొని తనకు తెలియకుండానే గిరికీలు కొడుతున్నట్టు కల్లోల పడిపోయాడు. పోనీ, అసలు విషయమేమిటో లలితనే అడిగి తెల్సుకొందామంటే మరింకేం పరిణామాలు సంభవిస్తాయో నని బిగుసుకుపోయాడు.

ఆ రాత్రి... మామూలుగా ... వికసించిన కలువలు పరామర్శించు కొన్నట్లుగా గాక, అరమోసిన కన్నులతో సర్వంమరిచి ఏకస్వరంతో మాట్లాడినట్లుగా గాక, కాలచక్ర పరిభ్రమణాన్ని ప్రక్కకుతోసి హృదయ స్పందనల్ని ఏకం చేచినట్లుగా గాక, ఏవేవో మధురలోక ద్వారాలను తెరిచి, ఆ తేజస్సులో, ఓ జస్సులో లీనమైపోయి నట్లుగా గాక, జీవిత పరమార్ధ సంగమగీత మధురాలాపన అన్నట్లుగా గాక...ఎవరికి వారుగా, ఎడ ఎడంగా, రగిలే యోగాగ్నుల్లా, సంబర రహితంగా కాలాన్ని వెళ్లదీశారు ఆ యువ దంపతులు.

ఆ ఉదయం గృహకృత్యాలు యధావిధిగానే జరిగినై. ఏకోన్ముఖమైకాదు. పరస్పర సంస్పర్శనతోకాదు, స్పర్శాపారవశ్యంతో అంతకంటేకాదు. లలిత అనుగ్రహానికి దూరంగా, ఆమె అనురాగానికి తన అంతరంగాన్ని ముడుపు కట్టే అవకాశం లేకుండా, ఏకంగా, శోకంగా గడపడటంతో జీవితం అర్థం లేనిదనిపించింది. నిష్ప్రయోజన మనిపించింది. ఆనంద సీమల్నుండి ఏ అగాధ లోయల్లోకో జారిపడ్డట్లనిపించి కళ్ల నీళ్ల పర్యంతమయ్యాడు సుబ్బారావు.

ఉదయం తొమ్మిదిన్నరకు స్కూటర్ స్టార్ట్‌చేస్తున్నట్లు శబ్దం చేశాడు సుబ్బారావు. అయినా లోపల నుండి బయటకు రాలేదు లలిత. అసలు తన ఉనికినే పొక్కనీయలేదు. ఈ నాలుగు సంవత్సరాల నుండీ స్కూటర్ డ్రైవ్‌చేస్తూ తనూ, వెనుక లలితా కూర్చొని ముచ్చట్లాడుకొంటూ పోవటం, ఆమెను ఆమె ఆఫీసు వద్ద దింపి, తను తనాఫీసుకు వెళ్లిపోవటం రివాజు. మామూలుగా తనకంటే ముందే మెరుపులా స్కూటరు వద్దకు చేరే లలిత, ఈరోజు ఇంకా కదిలి రాకపోవటం సుబ్బారావుకు ఆశ్చర్యంగా ఉంది. ఆందోళనగానూ ఉంది. రెండుసార్లు హారన్ మ్రోగించాడు లలితను ఆహ్వానిస్తున్నట్లుగా. ఆ ఆహ్వానంలో సుబ్బారావు మమేకమై ఉండగానే దూసుకు వచ్చినట్లుగా వచ్చింది. లలిత సుబ్బారావు కన్నుల్లో వ్యాపిస్తున్న కాంతి –

''స్కూటర్ మీద మీరేమీ దింపనవసరం లేదు నేనేం పసిపాపను కాను. మీరు వెళ్ళండి. నేబస్సులో వెళ్తా. సాయంత్రమూ నా కోసం మా ఆఫీసుకు రావద్దు'' దేనికైనా సిద్ధపడాలన్నంత స్థిరత్వం లలిత కంఠంలో.

''బస్సులోనా ?'' విలవిల్లాడుతూ అన్నాడు సుబ్బారావు.


''ఏం ?''

''ఏం లేదు'' నసుగుతూ. సుబ్బారావు నిదానించి ఓ క్షణం లలిత వైపు చూడటానికే అతనికి భయం వేసింది.

శూన్యహృదయంతో, నిస్తేజంగా భూమిపై విసరబడి ప్రమేయ రహితంగా తిరిగే బొంగరంలా వెళ్ళిపోయాడు సుబ్బారావు స్కూటర్‌మీద.

ఆ సాయంత్రం లలిత దాదాపు ఆజ్ఞాపించి చెప్పినట్లు ఆమె ఆఫీసు వద్ద స్కూటరాపకుండా తిన్నగా ఇంటికొచ్చాడు సుబ్బారావు. లలిత ఇంటికొచ్చుంటుందన్న ఏదో ఆశ, తలుపుకు తాళం చూసింతర్వాత హరించుకుపోయింది. హతాశుడైనాడు సుబ్బారావు. ఆమె మాట్లాడకపోయినా, ఆగ్రహించినా ఎదురుగా కన్పిస్తేచాలు సుబ్బారావు హృదయం తేజోపూరితమవుతుంది. ఆమె ఆకర్షణ ఎన్నో కోట్ల కాంతికిరణాలను ప్రసారం చేస్తుంది అతనిలో. లలిత దర్శన పారవశ్యంలో లోకమంతా ఓ దివ్యమందిరమే సుబ్బారావుకు. లలిత రాకకు మరికొంత సమయం పడుతుందన్న భావమే అతన్ని కంపింప జేసింది. ఒంటరితనం రాకాశిలా విరుచుకు పడుతున్నట్లని పించింది. చొక్కాలన్నీ మాసి ఉన్నాయి. రెండు చొక్కాలు తీసికొని, వాషింగ్ సోప్‌తో బాత్‌రూం వైపు నడవబోయాడు సుబ్బారావు. అతని దృష్టి అస్తవ్యస్తంగా మధ్య ద్వారంమీద వేసి ఉన్న లలిత చీరమీద పడింది. అదీ మాసి ఉన్నట్లే అన్పిం







చింది. దాన్ని భుజాన వేసుకొని బాత్‌రూంలో ప్రవేశించాడు సుబ్బారావు.

పావుగంట గడిచింది. మనసును నొక్కిపట్టి సలపట పెడుతున్న ఆలోచనల మధ్య, ఆవేదనల మధ్య తన పని తాను చేసుకుపోతున్నాడు సుబ్బారావు.

"ఛీ...సిగ్గు లేదు మీకు చీరలు తకటానికి?"

ఎప్పుడొచ్చిందో, బాత్రూంలో సుబ్బారావును ఎప్పుడు గమనించిందో లలిత ప్రశ్నించింది ఉరిమినట్లు. ఉల్క జారినట్లు.

"ఎవరిదో కాదుగా ఈ చీర" నసుగుతూ, నానుతూ సుబ్బారావు.

"నాదైతే మాత్రం... మ గ పు ట క పుట్టలే...?"

లలిత పూర్ణానుగ్రహం లభిస్తుందనుకొన్న సుబ్బారావుకు ఆమె ఛీత్కారం అంతే మోతాదులో అందటంతో అల్లల్లాడి పోయాడు సుబ్బారావు. కనుపించని కవాటాలేవో తన్ను బందీచేసి ఉంచుతున్నాయి. కొట్టుకు మిట్టుకులాడి పోయాడు సుబ్బారావు.

"లేవరేం ఇంక ?" గర్జించినట్లుగా లలిత.

మౌనంగా లేచాడు సుబ్బారావు. "ఏమిటో ఈ ప్రళయం" గొణుక్కొంటూ వరండాలోకి చేరాడు.

కారణం తెలియని, తెల్సుకోలేని, లలితనుండి గ్రహించలేని ఈ అకారణ ఆగ్రహ తుఫాన్ మధ్య బితుకు బితుకుమంటూ వారం రోజులు గడిపాడు సుబ్బారావు. అతని పాలిట ఈ వారం రోజులూ దుర్భరమైనవి; దుస్సహమైనవి. ఎన్నోయుగాలు, ఏకాంతంగా కొండ గుహల్లో కుమిలి కుమిలి కుసినారిపోయినట్లైంది సుబ్బారావు పరిస్థితి. అతని రూపం గూడా దిగిపోయింది.


* * *


"లలితా ... చదువుకొన్న దానివి; నియమబద్ధమైన ఆలోచనలు, ఆశయాలు కలదానివి; నీవు కూడా ఇట్లా అయిపోవటం నాకేం నచ్చ లేదు; పైపెచ్చు కోపంగా గూడా ఉంది."

స్నేహితురాలు శాంత ప్రశాంతంగా అంది లలితతో ఆఫీసు లంచ్ అవర్‌లో.

"నీ వంతు కోపం గూడాకానీ" పేలవంగా, విస్తేజంగా లలిత.

"ఏమిటే చూపేది కోపాలు. ఈర్ష్యతో చచ్చిపోతూ ఎవరో ఏదో వాగారని బంగారంలాటి కాపురంలో కల్లోలం రేపుకుంటావా ? శాంతి స్వరూపుడైన నీ భర్తను కుళ్ళగొడతావా ? నిన్న మార్కెట్‌లో చూశాను మీ ఆయన్ని. ఆయన వాలకం చూసి నా కళ్ళే చెమర్చాయి. ఇప్పటికైనా కళ్ళుతెరు. నీ కాపురం నీవు చేజేతులా రాజేసిన నిప్పును నీవే చల్లార్చుకో" అనునయంగా, వాత్సల్యంగా బోధించింది శాంతి;





"నే నశక్తురాల్నవుతున్నాను శాంతీ. ఏ నిర్ణయమూ తీసుకోలేని అసమర్థురాల్నవుతున్నాను" లలిత కన్నుల్లో నీటిపొర.

"లలితా... ఈ వారం రోజుల్లో నీలో వచ్చిన మార్పు, శారీరకంగా, మానసికంగా నిన్నిట్లా బలహీనపర్చింది. అంతే; నీవెంత స్థిరచిత్తురాలివో నాకు తెల్సు. నీ విజ్ఞతా నాకు తెల్సు. నిన్నింతగా చీకటి మూలల్లోకి విసిరివేసిన ఆ సుధ, అరుణల కాపురాల సంగతి నీకు తెలిస్తే వాళ్ళ మాటలకు నీ వెంత నిరర్ధకమైన విలువ ఇచ్చావో నీవే గ్రహించగలవు..."

మౌనంగా శాంతివైపే చూస్తుండిపోయింది లలిత.

"సుధ, అరుణల ఇళ్ళూ మా వీధిలోనే. ఆ ఇద్దరి దాంపత్య బంధాలు కొనఊపిరిలో ఉన్నాయి. సుధకూ భర్తకూ క్షణం పడదు. వాళ్ళ నిత్య కొట్లాటలు,కాట్లాటలు వీధివాళ్లకు వినోదం కల్గించే స్థాయికి చేరినై. పైగా అతను ఇంకో ఆవిడతో వేరే కాపురంగూడా అఘోరిస్తున్నాట్ట. ఇహ అరుణ భర్త అన్ని వ్యసనాలకు దాసోహమైన వ్యక్తి. త్రాగుడు, పేకాట; ఆఫీసు ఎగ్గొట్టి క్లబ్బుల్లోనే కాలక్షేపం. వీళ్ళ కాపురాలు ఎప్పుడు పుటుక్కుమంటాయో తెలీదు. వాళ్ళకు జీవితంలో మిణుకు మిణుకుమంటూకూడా కన్పించని శాంతి, ప్రశాంతి, ప్రేమ, అనురాగాలు, పరస్పర అర్పణలు ఏకోన్ముఖమై నీలో కన్పిస్తుంటే, వాళ్ళు ద్వేషంతో రగులుకుపోయారు. భర్త లాలన, అనురాగం, మమత పరిపూర్ణంగా నీకు లభించటం చూసి నీ ఆనందజ్యోతి నార్పాలని చూశారు. నీ భర్త ఔన్నత్యాన్ని కించపర్చాలని చూశారు. దాంపత్యంలో ఏ విలువలకూ, సంతోషాలకు నోచుకోలేని సుధ, అరుణల మాటలకు లేని గౌరవాన్ని ఇచ్చినట్లుగా ప్రవర్తించావు నీవు. ఇహ కమల సంగతి సరేసరి. మూడు పదులు దాటినా దానికి కళ్యాణయోగం పట్టలేదన్న ఉక్రోషం దానికుండనేఉంది. నీ జీవన ప్రాంగణంలో జిల్లేళ్ళు నాటాలని చూస్తున్న వాళ్ళని సహించి భరించటమే కాకుండా, నిన్ను నీవు శిక్షించుకోవటంద్వారా వాళ్ళకు ఓ పెద్ద పీట వేశావు. ఇంకా ఏం చెప్పాలి నీ వంటి దానికి. నీవిట్లాగే వ్యవహరిస్తే నీ భర్తే కాదు,భగవంతుడుకూడా నిన్నుమెచ్చడు" మార్దవంలో, పరమ శాంతంగా అంది శాంత.

లలిత మనస్సులో తీవ్ర సంచలనం. తనచుట్టూ ఏర్పడిన కాంతి వలయాల్ని, చీకటి నిలయాలుగా తనంతటతానే మార్చుకొంది. నిజమే; తన మనస్సులో, ప్రాణంలో, సమస్తంలో అల్లుకుపోయిన భర్తను అశాంతిపాలు జేసింది; ఎందుకు? ఏ ప్రయోజనాన్నాశించి ? లలితలో ఎడతెగని ఆలోచనలు.

"ఏమిటే ఇంకా ఆ ఆలోచన. ఇహనైనా ఆ స్వార్థ శక్తుల్ని ప్రతిఘటించి ప్రశాంతంగా ఉండు; నీ జీవితాన్ని, దాంపత్యాన్ని వెనుకటిలా తేజోమయం జేసుకో."

"అది కాదే శాంతీ ..." అర్ధోక్తితో ఆగిపోయింది లలిత.

అభివృద్ధి

అభివృద్ధి
నిరోధకత్వం
స్త్రీ[illegible]
[illegible]త్వం!
పురుషుని
దాసత్వం !
స్త్రీ
సహనం
వీడితే—
పురుషుని
బద్ధకం
పారిపోతుంది.
అభివృద్ధి
పురోగమిస్తుంది.

— డా॥ బిట్టు వేంకటేశ్వర్లు.

"ఊఁ ... చెప్పు."

"నా ప్రవర్తనను ప్రతిఘటించే తెగువా, రోషం ఆయనలో వస్తాయని ఆశపడ్డాను. నన్ను శాసించి, దండించే ఒకానొక సమ్మోహనమైన పౌరుషం, నిశ్చల ధీరత్వం ఆయన్నుండి ఆశించాను. నా వల్ల ఆయన 'శుక మహర్షి'లా మారతారేమోనన్న భయమూ నాకేర్పడింది. అరుణ పరిహాసం చేసినట్లు నా కడుపూ ఇంకా పండలేదు. నా అపరాథంగా ఆ శాపం అట్లా పొందరాదనే వ్యథ చెందాను. ఈ శాపంలో ఆయనా భాగం పంచుకోరాదనే అట్లా ప్రవర్తించాను. కానీ ... ఆయన ఆంతర్యం తెల్సికొన్న నాకు, నేనెంత అజ్ఞానంతో ఆలోచించానో అర్థమవుతూంది. నా చుట్టూరా అల్లుకుపోయి, నా తోటిదే జీవితం అన్నట్లుగా నా ప్రేమలో మునిగిపోయారాయన. నా మనోపరితలం నుండి ప్రక్కకు మళ్ళలేనంతగా నా ఆలోచనలోనూ, ఆనందంలోనూ తన్ను తానుగా కల్సిపోయారు. నేను తోడులేనిదే కనురెప్పను సైతం కదిలించలేరన్న సత్యాన్ని ఈ వారం రోజుల్లో తెల్సుకొన్నాను" నిశ్చలంగా, ప్రశాంతంగా అంది లలిత.

"ఇందుకు నీవు గర్వపడాలి. నీ దాంపత్య దివ్యస్థితికి పొంగిపోవాలి. సంతానానికి అప్పుడే తొందరేముంది లలితా ..." అంటున్న శాంతి మాటలు వింటూనే వడివడిగా ఆఫీసు వైపు నడిచింది. ఆఫీసర్ పర్మిషన్ తీసికొని బయటకొచ్చి సుబ్బారావు ఆఫీసు వైపు బయలుదేరింది ఆటోలో లలిత. లలితలోని ఆనందం ఇప్పుడు అవ్యక్తం. మనసులోని ప్రశాంతతకు పరిధుల్లేవు. సుబ్బారావు కూడా ఆఫీసర్ పర్మిషన్ తీసికొని లలితతో ఇంటికి చేరాడు

తనను చుట్టచుట్టుకొని, అల్లుకుపోయి, అణువణువులోనూ ఆత్మదర్శనం చేయిస్తున్న లలితను చూసిన సుబ్బారావుకు మళ్ళీ బ్రహ్మానందస్థితి గోచరించింది. భూమి, స్వర్గం సంధానం చెందినట్లనిపించింది. ★

సీరియల్



జీవనమురళి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

12

(గత సంచిక తరువాయి)

జీవనతో తోటలో చెప్పినట్లుగానే, ఇంద్రసేన్ తన పుట్టినరోజు విందుకు ఆహ్వానం అందించడం కోసం, పరమేశ్వరం ఇంటికి వచ్చాడు. వాకిట్లో కారాగిన శబ్దం విని అలవాటు ప్రకారం 'ఎవరు వారు?' అంటూ బయటకు రాబోయి, మళ్ళీ తనున్న స్థితి జ్ఞాపకం వచ్చి గది తలుపులు రెండూ మూసేసుకున్నాడు ఆయన —హాల్లోకి ఎవరు వచ్చినా తను కనిపించకుండా. మురళీకృష్ణ తన గదిలో నుండి బయటకు వచ్చాడు. వర్ధనమ్మ వంట ఇంట్లో తలుపు ప్రక్కన నిలబడింది. జీవన లోపల కాఫీ కలుపుతోంది.

ఇంద్రసేన్ వాకిలి గేటు తీసుకుని లోపలకు వచ్చాడు. 'మాష్టారూ!' అని పిలిచాడు.

''మాష్టారు లేరు!'' మురళీకృష్ణ కటువుగా అన్నాడు. ''ఏమన్నా చెప్పమంటారా?''

ఇంద్రసేన్ చొరవగా హాల్లోకి వచ్చాడు. అక్కడ వున్న కుర్చీ తన దగ్గరకు లాక్కుని కూచున్నాడు. గోడ గడియారం సాయంకాలం మూడయినట్లు టైము చూపుతోంది. బయట ఎండ కాంతివంతంగా వుంది. లోపల చల్లగా వుంది.

''కాసిని మంచినీళ్లిస్తారా?''

జీవన లోపల్నుంచి మంచినీళ్లగ్లాసు ఒక చేత్తోనూ, మరోచేత్తో కాఫీ కప్పునూ పట్టుకొచ్చింది. ''తీసుకోండి!''

ఇంద్రసేన్ ఆమె వేపు నవ్వుతూ చూసాడు. ''ప్రొద్దున్నే జీవనగార్ని దేవాలయంలో కలుసుకున్నాను!'' అన్నాడు మంచినీళ్లగ్లాసు అందుకుంటూ, మురళీకృష్ణతో అతను ఆమె చేతివేలి వంక చూశాడు. ఉంగరం లేదు. మంచినీళ్లు గటగటా తాగేసి, ''ఉంగరం నచ్చలేదా?'' అన్నాడు అర్థవంతంగా.

''కాదుకాదు. అమూల్యమైంది కదా, అవతలపెట్టాను!'' అన్నది జీవన.

ఇంద్రసేన్ కాఫీ నింపాదిగా ఆర్పుకుంటూ తాగుతున్నాడు. ''నా బర్త్‌డేకు మిమ్మల్నీ, మాష్టార్నీ పిలవడంకోసం వచ్చాను'' అన్నాడు.

''మాష్టారు ఊళ్లోలేరు!'' మురళీకృష్ణ కంఠంలో ఆర్ద్రత లేదు.

''వచ్చే ఆదివారం నాటికి వస్తారుకదా?'' ఇంద్రసేన్ జీవన—మురళి వేపు సూటిగా చూస్తూ, వున్నట్టుండి అడిగాడు. ''మాష్టారికేమన్నా దెబ్బలు తగిలాయా?... డబ్బు పోయిందా?''

మురళీకృష్ణ ఉలిక్కిపడ్డాడు. లోపల గదిలో వాళ్ళ సంభాషణ వింటున్న పరమేశ్వరం కళవళ పడ్డాడు.

''లేదే!'' ఎంత దాచుకుందామనుకున్నా మురళీకృష్ణ గొంతులో ఏదో జీర.

''ఎందుకట్లా అనుకున్నారూ?''

''ప్రొద్దున్న జీవన...!'' అంతవరకూ అని, ఆగి వాళ్ళ రియాక్షన్స్ కోసం వెయిట్ చేశాడు ఇంద్రసేన్.

''నేనా?...నేనేవన్నానూ?'' జీవన బేలగా అడిగింది.

''ఇంటికి వచ్చిన వాళ్ళకు డబ్బు సంచీలిచ్చినట్టే ఇచ్చి, మళ్ళీ వాళ్ళ తలలు పగలగొట్టించగలనూ అన్నది. ఆమె మాటల్లో మాష్టారిగారికి ఏదో అపాయం జరిగినట్టే నా మనసు శంకిస్తోంది. నిజం చెప్పండి, నా మీద ఆమె అభాండం వేసినా ఫర్వాలేదు. ఇవ్వాళ వుండి రేపు వెళ్ళిపోయే గెస్ట్ ఆమె! మాష్టారు నాకు పితృ సమానులు! అంతేకాదు, నేను తలపెట్టిన బృహత్తర కార్యక్రమానికి పది కాలాలపాటు వారి అండదండలు నాకు కావాలి, వారు చల్లగా

జరిగిన కథ — 9: ఇంద్రసేన్ పరమేశ్వరంగారిని సర్వీసునుంచి సస్పెండు చేస్తాడు. ఆయన స్కూలులో జరిగిన విషయాలన్నీ కుటుంబ సభ్యులతో చెపుతారు. తన తండ్రికి జరిగిన అవమానం విన్న మురళీకృష్ణ కోపంతో ఇంద్రసేన్ ఇంటికి వెళ్ళి, తన తండ్రిని సస్పెండ్ చేయడానికి గల రీజన్స్ చెప్పమని అడుగుతాడు. ఇంద్రసేన్ సరైన కారణాలు చెప్పలేకపోతాడు. నాగలింగం పెట్టిన షరతులు విన్న మురళీకృష్ణ ఆవేశానికి లోనవుతాడు. ఇంద్రసేన్ తన మనుష్యులచేత మురళీకృష్ణను బయటకు గెంటేస్తాడు. అసలు ఇలా జరగటానికి కారణం జీవనే అన్నట్టుగా బామ్మ నిందించగా ఆమె వెళ్ళిపోతుండగా బామ్మే జీవనను ఇంటికి తీసుకువస్తుంది. మురళీకృష్ణ, పరమేశ్వరం స్కూల్ స్టాఫ్‌తో కలిసి యాజమాన్యంతో ఫైట్ చేయటానికి ప్రయత్నిస్తుంటారు. వీరికి విద్యార్థులు కూడా మద్దతు ప్రకటిస్తారు. పరమేశ్వరంగారు స్కూల్లోకి వెళ్ళి ఛార్జి తీసుకుంటారు. పరమేశ్వరంగారిని, ఊళ్లోని మిగతా పెద్దలని తన ఇంటికి ఆహ్వానించి వారితో తాను అభాగ్యుల కళాలయం ఒకటి ప్రారంభించబోతున్నానని దానికై తన ఆస్తిలో నాలుగో భాగం విరాళంగా ఇస్తున్నానని చెపుతాడు ఇంద్రసేన్. మిగతా పెద్దలంతా తమ శక్తికొద్దీ ఇచ్చిన విరాళాల మూటను ఇంద్రసేన్ వద్దంటున్నా వినకుండా దాచమని బలవంతంగా పరమేశ్వరంగారి చేతికిస్తాడు. చీకట్లో ఇంటికి వెళుతున్న పరమేశ్వరంగారిని కొట్టి నాగలింగం విరాళాల మూటను తిరిగి తెచ్చి ఇంద్రసేన్‌కు అప్పగిస్తాడు. ఇంత జరిగినా పరమేశ్వరంగారికి ఇంద్రసేన్‌పై సరికొత్తగా ఏర్పడిన నమ్మకం చెదరలేదు. జీవన తన పుట్టినరోజున దేవాలయానికి వెళ్ళగా అక్కడ ఇంద్రసేన్ కనపడి పుట్టినరోజు కానుకగా వజ్రపుటుంగరం ఆమెకు బహూకరిస్తాడు. మురళీకృష్ణ ఆ ఉంగరం తీసిపారేయమంటాడు. తన గురించి కొన్ని రహస్యాలు ఇంద్రసేన్‌కు తెలుసు గనుక అతనికి భయపడి ఆ ఉంగరం తీసుకున్నట్టు మురళీకృష్ణతో చెపుతుంది జీవన. అలాంటి భయాలు అనవసరం అంటాడు మురళీకృష్ణ.

వుండాలి. చెప్పండి ఏం జరిగింది ? నిజంగా మేష్టారికేమన్నా అపాయం జరిగిందా ?''

''జరిగింది నాయనా; నాకు ప్రాణాపాయమే జరిగేది. నామీద హత్యా ప్రయత్నం జరిగింది. డబ్బు పోయింది'' అంటూ గది బయటకు వచ్చి నిజం చెప్పేద్దామనుకున్నాడు పరమేశ్వరం. మళ్ళీ మురళీకృష్ణ మాటలు వినబడడంతో ఆగి పోయాడు.

''ఏమీ జరగలేదు.'' నిబ్బరంగా అన్నాడు మురళీకృష్ణ. ''మా నాన్నగారు క్షేమంగానే వున్నారు. అత్యవసరమైన పనులమీద ఊరుకి వెళ్ళారు. మీ పుట్టినరోజు నాటికి తప్పకుండా వస్తారు. మీరు వచ్చి వెళ్ళిన సంగతి తప్పకుండా చెబుతాను. ఆయనకు దెబ్బలేమన్నా తగిలాయే యోనని మీరు మహా వర్రీ అయిపోయారని కూడా చెబుతాను. ఇంతేకదా !''

వెళ్ళిరండి ఇంక అన్న అర్థ సూచనతో మురళీకృష్ణ ఆ మాటన్నాడు.

సంభాషణను అంతటితో త్రుంచేసి ఇంద్రసేన్‌ను వీధివాకిలి వరకూ వెళ్ళి సాగనంపి వచ్చాడు. కార్లో ఎక్కబోతూ అన్నాడు ఇంద్రసేన్ :

''ఆ రోజున యూత్ క్లబ్‌లో ఆటల పోటీలేర్పాటు చేశాను ! మీరు తప్పకుండా పాల్గొనాలి.''

''మీరు పార్టిసిపేట్ చేస్తున్నారా ?''

''ఆ పోటీలు నా గౌరవార్థం కదా ! అయినా మీరు కోరితే, నేనూ పాల్గొంటాను.''

''ఇది నాకు ఇన్విటేషనా ? ఛాలెంజా ?''

''యాజ్ యూ లైక్ ఇట్ !''

కారు వెళ్ళిపోయింది. మురళీకృష్ణ ఇంట్లోకి తిరిగివచ్చాడు. పరమేశ్వరం తన గదిలో నుంచి బయటికి వచ్చి, ''నిజం చెప్పేస్తే బావుండేది కదూ ?'' అన్నాడు.

మురళీకృష్ణ వ్యంగ్యంగా అన్నాడు. ''ఇంకా గ్రహించలేదా నాన్నా ! ఇది నిశ్చయంగా అతగాడి నిర్వాకమే !''

''ఎట్లా చెప్పగలవూ ?''

''ప్రొద్దున్న జీవన నోరు జారడంతో అతనికో మంచి అవకాశం దొరికింది, ఇక్కడకు వచ్చి అసలు సంగతి ప్రత్యక్షంగా చూడడానికి వచ్చాడు. ఏమీ కనిపించలేదు. ఉండబట్టలేక అడిగేశాడు. నిజం బయటపడలేదు. నేను ఉలకలేదు, పలకలేదు. దాంతో ఆహ్వానించేసి అవతలకు తప్పుకున్నాడు.''

''పాపం, నిజంగా నాకు దెబ్బలు తగిలాయేమోనన్న ఆదుర్దాతో, డబ్బు పోయిందేమోనన్న శంకతో అడిగి వుండొచ్చు కదా ?''

''నాన్నా ! మీలాగా ధర్మంగా ఈ రోజుల్లో ముక్కుకు సూటిగా ఎవరూ ఆలోచించరు. అంతా వంకర దారి. వంకరగా ఆలోచిస్తేనే మనమూ అడంగు చేరగలిగేది. ఎట్లాగూ మీరూ, నేనూ ఆ మహాపురుషుడి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొనబోతున్నాము కదా, చూడండి, ఇంకా ఏమేం జిత్తులు వేస్తాడో ఆ పుణ్య పురుషుడు !''

ఆ మాటలు తండ్రితో అని, ఆయనను ఆ ఒక్క పూటకూ గడప దాటవద్దని మరీమరీ అభ్యర్థించి, జీవనను తీసుకుని మురళీకృష్ణ బయటికి వెళ్ళాడు. ఆనందపురం దీపతోరణాలతో, సాయంకాలపు జనసందోహాలతో సందడిగా వుంది. పార్కుల్లో పిల్లలు ఆడుకొంటున్నారు. బెంచీల మీద ముసలివాళ్ళు పేపర్లు చదువుకొంటూనూ, కబుర్లు చెప్పుకొంటూనూ కాలక్షేపంచేస్తున్నారు. వెంకటేశ్వరస్వామిఆలయంలోపల ఆచార్లగారొకరు రామాయణ ప్రవచనం చేస్తున్నారు.

మురళీకృష్ణ, జీవనను ఓ ఫ్యాన్సీషాపులోకి తీసుకువెళ్ళాడు. షో కేసుల్లో రకరకాలబొమ్మలు అందంగా మురిపిస్తున్నాయి. వాళ్ళను చూడగానే షాపు యజమాని, వో గుజరాతీ వ్యాపారస్థుడు 'రండి రండి' అంటూ ఆహ్వానించి, గుజరాతీ టీ ఇప్పించి, ''ఏం కావాలి మీకు ?'' అనడిగాడు.

''ఏం కావాలండీ మనకు ?'' జీవనకూడా ఆశ్చర్యంగా అడిగింది.

''ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మ 'రాధా కృష్ణులు' వుందా ?''

''లేకేంసార్ ?'' షాపు యజమాని దాన్ని షో కేసులోనుండి బయటకుతీసి దులిపి వాళ్ళ



ముందు పెట్టాడు. ఎంతో అందంగా వుంది ఆ బొమ్మ. రాధ కృష్ణుడి గుండెలమీదకువంగి, తలను ఆనించుకుని, కళ్ళను అరమూతలుగా మూసి తన ప్రియుణ్ణి ఆలకిస్తోంది. కృష్ణుడి పెదిమలమీద మురళి వుంది. ఆ కళ్ళలో ఏదో చిలిపితనం వుంది. ఆ వదనంలో అనంతమైన సౌందర్యం వుంది. ఆ రూపంలో ఏదో వివశత కల్గించే లక్షణం వుంది.

"రాధాకృష్ణ బొమ్మ ఎందుకండీ మనకు ?" జీవన అడిగింది.

"రాధా—కృష్ణకాదు. జీవన మురళి అనుకోరాదూ ? ఇవ్వాళ నీ పుట్టినరోజుకదా ఇది నా సింబాలిక్ ప్రెజంటేషన్ !!"

అతని భావన అర్థమైన జీవన నిలువెల్లా పులకలై, రాగరూపమైంది. ఆ బహుమతిని అతని చేతినుంచి అపురూపంగా అందుకుని, పాత్రికళ్ళలోని పాపలాగా ఇంటికి తీసుకు వచ్చింది. ఇంటికి వచ్చేసరికి దీపాలు వెలిగాయి. వర్ధనమ్మ జీవనకు దిష్టితీసి పోసింది. "బంగారుబొమ్మలా మెరిసిపోతున్నావు, ఏ పాపిష్టివాడి కళ్ళన్నా పడొచ్చుమీద !" అన్నది ఆప్యాయంగా,

రెండు మూడు రోజులతర్వాత పరమేశ్వరం అడిగాడు మురళీకృష్ణను, "ఏరా, నాకీ గృహ నిర్బంధం నుండి ఇహనైనా విముక్తి ఇస్తావా?"

ఈ రెండుమూడు రోజుల్లోనూ ఆయనకు తలకు తగిలిన దెబ్బ మాను పట్టింది. అనుకోకుండా దొరికిన రెస్టు మూలంగా మనిషిలో నేవళం హెచ్చింది. భగవద్గీతా, శంకరభాష్యమూ చదువుకోడంతో మనసుకు ప్రశాంతత లభించింది.

"చూశారా నాన్నా, ఆ ఇంద్రసేన్ తప్ప ఇంకా ఎవరూ రాలేదు మిమ్మల్ని గురించి ఎంక్వయిర్ చేయటానికి ! దీన్ని బట్టైనా తెలిసిందా ఆ ఇంద్రసేన్ రాకలో అంతరార్థం ? సరేలెండి, ఇవాళ్టి నుండీ మీరు స్కూలుకు వెళ్ళండి. నేను నా మామూలు ఉద్యోగం వేటలో వుంటాను !" అన్నాడు. "దెబ్బకు మాత్రం ఏదో కారణం చెప్పండి." పరమేశ్వరం స్కూలుకి వెళ్ళి జాయినయ్యాడు. తలకువున్న కట్టు గురించి తోచింది చెప్పాడు. డబ్బు పోయినసంగతి ఎవరికీ చెప్పలేదు. పోయిన డబ్బు ఎటూ పోయింది. దానిని గురించి రభస చేసుకుంటే మాత్రం పోయిన సొమ్ము తిరిగి వస్తుందిగనుక? అనుకున్నాడు మనసులో.

మురళీకృష్ణ ఇంటికీ— పోస్టాఫీసుకూమధ్య తిరుగుతున్నాడు. ప్రొద్దున్నే పేపరు రాగానే వాంటెడ్ కాలమ్స్ చూడడం, కావలసిన వాటిని కత్తిరించుకుని దగ్గరుంచుకోడం. ఆ వెంటనే టైపు చేయాల్సిన వాటిని టైపు చేయించడం, చేత్తో వ్రాయదగినవాటిని చేత్తో వ్రాయడం, అవసరమైన డ్రాఫ్టులు, లేకపోతె పోస్టలు ఆర్డర్లు తీసుకోవడం, వాటిని ట్రూ కాపీలు జతచేసి రిజిష్టర్డు పోస్టులో పంపించడం,

జీ వ న మ ర ళి

మురళీకృష్ణకు ఈ పనులన్నింటిలోనూ జీవన సాయం చేస్తోంది. ఆమె దస్తూరీ ఎంతో అందంగా ముత్యాల కోవలా వుంటుంది. ఒక్కోసారి మురళీకృష్ణ డిక్టేటు చేస్తుండడం; ఆమె వ్రాస్తుండడం, మరోసారి అతను రఫ్ డ్రాఫ్టు తయారుచేస్తే ఆమె ఫెయిర్ కాపీ వ్రాసి ఇచ్చేది. కవర్లు అయిపోతే కవర్లుతయారు చేసి ఇచ్చేది. కవర్లకు బంక రాసి అంటించేది. ఒక మంచి స్నేహితురాలుగా, సలహాదారుగా, గుమాస్తాగా అతనికి ఉపయోగపడసాగింది.

ఆ సాయంకాలం అతను దొడ్లో బాదం చెట్టు కింద పడక్కుర్చీ వేసుకు కూచున్నాడు. పిట్టలేవీ ఎగరడంలేదు. జంతువులేవీ కూయడం లేదు.

చీమ చిటుక్కుమనడంలేదు. ప్రకృతి సమాధిలో వున్నట్లుంది.

"కల్తీ"

కిరానాలో కల్తీ
కిరోసిన్‌లో కల్తీ
సారాలో కల్తీ
సాంబారులో కల్తీ
మందుల్లో కల్తీ
విందుల్లో కల్తీ
మనుషుల్లో కల్తీ
మనసుల్లో కల్తీ
రచనల్లో కల్తీ
రాజకీయాల్లో కల్తీ
ఈ కల్తీయిజం
నశింపచేసేదెవరు ?
నిన్నటి గాంధీ సూక్తులా !
రేపటి పౌరుల శక్తులా !

— కొండవలస శ్రీనివాసరావు,
— కొండవలస వేంకటరాం.

మురళీకృష్ణ విచారంగా కనిపిస్తున్నాడు. వర్ధనమ్మ సాయంకాలం పూజలో వుంది. పరమేశ్వరం ఇంకా స్కూలు నుంచీ రాలేదు. జీవన మెల్లగా అతనికి దగ్గరగా వచ్చింది. "ఏం అట్లా వున్నారూ ?" అని అడిగింది.

"అప్లికేషన్లు పెట్టడమే కాని ఒక్కచోటి నుండి కూడా పిలుపు రావడంలేదు. కులం బలం, ధనంబలం ఇవన్నీ అడ్డొస్తున్నాయి. భవిష్యత్తు అంధకారబంధురంగా, అగమ్యగోచరంగా వుంది జీవనా !" అన్నాడు బరువుగా.

జీవన అతని పక్కనే కూచుని అనునయంగా అన్నది. "కోరిన చదువు వుంది. కాపాడే ఇల్లుంది. ఏ పని చేయడానికైనా వెనుకాడవలసిన పనిలేని మగవాళ్లు మీరు. కేవలం ఉద్యోగం కోసమే మీరింత డీలా పడిపోతే, పెద్ద చదువు లేనిదాన్ని, ఇల్లూవాకిలీ కాదనుకొన్న దాన్ని, ఆడదాన్ని నా సంగతేవిటి ? నా భవిష్యత్తేవిటి ?"

ఆమె కాతరస్వరం విని అతను ఆమె వేపుకు తిరిగాడు. ఆమె కళ్ల నుండి నీళ్లు బొట్లు బొట్లుగా కిందకు కారిపోతున్నాయి. అతనికి ఆ స్థితిలో ఆ పిల్లను చూడగానే హృదయం ఆర్ద్రమైంది. నిజమే ఆ పిల్లకు ఏముంది ? ఎవరున్నారు ? తను ఆహ్వానించాడు. తన ఇంటికి వచ్చింది. తను కాదంటాడు. వెళ్లిపోతుంది. అటువంటి పరిస్థితిలోనే ఆ పిల్ల హుషారుగా, నవ్వులమొగ్గలాగా వుండగల్గుతున్నదే, వెలుగు పంచిపెడుతున్నదే, తను విచారగ్రస్థుడై, బాధను పంచిపెట్టే అర్హత తనకేమి వున్నదీ అనిపించింది.

"జీవనా ! నిజమే. నేను డీలా పడిపోకూడదు. పడిపోను. ఐ ప్రామిస్ ! మిన్నువిరిగి మీదపడ్డా, నా ధైర్యాన్ని కోల్పోను !" అంటూ "ఏదీ నా ఫ్లూట్ తెచ్చిపెట్టు !" అని ఆ అమ్మాయి ఫ్లూట్ తెచ్చింతర్వాత, ఆ సాయంకాలంపూట, వంటరి ప్రశాంత వేళ, ఆనంద భైరవి ఆలపించసాగాడు. ఆ రాగం సుళ్లు తిరుగుతూ ఆకాశంలో పల్లటీలు కొట్టసాగింది. అతను మురళి వాయించుకుంటూనూ, జీవన ఆ మురళీరవం వింటూనూ, ఎంతసేపుకూచున్నారో వాళ్ళకే తెలీదు. కళ్ళుమూసుకుని ఆనందమూ, దుఃఖమూ కావి ఒక విచిత్రలోకంలో వుండిపోయారు. కళ్లు తెరిచి చూసేసరికి పరమేశ్వరమూ, వర్ధనమ్మా ఇద్దరూ కూడా దూరంగా నిలబడి, ఆ రాగం వింటూ కనిపించారు. వాళ్ల హృదయాల్లోనూ అనిర్వచనీయమైన అనుభూతిని నింపింది ఆ రాగప్రస్తారం. కొంతసేపటికి ప్రస్తుతంలోకివచ్చి భారకంఠంతో, "పదండి, భోజనాలవేళ దాటిపోతోంది" అన్నది వర్ధనమ్మ వాళ్లను లేవదీస్తూ.

భోజనాలుచేసి పడుకున్నారు. మళ్ళీలేచారు. రోజంతా ఎవరి పనుల్లో వారున్నారు. రాత్రికి పడుకున్నారు. రాత్రిపూట ఆలోచనల కడలి. పగటిపూట పనితనం చెలియలికట్ట. మర్నాడే ఇంద్రసేన్ పుట్టినరోజు. తప్పకుండా రావలసిందని పరమేశ్వరానికి మరోసారి ఆహ్వానం వచ్చింది. పార్టీల్లో పాల్గొనమని మురళీకృష్ణకు పిలుపు వచ్చింది. మర్చిపోవద్దని ఆ వచ్చినవారు జీవనకు జ్ఞాపకం చేశారు.

పరమేశ్వరం వెళ్ళడానికితయారవుతున్నాడు. "ఏం నాన్నా ? పోయిన సంచీలో ఎంత డబ్బుందో పుజ్జాయింపుగా ఏవన్నా చెప్పగలరా?"

"చెప్పలేను !"

"జ్ఞాపకం తెచ్చుకోండి, ఎవరెవరెంత ఇచ్చారో ?"

పరమేశ్వరం కళ్ళు మూసుకుని ఆలోచించాడు. "మర్చంట్ ఛాంబర్ ప్రెసిడెంట్

కళ్యాణవేదిక

ప్రకటనదారులకు మంచి అవకాశం

రోజు రోజుకు సాంఘిక వ్యవస్థ, వివాహ తీరు తెన్నులు మారుతున్నవి. మారుతున్న ధోరణులకు అనుగుణంగా వివాహ సంబంధాల గూర్చి తగు సమాచారము సేకరించుటలో క్లిష్టత, త్రిప్పట, వ్యయం అధికమవుచున్నవి.

వధూవరుల సమాచారము పత్రిక ద్వారా అందజేసుకోవడం వల్ల కొంత ఈ సమస్యకు పరిష్కారము కాగలదు. ఈదృష్టితోనే ఆంధ్ర పత్రిక (దినపత్రిక) లో వధూవరులను గూర్చిన ఒక ప్రకటనల వేదికను ప్రచురిస్తున్నాము... మామూలుగా అయ్యే ఛార్జీలపై 50% రాయితీతో అంటే మామూలు సంగ్రహ ప్రకటనలకు లైనుకు రు 6/- లు ఛార్జీకి బదులు ఈ ప్రత్యేక కాలంలో లైనుకు రు 3-00 వంతున ఛార్జీ వుంటుంది (లైనులో సుమారు 15-16 అక్షరములు ఇమడగలవు)

నాలుగు లైన్లకు తక్కువ లేకుండా ప్రకటన వుండాలి.

మీ ప్రకటన విషయము + ఛార్జీలను మనీ ఆర్డరు/డ్రాఫ్టు ద్వారా జతపరచి (బాక్సు నంబరు కోరు వారు అదనంగా రు 5/- లు చెల్లించాలి.)



ఆంధ్రపత్రిక

గాంధీనగరం, విజయవాడ-3

లేదా

బషీర్ బాగ్, హైదరాబాద్-29కు
పంపవచ్చును.

murali



మహంకాళయ్య ఓ పదివేలు విరాళం ప్రకటించాడు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వో అయిదు వేలు వేశాడు. ఫారెస్ట్ కంట్రాక్టరొకాయన బ్లాంక్ చెక్ సంతకంచేసి ఇచ్చాడు, అంకెను మననే వేసుకోమని! కొందరు ఉంగరాలిచ్చారు.''

''అంతా కలిస్తే ఓ పాతికా – ముప్పై వేలకు మించదు. అవునా ?''

''అంతే. అంతే !''

ఆ రాత్రి జీవనతో మరోసారి హెచ్చరించాడు మురళీకృష్ణ. ''వజ్రపుటుంగరాన్ని అతనికే తిరిగి ఇచ్చేద్దాం అనుకున్నాంగదూ ?''

''అవును. రేపే !'' జీవన తనకు జ్ఞాపకం వున్నట్టుగా అన్నది. ఆ 'రేపు' నేడయింది. ఇవ్వాళ సూర్యుడు మామూలుగానే ఉదయించాడు. ప్రకృతిలో ప్రత్యేకత లేకపోయినా, ప్రకృతి సృష్టించిన మనుష్యులు మాత్రం ఏ రోజుకు ఆ రోజే ప్రత్యేకమైన దనుకుని, ఆ ప్రత్యేకతను తమకు ఆపాదించుకుంటున్నారు.

ఇంద్రసేన్ అనుయాయులు గుళ్ళోపూజలు చేయించారు. స్కూల్లో స్వీట్లు పంచిపెట్టించారు. ఆనందపురంలో వెల్వడుతున్న ''ఆనంద్ టైమ్స్'' అనే లోకల్ డైలీలో ఇంద్రసేన్ బొమ్మ పెద్దక్షరాలతో ముద్రింపించి క్రింద ఆయన బయోడేటావేసి, 'శుభాకాంక్షలతో' అంటూ రకరకాల కంపెనీల నిర్వాహకుల పేర్లు వేశారు. ఇంద్రభవన్ మొత్తం రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇంద్రసేన్ సభ్యుడైన 'టౌన్‌హాల్'ను అందంగా ముస్తాబు చేశారు.

టౌన్‌హాల్లో పింగ్‌పాంగ్ పోటీలు నిర్వహించారు. నీలంరంగు టేబిలు. మధ్య కొద్ది ఎత్తులో నెట్. ఇంద్రసేన్, మురళీకృష్ణ ఇద్దరూ ఫైనల్స్ ఆడుతున్నారు. మొదటి ఆట మురళీకృష్ణ గెలిచాడు. రెండవది ఇంద్రసేన్ గెలిచాడు. స్కూలు పిల్లలు, కొంతమంది టీచర్లు, వూళ్ళో కొందరు పెద్దలు, పరమేశ్వరం, జీవనలు, ప్రత్యేక ఆహ్వానితులు ఆటను పరికిస్తున్నారు.

మూడో గేమ్ మొదలైంది. వరుసగా నాలుగు పాయింట్లు గెల్చుకున్నాడు ఇంద్రసేన్, అంతవరకూ డిఫెన్స్ ఆట ఆడుతున్నవాడు ఒక్కసారిగా అఫెన్స్‌లోకి మారిపోయిన. అతని అఫెన్స్ మురళీకృష్ణను తబ్బిబ్బు చేసింది. కొంతసేపటికిగాని సెటిల్ కాలేకపోయాడు. అతను సెటిల్ అయ్యేలోపున మరో నాలుగు పాయింట్లు ఇంద్రసేన్ గెల్చుకున్నాడు. ఎనిమిదీ సున్నా స్కోరుతో లీడ్‌లో వున్నాడు. అతని వత్తాసుదారులు చప్పట్లు కొడుతున్నారు. 'కీప్ – అప్' అంటూ అరుస్తున్నారు. మురళీకృష్ణ మొహాన పట్టిన చెమట చూసి ఇంద్రసేన్‌కు లోపలినుండి ఆనందం వుబికుబికి వస్తున్నది.

మురళీకృష్ణ జీవనవేపు చూశాడు. ఆమె సెంటు, ఉడుకులాం కలిపిన కర్చీఫ్ తీసుకువెళ్ళి అందించింది. అతను మొహం తుడుచుకున్నాడు. రెండు గుటకలు నీళ్ళు తాగాడు. కొద్దిగా నిమ్మరసం పుచ్చుకున్నాడు.

''మీ ఆట మీరు ఆడండీ, మీరు గెలుస్తారు. తప్పకుండా గెలుస్తారు.'' అన్నది జీవన ధైర్యం చెబుతూ.

''చాలా బాగా ఆడుతున్నావయ్యా నువ్వు. ఎక్కడ నేర్చుకున్నావయ్యా ఇంత ఆట ?'' అంటూ పరమేశ్వరం ఇంద్రసేన్ను పొగిడాడు.

ఆ పొగడ్త విన్న మురళీకృష్ణ కళ్ళు జేవురించాయి. పళ్ళు బిగించాడు. గట్టిగా వొక్కసారి గాలి లోపలికి పీల్చుకున్నాడు. సైడ్స్ మారి సర్వీస్ తీసుకున్నాడు. కొంతసేపు డింగ్–

కేన్సరు చికిత్సకు మైక్రోవేవ్ !

జపాన్‌లోని క్యోవా హేక్కో క్యోగా కంపెనీ కేన్సరు చికిత్సకు ఒక ఎలెక్ట్రిక్ మైక్రోవేవ్ పరికరాన్ని రూపొందించింది. ఈపరికరంతో ఉష్ణంతో కూడిన కేన్సరుకు చికిత్స చేయవచ్చు. జపానులోని నేషనల్ కేన్సరు సెంటర్‌లో ఈ పరికరంతో 15 మంది రోగులకు చికిత్స చేశారు. దీనితో పాటు రేడియేషన్ థిరపీనికూడా ఉపయోగించారు. వీరిలో అయిదుగురికి కేన్సరు పూర్తిగా తగ్గింది. మిగిలిన వారిలో కూడా చెప్పకోతగిన అభివృద్ధి కన్పించింది. వైద్యసంస్థలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ సంస్థల సహకారంతో ఈ పరికరాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఈ సంస్థ యజమానులు ఆలోచిస్తున్నారు.

డాంగ్ ఆట ఆడి బ్రహ్మాండమైన షాట్ కొట్టాడు. బంతి వెళ్ళి బల్ల అంచుకు తగిలి, అక్కడనుంచి అంత ఎత్తున గాలిలో ఎగిరింది. షాట్ రిసీవ్ చేసుకోటానికి ఇంద్రసేన్‌కు అవకాశమే దొరకలేదు. మురళీకృష్ణకు పాయింటు లభించింది. మొదటి పాయింట్. మొదటిది రెండయింది. రెండు మూడయింది. నాలుగు అయిదు ఆరు ఏడు – ఎనిమిదో పాయింటులో అతని సర్వీసు పోయింది. అక్కడి నుంచి ప్రతి పాయింటుకూ ఇద్దరూ నువ్వా నేనా అంటూ పోటీపడ్డారు. అవతల ఇంద్రసేన్‌కు వందలాది వత్తాసుదార్లు. ఇవతల మురళీకృష్ణకు ఒకే వొక్క సపోర్టరు జీవన. బక్ అప్... హుర్రే... వెల్‌డన్... హిట్ హిట్... కేకలు... అయ్యో అంటూ నిరాశలు...' రెండు పాయింట్ల తేడాతో ఇంద్రసేన్‌మీద మురళీకృష్ణ గెలిచాడు.

యూత్ క్లబ్ సభ్యులు ఆ తర్వాత ఫ్యాన్సీ డ్రెస్ పెరేడ్ జరిపారు. అప్పటి కార్యక్రమాల్లో చివరగా పాటల పోటీలు పెట్టారు. కొందరు సినిమా పాటలు పాడారు. కొందరు లలితగీతాలాలపించారు. మరికొందరు జానపద సంగీతం వినిపించారు. ఉన్నట్టుండి ఇంద్రసేన్ వో పాట అందుకున్నాడు. మొదటి రెండు చరణాలూ ఇంగ్లీషులో పాడాడు. ఇంకో రెండు చరణాలు హిందీలో పాడాడు. మరో రెండు చరణాలు తెలుగులో పాడాడు.

''బావుంది. చాలా బావుంది !''

''బ్యూటిఫుల్ ... లవ్లీ !''

''బహూత్ అచ్ఛాహై ... !''

అందరూ కామెంట్స్ పాస్‌చేశారు. మెచ్చుకున్నారు. బహుమతులు చదివించారు. శుభాకాంక్షలందించారు. ఆ బహుమతుల్ని చూసుకుంటూ, తన గొప్పదనాన్ని తనే మెచ్చుకుంటూ ఇంద్రసేన్ మధ్యాహ్నమల్లా గడిపాడు. సాయంకాలం విఐపీలనుకొన్నవాళ్ళకు ఇంద్రభవన్‌లో 'గెట్ టు గెదర్' ఏర్పాటు చేశాడు.

పెద్ద కేక్. కేక్‌నిండా క్యాండిల్స్. కేక్‌మీద 'హాపీ బర్త్‌డే టూ యూ' అన్న అక్షరాలు. అన్ని ఏర్పాట్లూ స్వయంగా తనే పర్యవేక్షించుకుని చూసుకుని, నాగలింగంతో అన్నాడు.

''పింగ్‌పాంగ్ అతనికి రాదురాదు అంటూ ఆ ఆట పెట్టించావ్, నలుగుర్లోనూ తల తీసేయించావు, ఇప్పుడేవీ అభాసు జరగదు గదా?''

''దొరవారూ ! ఆ ఆట అతను ఆడ్తాడని, ఆడగలడని వూహించుకోలేకపోయాను. తమరు బాల్ కొట్టే అది ఫిరంగి దెబ్బ కదా అనుకుని, ఆ ఆట పెట్టించేసేను. దెబ్బతిన్నాను. ఇప్పుడతన్నీ, అతని మునలినాన్ననూ ఆ దేముడుకూడా కాపాడలేడు, ఖాయం, నా మాట నమ్మండి !

''నమ్ముతాను నాగలింగం; నిన్నూ, మాలచ్మినీ, కన్నదాసునూ, గూర్ఖానూ, ఆల్సేషియన్ డాగ్‌నూ నమ్మకపోతే ఇంకెవర్ని నమ్ముతాను ? చూద్దాం రాత్రికి ఏం చేస్తావో!''

నాగలింగం భారీగానే ఏర్పాట్లు చేశాడు. కేక్ కట్‌చేసింతర్వాత, వచ్చిన వాళ్ళందరూ 'హాపీ బర్త్‌డే టూ యూ !' పాటపాడి ఇంద్రసేన్ను అభినందించింతర్వాత, శీతల పానీయాలు కొందరికీ, హాట్ డ్రింక్స్ మరి కొందరికీ అందించాడు. రెండు మూడురకాల తీపి పదార్థాలు, ఫ్రూట్ సలాడ్, జీడిపప్పు, కట్‌లెట్ అందరికీ సర్వ్ చేయించాడు.

సాఫ్ట్ డ్రింక్స్ తీసుకున్నవారు, వాటిని సిప్ చేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. లైట్‌గా, బ్యాండు పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది. స్వింగ్ ... సింగ్స్ టు ది మ్యూజిక్ ... హాట్ డ్రింక్స్ పుచ్చుకున్నవాళ్ళు రిథమిక్‌గా స్టెప్స్ వేస్తున్నారు, ఒకరిని ఒకరు

దగ్గరకు తీసుకుని, కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూ చేతులతో సున్నితంగా స్పర్శించుకుంటూ.

''స్నేహితులారా !'' ఇంద్రసేన్ కొత్త గుడ్డల్లో పెళ్ళికొడుకులా మెరిసిపోతున్నాడు. ''రవంతసేపు మీ దృష్టిని నా వైపు మళ్ళించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.''

డ్యాన్సు చేస్తున్నవాళ్ళు డ్యాన్సు ఆపేశారు. బ్యాండు వాయిద్యాలు ఆగిపోయాయి. విశాలమైన ఇంద్రభవన్ హాల్లో నిశ్శబ్దం నిండుకుంది. ఆహూతుల కళ్ళు అతనిమీద. వారికి అతను కొత్తగా, వింతగా కనిపిస్తున్నాడు.

''నా పుట్టినరోజు పండుగకు మీరందరూ ఇంత ఉత్సాహంగా వచ్చినందుకూ, నన్నాశీర్వదించినందుకూ మీ కందరకూ మెనీమెనీ థాంక్స్ ! మీకు తెలుసు. దగాపడిన చెల్లెళ్ళకోసం వో రక్షణాలయం నేను ఏర్పాటు చేస్తున్న సంగతి, అందులో శ్రీమతి మహాలక్ష్మి గారివంటి స్త్రీలు చేరుతున్న సంగతి. ఆ రక్షణాలయానికి దగ్గర వుండి అన్ని పనులూ స్వయంగా చూడడానికి ఆడవాళ్ళే వుంటే మంచిదన్న సూచన వచ్చింది. మేష్టారు పరమేశ్వరంగారు రక్షణాలయాన్ని, కళాలయాన్ని, ప్రశాంత మందిరాన్ని నిర్వహిస్తే, వారి కుమారులు శ్రీ మురళీకృష్ణగారు దానికి కార్యదర్శిగా వ్యవహరిస్తే, కుమారి జీవనను, మీ అందరి తరఫునా, నేను తలపెట్టిన నూతన ఆలయానికి, ప్రేమ మందిరానికి రక్షకురాలుగా వుండమని అర్థిస్తున్నాను. ఆమె ఎవరో మీకు తెలీదు, నాకూ తెలీదు. కానీ ఆమెకు మన వూరన్నా, మనమన్నా, మనవూరి ప్రకృతి అన్నా, ఇక్కడి దేవాలయమన్నా, మన గుహలన్నా ఎంతో ఇష్టం. ఇష్టమున్నవాళ్ళే కష్టాలను సహిస్తారు. వారిని సభకు పరిచయం చేయమనీ, నా అభ్యర్థనకు వారి నొప్పించమనీ మురళీకృష్ణ గారిని కోరుతున్నాను.''

మురళీకృష్ణ అందరి ముందుకూ వచ్చి జవాబు చెప్పే లోపునే, జీవన మందమందంగా అడుగులు వేస్తూ ఇంద్రసేన్ దగ్గరకు వచ్చింది.

''నా గురించిన వివరాలు వారికీ తెలీవు సరిగా! చుట్టపుచూపుగావచ్చానుఇక్కడికి.నిజమే. మీ వూరంటే ఎంతో ఇష్టం. ఇక్కడి ప్రకృతి పరవశింపజేస్తుంది. మీవూరి దేవాలయంలోవున్న వేణుగోపాలస్వామి ప్రియబాంధవుడు కనిపిస్తాడు. ఊరికి దూరంగా వున్న గుహల్లో ఓంకార నాదం వినిపిస్తుంది. అంత మాత్రాన నే నిక్కడ ఇంద్రసేన్‌గారి ప్రేమ మందిరానికి రక్షకురాలుగా ఎట్లా వుండగలనూ ? మరో చోటినుండి వచ్చిన నాకు ఇక్కడ శాశ్వతంగా ఉండటానికి ఎట్లా వీలవుతుంది? అయితే మీరు తలపెట్టిన ఈ మహత్కార్యాన్ని నేను అభినందిస్తున్నాను. ఉడుతాభక్తిగా ఈ ఉంగరాన్ని మీ నిధికి జమకడుతున్నాను !''

ఆమె ఈ మాటలు చెప్పడానికి ఏ మాత్రం బెదురుచెందలేదు. ఆ మాటలంటున్నప్పుడుమురళీకృష్ణ వేపుగానీ, పరమేశ్వరం వైపుగానీ చూడలేదు. తను అనవలసిన నాలుగు మాటలూ అని, హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి మెరుస్తున్న వజ్రపుటుంగరాన్ని తీసి ఇంద్రసేన్‌కు అందించింది. అందిస్తూ మళ్లీ మెల్లగా అన్నది.

''నా పుట్టినరోజు బహూమతిగా దీన్ని తోటలో ఇచ్చారు.మీరు నాకు—జ్ఞాపకం వుందా? ఈ ఉంగరాన్ని, మీ ఉంగరాన్ని మీకే తిరిగి ఇచ్చేస్తున్నాను. మీరే భావంతో నాకిచ్చినా, ఒక మంచి పని కోసం ఇది ఇప్పుడు ఉపయోగపడుతున్నది. సంతోషిస్తారనుకుంటాను.''

ఆమె మాటలు దూరంగా వున్నవారికి సరిగా వినపడలేదు. ఆమెచేతిలో వున్న ఉంగరమే కనిపించింది. అది ఇంద్రసేన్‌కు ఇవ్వడం కనిపించింది. వాళ్లు సంతోషంతో చప్పట్లు కొట్టారు. ఇంద్రసేన్‌కు చెయ్యి ముందుకు చాపక తప్పలేదు. ఆ చేతిలో ఉంగరం పడ్డది.


ఉంగరం వున్న అరచెయ్యి భగ్గుమన్నట్లయింది అతనికి. అతని గుండెకూడా భగ్గుమంది. ఎంతగా అవమానించిందీ ఆడది ? ఏమి చూసుకుని ఈ తెగిన గాలిపటానికి ఇంత ధైర్యం ? అతని కళ్లు ఎరుపెక్కుతున్నాయి. పక్కనే వున్న నాగలింగం అతని దగ్గరకువచ్చి చెవిలో అన్నాడు. ''దొరవారు తొందరపడకూడదు !''

నాగలింగం, ఇంద్రసేన్ గుప్పిట మూశాడు. తనే పెద్దగా అన్నాడు ''మహాలక్ష్మిగారూ !'' పాటల మాలక్ష్మి, మహాలక్ష్మస్వరూపంలా ప్రక్కగదిలో నుండి ఆ హాల్లోకి వచ్చింది.

''అయ్యలారా, అమ్మలారా ! కళాలయం తొలిసభ్యురాలీమె ! పాటలు పాడుకుంటూ జీవనం చేసుకునే వీరిని పాటల మాలచ్మి గారనే వారు అందరూ. వీరు, మహాలక్ష్మిగారు చక్కగా సంగీతం నేర్చుకుని, అందుకు తగ్గట్టుగా డ్యాన్సు కూడా నేర్చుకుని, వారి తర్వాత కళాలయంలో చేరేవారికి మార్గదర్శకంగా వుండాలని దొరవారు ఆశపడుతున్నారు. అమ్మా మహాలక్ష్మిగారూ ! ఇరుగో పరమేశ్వరంగారు — తండ్రి వంటివారు మీకు. వీరుగో మురళీకృష్ణగారు — యంఏ ప్యాసైనవారు, సంగీత సాహిత్యాల్లో ఎంతో తెలిసినవారు—వీరిద్దరూ ఇహనుంచీ మీ జీవితానికి అండాదండానూ ! జీవనమ్మగారుండనన్నారు కాబట్టిగానీ, లేకపోతే దొరవారు మీ ఇద్దర్నీ చెరోకన్నుగా చూసుకునేవారు కాదూ ? రేపే మీరు కొత్త ఇంట్లోకి వెళ్లిపొండి. కొత్తజీవితం ప్రారంభించండి.''

పాటల మహాలక్ష్మి ఘల్లు ఘల్లు మంటూ పరమేశ్వరం దగ్గరకు వచ్చింది. ఆయనకు పాదాభి వందనం చేసింది. మురళీకృష్ణదగ్గరకు వచ్చింది. అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది. ''ఈ చేతుల్ని విడవరు కదూ ?'' అన్నది. మురళీకృష్ణ వొళ్లు ఝల్లుమంది ''నాకీ బాధ్యత వద్దు, కళాలయం వ్యవహారంతో నాకేం సంబంధం లేదు'' అని చెబుదామనుకున్నాడు మురళీకృష్ణ. జీవన ఉంగరం ఇచ్చేయ్‌గానే, తాను ఆ మాటలని ఇద్దరూ బయటకు వచ్చేయాలని అతని తలంపు. మహాలక్ష్మి వచ్చి





ఇవేమన పద్యాలు



వంట దప్పునపుడు వంటకమె విషము
కంట జూడగానే కంటగించు
కంటగమున దిన్న కటిగండమై వచ్చు
విశ్వదాభిరామ వినుర వేమ.

అంతమందిలో, తన తండ్రి సమక్షంలో అట్లా చెయ్యి పట్టుకుని "ఈ చేతుల్ని విడవరు కదూ?" అనడంతో అతనో క్షణం అప్రతిభుడై పోయాడు. మహాలక్ష్మి అతనికీ, పరమేశ్వరం గారికీ మధ్యగా నిలబడింది. ఇద్దర్నీ సంబోధిస్తున్నట్టుగా అన్నది. "ఇటువంటివారు అండగా

వుండడం నాకెంత బలం!" మర్చంట్ ఛాంబర్ మహంకాళయ్య ముందుకొచ్చాడు. "అట్లాగైతే ఇంత సంతోషం వేసే వుత్తుత్తి మాటలు కాకుండా ఓ పాట పాడితే బావుండదూ?" అన్నాడు.

"పాడాలి, పాడాలి!" అందరూ ముక్త కంఠంతో అన్నారు.

మళ్ళీ బ్యాండు వాయిద్యం మొదలైంది. జంటల అడుగులు తడబడుతున్నాయి. మహాలక్ష్మి పాట అందుకుంది. పాటకు అనుగుణంగా అటూ యిటూ కదులుతోంది. ఆమె పాట వూపుకు కొందరు తలలూపుతున్నారు. చరణం అందుకోమంటూ ఆమె జీవనను కవ్విస్తోంది. "ఊ, మీరూ కలవండి" అంటూ ఆమె మురళీకృష్ణను ఆహ్వానిస్తోంది. పరమేశ్వరం అంతా చూస్తూ ఆనందిస్తున్నాడు.

మహాలక్ష్మి :— కన్నెపిల్ల వొయసు సూసి
కన్ను కొట్టినాడే సిన్నోడు!
పైట లాగి, పాట పాడి
వెంట తరిమినాడే...సచ్చినోడు!

జీవన :— చిన్నవాడి బుద్ధి చూసి
చిన్నదాని మనసు విరిగి
మిన్ను విరిగి మీదపడ్డ
నిన్ను చేసుకోనందిరా!
తన్ను మరచిపొమ్మందిరా!

మురళీకృష్ణ :— ఆడదంటె ఆటబొమ్మ
అనుకుంటె తప్పమ్మ!
ఆడదంటె నిప్పురెమ్మ
కానకుంటె కాల్చునమ్మ!
వెంటపడమాకరో సిన్నోడ
నీ —
గూటిలోనె తొంగుండు
సచ్చినోడ!

మహాలక్ష్మి :— నీ గూటికే వస్తాను పోరా,
నీ గుండెలో వుంటాను లేరా!
నలుగురెదుటాఅల్లరెందుకురా?
మనసిచ్చినాడా,
మగువ పొందుకు తొంద
రెందుకురా?

పాట అర్థం ఎవరికి ఉద్దేశింపబడిందో తెలియని శ్రోతలు తాళంవేస్తూ ఆనందించారు. అర్థం తెలిసిన ఇంద్రసేన్ మూతి ముడుచుకున్నాడు. తన ఉంగరం తనకే తిరిగి ఇచ్చి జీవన ఏదిమందిలోనూ అవమానం చేసింది. ఆ విధంగా ఇవ్వడంలోగల అంతరార్థం తెలిసినా, ఎవరూ తనమీద భయంతో కిక్కురుమనలేదు, పెదవి విప్పలేదు. అది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఇప్పుడు మళ్ళీ జీవన, మురళీకృష్ణ తనను దెబ్బకొట్టడంకోసం గూడుపుఠాణీ చేశారు. పాట పాడే అవకాశం రాగానే, జీవన గొంతుకలో మహాలక్ష్మి గొంతు కలిసినట్టుగా నటిస్తూ, తనకు హితబోధ చేస్తున్నారు. హితబోధ! తనకు!! అటువంటివాళ్ళను తనెందుకు క్షమించాలి?

(ఇంకా వుంది)

కొత్తగొంతులు

— టి.యల్. కాంతారావు

సిగరెట్టు పీకలే ఆలోచనలకు
నిదర్శనాలైతే
బ్రాందీ గాంధీకన్న గొప్పే
న్యాయాన్ని ఏ కీలు కా కీలు
విరగ్గొట్టగలవాడే వకీలు
ఆసుపత్రులన్నీ శ్మశానాలు
రోగులంతా దయ్యాలు
కాటి సుంకంకై
కాచుక్కూచున్నోళ్ళు డాక్టర్లు !

— అలిశెట్టి ప్రభాకర్

మంటల జండాలు, ఎర్రపావురాలు, చురకులు ఇతని కవితా సంకలనాలు. ఈ తరంలో చాలామంది యువ కవులు మినీ కవితా ప్రభావంతో కవితారంగం పైకివచ్చిన వారు. అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితావిర్భావం తరువాత వచ్చినవాడే. మినీ కవిత్వం దానంతటదిగా ఒక ప్రత్యేకమైన ప్రక్రియ అని, అది ఒక కవితా ఉద్యమమని, విప్లవమని భావించే సాహిత్య విమర్శకులు కొంత మందున్నారు. మినీ కవిత్వం ప్రక్రియగా వచన కవిత్వం యొక్క సంక్షిప్తరూపం. దీన్నొక ఉద్యమం, విప్లవం అనటానికి అవకాశం లేదు. ఉద్యమాలు కాని, విప్లవాలు కాని భావానికి సంబంధించినవి; రూపానికి కాదు; పోగా ఇదొక అతి నవ్యరూపం కాదు. అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితా రాశాడు; మాక్సీ కవితా రాశాడు. అతని కవితా రచనకు ఒక దృక్పథం ఉంది. దాన్లో పరిణామం కూడా ఉంది. మార్పును కోరే దృక్పథం విప్లవాభిముఖమైంది.

అతని కవిత్వంలో కొసమెరుపు కవిత్వానికి జీవలక్షణంగా పరిణమించింది. అనవసర — శాబ్దిక డాంబికత, పాదాల సాడిగింపు, భావ విస్తరణ, సూటిగా అందని భావచిత్రం, సమాసాల, ఉపమా, రూపకాల గందరగోళం అతని వచన కవిత్వంలో కనిపించవు. మినీ కవిత్వాన్ని గురించి ఎవరెన్ని చెప్పినా, ఎన్ని వ్యాసాలు రాసినా అందరూ కొన్ని ఖండికలను మాత్రమే ఉదహరిస్తున్నారు. దాన్నిబట్టి చూస్తే ఉద్యమం పేరుతో, విప్లవం పేరుతో కవిత్వాంశ ఉన్న మినీ కవిత్వం చాలా తక్కువ వచ్చిందని ఎవరికైనా తెలుస్తుంది. ప్రభాకర్ కవిత్వంలో దరిదాపుగా అన్ని ఖండికల్లోనూ భావం, శిల్పం రెండూ మెదడును వెలిగించి గుండెను కదిలిస్తాయి.

అంధుల్ని మార్గదర్శకులుగా ఎన్నుకోవటంవల్ల, కుక్కలకు అధికారం సమర్పించుకోవటంవల్ల ఈ దేశం అంగాంగమూ బూర్జువా రాజకీయాల్తో, బూజుపట్టిన చదువులతో, పెట్టుబడిదార్ల దోపిడితో కుళ్ళిపోయిందని, దేశాన్ని తిట్టుకుంటూ కూర్చుంటే అభ్యుదయం కాళ్ళ దగ్గరకు రాదని, మనిషి ఆలోచనా విధానంలో, రక్తంలో తిరుగుబాటు ధోరణి తల ఎత్తకపోతే ఈ నిర్వీర్యపు రొచ్చు గుంటల్లోనే చతికిలబడ్డం ఖాయమనీ ప్రభాకర్ చెబుతున్నాడు. ఈ రెపరెపల్లో దిగంబర కవుల వాగ్ధోరణి కొంచెంగానైనా తొంగిచూడటం పరిశీలకులకు తెలుస్తుంది. తన కవిత్వంలో — లోపాలకంటె పురుగులుపడ్డ ఈ జాతిని దర్శించమంటున్నాడీ కవి.

నిరాశ మనిషిని చరమదశవరకూ చిత్రహింస చేస్తుందని ఆశ అనుక్షణం బ్రతుక్కి ఊపిరి పోస్తుందనే అభ్యుదయ కవితా కాలం



నాటి అంశాన్నే మరోసారి కావ్యస్తంచేశారీయన. చెమటబిందువుల్లో ప్రతిఫలించే కళాఖండాల్ని, కన్నీటి బొట్టులో కనిపించే బాధల పరంపరలను చూసి బ్రతుక్కి తన కవిత్వం ద్వారా నిర్వచనాలు ఇచ్చాడు. కాలం నిరాశా వాదికి, నిర్వీర్యుడికి కాలుతున్న చితి, నిత్యదహన సంస్కారంగా కనిపిస్తే, భవిష్యత్తు మీద ఆశతో, రేపు ఏర్పడబోతున్న సమ సమాజ స్వరూపం మీద మమకారంతో ఉన్న ఈ కవికి అదొక చైతన్యజ్వాలగా అనిపిస్తున్నది. రాజకీయ నక్కలు, పులులు ఇంకెవర్ని మోసగించమని, సాటి జంతువుల్ని సంహరించమని ప్రమాణ స్వీకారాలు చెయ్యవచ్చు; పశ్చాత్తాపాలను ప్రకటించవచ్చు. కాని ఈ ప్రజలు గొర్రెల్లాగా ఇంకెంతకాలం తలూపుతారు ? అని ఆశ్చర్యం ప్రకటిస్తాడీ కవి. శూన్యంలో నిశ్శబ్దంలా, నిశ్శబ్దంలో సమాధుల్లా బ్రతకొద్దనీ, జ్ఞాపకాల రసి పుండ్లని గోకటమే వ్యాపకంగా జీవించవద్దని సహనం, సాహసం నిప్పుల మీద కాలాన్ని ఫలంగా వండుకోవాలనే జీవన విధానాన్ని సూచిస్తున్నాడీకవి. ఉండీపీనుగుల్లా వేలాడే చేతులు, చూసి సాక్ష్యాలకు పనికిరాని కళ్ళు, నిజం చెప్పడానికి తడి లేని నాలుకలు కవిత్వంలోనూ, జీవితంలోనూ కూడా ఉండటం కంటె లేకపోవడమే నయమంటున్నాడీయన.

సమస్త కళాఖండాలను సృష్టించిన శ్రామికుడి శరీరం ఈ వ్యాపార ప్రపంచంలో వర్తకుడికి పెద్ద పెట్టుబడి అని, చరిత్ర వడ్డీ వ్యాపారస్తుని ఇనప్పెట్టెలోంచి, రాజకీయ నాయకుల టోపీల్లోంచి పుట్టలేదని, రక్తపాతమే దాని ఉపోద్ఘాతమని, చెమటబొట్టే ఆధారమని, ఆకలే ప్రేరణ అని చెబుతూ ఆకలి, చెమటల్లోంచే విప్లవాలు ఉద్భవించి కొత్త సమాజాలు ఏర్పడతాయని కనుక ప్రజలు (పీడితులు) దానికి సన్నిద్ధం కావాలనే కాంక్షతో కవిత్వం రాస్తున్నవాడు అలిశెట్టి ప్రభాకర్.

తను శవమై
ఒకరికి వశమై
తనువు పుండై
ఒకడికి పండై
ఎప్పుడూ ఎడారై
ఎందరికో ఒయాసిస్సై. ★

మహాత్మాగాంధీ - పాశ్చాత్య ప్రపంచము

"ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం సంభవం కావచ్చు", అని మహాత్మాగాంధియే బహిరంగోపన్యాసంలో చెప్పాడని వినగానే ఇక్కడ (అమెరికాలో) చాలామందికి హృదయాలు కృంగిపోయినట్లయినాయి. అసలు అంతర్జాతీయ పరిస్థితులు నాటి నాటికి అధ్వాన్నంగా తయారవుతున్నాయే, అనే ప్రపంచములో ప్రతిచోటా ప్రజలు బెంగపడిపోతున్నారు. యుద్ధం, ఘోరాతిఘోరమైన యుద్ధం, ఆటంబాంబులతోనూ, విషక్రిమి ప్రయోగాలతోనూ, మహా భీభత్సంగా సాగే యుద్ధం, వస్తుందే అనే ప్రపంచమంతా భయపడిపోతోంది. నూత్నంగా దాస్యవిముక్తమయి, విభక్తమయిన, గాంధిజీ స్వదేశంలోనే, యుద్ధం ప్రత్యక్షం కాబోతోందంటే, ఆపటానికి ఆశక్యమౌతూందంటే, ఈ నిస్పృహ ప్రపంచ ప్రజను మరింతగా అలముకొంటోంది.

"మహాత్మాగాంధియే "శాంతి" విషయంలో నిస్పృహచెందితే, ఇక తక్కిన మానవలోకానికి ఆశించేందుకేముంది ?" అని ప్రజ గుజగుజలు పోతున్నారు.

కాని అసలు గాంధిజీ అభిప్రాయం సరిగ్గా తెలిశాక మళ్లి కాస్త తేరుకున్నాం. గాంధిజీ మాటల అసలు అర్థం ఇది. ఇల్లా పెద్ద పెట్టున హత్యాకాండలు, గృహదహనాలు, దోపిళ్ళూ, హింసా, జరుగుతూ ప్రజల ఉద్రేకాలు రెచ్చిపోతూండేటట్టయితే, ఈ రెండు రాజ్యాలు, తప్పుడు మార్గమని తెలిసీకూడా, తను ఇచ్ఛా విరుద్ధంగా యుద్ధానికి దిగవలసి వస్తుందని గాంధిజీ హెచ్చరించాడు — ఇది చాలా అదనెరిగి చేసిన హెచ్చరిక. స్వల్ప పరిస్థితి భేదాలతో, ప్రపంచ దేశాలలో ఎక్కడెక్కడ, ఇల్లా అంతర్వాహినులు ప్రచండమైన ప్రత్యక్ష యుద్ధ ముఖంగా ప్రవహిస్తున్నాయో, అక్కడక్కడల్లా ఈ హెచ్చరిక అవసరంగా అన్వయిస్తుంది.

సామాన్యంగా, మహాత్ముని అభిప్రాయము ఎప్పుడు ఏది కాస్త తెలిసినా, మహా ఆత్రంతో ముఖ్య వార్తలులాగే అమెరికా ప్రజలంతా స్వీకరిస్తూ ఉంటారు. ఈమధ్య రక్తపాతంతో భీభత్సముతో, విద్వేషాలతో ఉడికిపోతున్న కలకత్తా ఢిల్లీలలో ఆయన మహా అద్భుత చర్యలన్నీ మళ్ళీ ప్రపంచదృష్టిని ప్రముఖంగా ఆయనమీదికి కేంద్రీకరించాయి. (1939 నుంచి 46 దాకా ఆ మారణహోమ దినాల్లో అయితే, ఏ శాంతి దూతకూ, ప్రజలలో పలుకుబడి వచ్చేదికాదు.)

అయినా, పాశ్చాత్యలోకం ఎప్పుడూ గాంధీ మతానికి విరుద్ధంగా ఉంటూనే వచ్చింది. కొన్ని సమయాల్లో ఆయన్ను ఏసు క్రీస్తుతో పోలిక



చెపూ్త వచ్చిన మాటా నిజమే. న్యూయార్కు కమ్యూనిటీ చర్చి వాడైన గౌ॥ జాన్‌హేన్స్ హోమ్స్ చాలా కాలం క్రిందట ఇల్లా అన్నాడు. "రోమైన్ రోలా పేరు చెప్పితే నాకు టాల్‌స్టాయి జ్ఞప్తికి వస్తాడు. నెపోలియన్ పేరుతో లెనిన్ పేరు నా మనస్సుకు జోడింపుకువస్తుంది. గాంధిజీని తలచినప్పుడు ఏసుక్రీస్తే స్ఫురిస్తాడు"

కాని బహుశ్యా ఈసామ్యత ఉండటంవలననేనేమో, పాశ్చాత్యదేశాలు గాంధీతత్వానికి వశులుకాలేదు, ఈ వారం "సాటర్డే రివ్యూ ఆఫ్ లిటరేచర్"అన్న పత్రికలో బ్రూక్స్ అట్కిన్‌సన్ క్రిందివిధంగా వ్రాశాడు. బ్రూక్ అట్కిన్‌సన్ రష్యా చైనాలలో, న్యూయార్కు టైమ్స్ పత్రికా ప్రతినిధి. తక్కిన విదేశ విలేఖరులకన్నా విశాల దృక్పథంతో వ్రాస్తూవుంటాడు. ఆయన గాంధీని గురించి ఇలా అన్నాడు: "కేవలం జ్ఞానంతోనూ, స్వయం ఆచరణోదాహరణలతోనూ ప్రపంచం సమస్యలు పరిష్కారమవవు. యేసుక్రీస్తు బోధాచరణమూలాన్న 1900 ఏళ్ళు గడచినా ఇప్పటి ప్రపంచం ఏమాత్రమూ, "శ్రేష్టతర ప్రపంచ"ముగా మార్పు సాగించుకోలేదు."

ఇల్లాంటి సందేహాస్పదమైన విషయాన్ని ధైర్యసాహసాలతో ప్రకటించి అట్కిన్సన్ ఇల్లా విశదీకరించుకొన్నాడు;

"మనం ఒప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా ప్రపంచ సమస్యలు రాజకీయ విధానాల వల్లనే పరిష్కారం కావాలనేది స్పష్టం. అభ్యుదయార్థియై ప్రపంచ మహానాయకుడు కావలసినవాడు, ఆదర్శం, నమ్మకం, ఉన్నవాడైతే చాలదు. క్రియాశూరుడుకూడా కావాలి. అబ్రహాం లింకన్ చనిపోయి 80 ఏళ్ళు దాటినాకూడా, పాశ్చాత్యదేశాలలో గాంధీ ప్రభావముకన్నా ఆయన ప్రభావమే ఎక్కువవుంది. లింకన్‌కూడా, చాలా మతనిష్ఠాపరుడే. సర్వ మానవప్రేమ, స్వయం నమ్రతలూ కలవాడే. కాని అవసరం వచ్చేటప్పటికి, కార్యరంగములో వీరుడిలా దూకగలడు." అన్నాడు.


అయితే, కార్యశూరత్వము అంటే ఎల్లప్పుడూ యుద్ధమే అవనవసరంలేదు. లింకన్ నీగ్రోలను దాస్యవిముక్తులను చేశాడు. కాని నాలుగేళ్ళ అనవసరమైన ఆంతరంగిక కల్లోలంలో దేశాన్ని ముంచాడు. ఆనాటిద్వేషాలు అట్లాగే మిగిలాయి. దక్షిణదేశానికి దానితో వచ్చిన సమస్యలు అల్లాగే మరింత క్లిష్టమయిపోయాయి. అన్నిటికన్నా నీగ్రోలకు, ఈనాటికీ ఆ అస్పృశ్యతగాని, బీదరికంగాని తగ్గనేలేదు.

మహాత్మాగాంధీ, శాంత విధానంలో, బోధవలన, స్వకీయాచరణవలన, ఉపవాసాలవలన, హరిజనులను అస్పృశ్యతనుంచి తొలగించి, ఉత్తమ జీవితంలోకి, అభివృద్ధిపథంలోకి చూపగల మార్గంలో ప్రవేశింప చేయగలిగాడు. అల్లాగే జాతీయ సమరంలోకూడా,ధృవతారయై, పితృవ్యుడై, శాంతిభద్రుడై, ఒక్క చుక్క రక్తం చిందనీయకుండా, దేశాన్ని బ్రిటిషువారి దాస్యంలోనుంచి విముక్తంచేశాడు.

"ఆ ! బ్రిటిష్‌వారు కేవలం తమ ఆశక్తత వలనా, తమ గృహకల్లోలాలవల్లా ఇండియా వదిలారు తప్ప ఇదేమీకాదు." అని వాదించిన వారున్నారు. కాని డచ్చివారికి గృహకల్లోలం ఏమి తక్కువైందని ఇండోనీసియాలో పోరాటం సాగిస్తున్నారు ? ఫ్రెంచివారు ఇంట గెలిచామనే, ఇండోచైనా ఉత్తర ఆఫ్రికాలలో మొరాయించి, మూర్కించి దెబ్బలాడుతున్నారా ? బహుశ్యా బ్రిటిష్‌వారికి వీరికన్నా రాజకీయ జ్ఞానం ఎక్కువేమో! భారత సౌధంమీది, భవిష్యత్పురాణం వ్రాతలను ముందే గ్రహించగలిగి ఉండవచ్చును. ఆ వ్రాత గాంధీ దస్తూరీయే అయివుంటుంది. అది చదవటమెల్లాగో ఆయనే నేర్పి ఉంటాడు.

అందుచేత, గాంధీజీని కేవలం ఆదర్శవాదిగాను, లింకన్‌ను క్రియాశూరుడుగాను, విభేదం చెప్పుకోటం పొరపాటు. అసలు ముఖ్యంగా గాంధీజీ క్రియాశూరుడు. ఈ క్షణంలోకూడా ఆయనక్కడ రాజకీయ రంగంలో, ప్రత్యక్ష రాజకీయ, సాంఘిక ఆర్థిక సమస్యలను పరిష్కరించుకొనే కార్యకలాపంలో మునిగి ఉన్నాడు.

లూయీ ఫిషర్



Vijay
A seal for quality
Vijay Mixie
Vijay
అసోసియేటెడ్ మార్కెటింగ్ ఏజన్సీస్,
4-4-340/బి, బ్యాంక్ స్ట్రీట్. హైదరాబాదు-500 001.
ఫోన్: 58142/45895

ధర్మపథం:

బులుసు వెంకట రమణయ్య



స్త్రీశక్తి గొప్పదా? పురుషశక్తి గొప్పదా?

ప్రకృతియే సృష్టిని చేస్తున్నదనీ,పురుషుడు తామరాకువలె నిర్లిప్తుడనీ, పురుషశక్తి కంటే స్త్రీ శక్తియే గొప్పదనీ ప్రసిద్ధి. ఆది శంకరులు సౌందర్యలహరిలో "శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం" అని శక్తితో కూడి ఉన్నప్పుడే శివుడు ఏపనినైనా చేయగలుగుతాడనీ, ఆ శక్తి లేనియెడల శక్తిహీనుడయి ఉంటాడనీ చెప్పారు. పురుషశక్తి కంటే స్త్రీశక్తియే గొప్పదని దీని భావం.

ఒకప్పుడు పార్వతీ, పరమేశ్వరులు మాటలాడుకుంటున్నప్పుడు స్త్రీశక్తి గొప్పదా? పురుషశక్తి గొప్పదా ?— అనే విషయం చర్చకు వచ్చింది. స్త్రీశక్తే గొప్పదని పార్వతీదేవీ, పురుషశక్తి గొప్పదని మహేశ్వరుడూ వాదించారు. పార్వతీదేవి స్త్రీశక్తియే గొప్పదని నిరూపించడానికి కొన్నిఉదాహరణలు చూపింది. తన్ను మించిన మహా శూరుడు లేడంటూ ముల్లోకాలనూ గడగడలాడించిన మహిషాసురుణ్ణి సంహరించి లోకాలను రక్షించినది స్త్రీయేకదా ! అని, త్రిమూర్తులనూ పసిబిడ్డలనుచేసి ఆడించినది స్త్రీయేగదా ! అని, జనులందరి సుఖజీవనానికీ సంపదలు ఇచ్చేది మహిళయేగదా ! అనీ, విద్యలను ఇచ్చేదికూడా వనితయేకదా ! అనీ—అలా ఎన్నో ఉదాహరణల ఆమె చూపింది. అయినా, శంకరుడు ఆమె అభిప్రాయాన్ని ఒప్పుకోలేదు.

ఇంతలో శ్రీరాముడు అశ్వమేధయాగం చెయ్యడం తటస్థించింది. పార్వతీదేవి ఆలోచించి, లోకంలోఉన్న మహిళలందరి శక్తులనూ కేంద్రీకరించి రాముని పుత్రులైన కుశలవులలో సంక్రమింపజేసింది. మహేశ్వరుడీ సంగతిని గ్రహించి పురుషులందరి శక్తులనూ సంగ్రహించి, భగవదవతారమూర్తి అయిన శ్రీరామునిలోనూ, అతని సోదరులలోను సంక్రమింపజేశాడు. అశ్వమేధాశ్వం వాల్మీకి మహర్షి ఆశ్రమానికి సమీపంగా వచ్చినపుడు కుశలవులు దానిని కట్టివేయడం జరిగింది. తర్వాత కుశలవులతో రఘువీరులు యుద్ధం చెయ్యడం, పరాజయం పొందడం జరిగింది.

ఈ విధంగా పార్వతీదేవి స్త్రీశక్తియే గొప్పదని నిరూపించి, భర్తను చూచి చిరునవ్వు నవ్వింది. మహేశ్వరుడు "సరేలే ! నీవే గెలిచావు. నేనే ఓడిపోయాను"అన్నాడు, రఘువీరుల ఓటమి తన ఓటమిగా భావించి.

[శ్రీమద్రామాయణాంతరార్థంలోని గాథననుసరించి.] ★

మహాత్మాగాంధి-పాశ్చాత్య....

అసలు గాంధి తత్వానికి, ఇతర సుగుణాలతో పాటు, ఒక నూతన రాజకీయ విధానగుణముందనే సత్యాన్ని, గుర్తించలేకపోవటంలో, ముఖ్య విషయం గమనించకుండా, బ్రూక్సు ఆట్కిన్సన్, తప్పుదోవను పడిపోయాడు.

వ్యక్తి స్వయంశీలానికి, పదిమందిలోకి వచ్చేటప్పటి ఆచరణకి, అధిక వ్యత్యాసం ఏర్పడిపోయిందన్న ఏకైక స్వల్ప విషయమే, ఈనాటి ప్రపంచ దుస్థితికి కారణం అయి ఉండవచ్చును. ఏనాడూ హత్య చేయనివాడు, ఆ పేరు చెప్తేనే వళ్లు జలదరించేవాడు, యుద్ధంలో పైశాచికంగా హత్యాకాండలో నిమగ్నుడౌతున్నాడు. పిల్లలంటే అతిగా ప్రేమించేవారు, పెంపుడుపిల్లిని, కుక్కను పోషించేందుకు సర్వశక్తులు ధారవోసేవారు, ప్రపంచమంతటా పసిపిల్లలు తిండిలేక చచ్చిపోతూ నీరసులైపోతున్నా, తమ కడుపు నింపుకొని తృప్తిపడుతున్నారు. స్నేహితులతో, చుట్టాలతో, అబద్ధం ఆడడానికి వెరచేవారు, తము నిలబెట్టుకోలేమని తెలిసిన హామీలను, బాహాటంగా రాజకీయ రంగంలో ఇచ్చేస్తున్నారు. దైవంలో నమ్మకము, భీతిగలవారమనేవారు, వేలమంది సాటి మానవులను, దోపిడీచేసి, నిరసించీ, వివక్షతలు చూపీ, హక్కులను దొంగిలించీ, వారికి అపచారాలు చేస్తున్నారు.

ఇప్పుడు మహాత్ముడు, ఈ వ్యక్తి నైతిక శీలతకు, రాజకీయ ఆచరణకు, సంధానైక్యత కుదిర్చేందుకు నిలబడ్డాడు. ఈ సంధానమే, పాశ్చాత్యులలోనూ, ప్రపంచములో కూడా కరవైపోయింది. రాజకీయానికి, నైతికానికి సంబంధం కుదరటంలేదు. వ్యాపారానికి, నిజాయితీకి దూరమైపోయింది. కాబట్టే, మానవ — జాతి అంతా అటమటలాడిపోతుంది. క్రిష్టియన్లు, యూదులు, ముస్లింలు, హిందువులు, ఎవరైనా కానీండి, ఏడువారాలా, తమ మత నైతిక సూత్రాల నవలంబిస్తున్నవారు ప్రపంచంలో ఎందరు ఉన్నారు ?

కలకత్తా, ఢిల్లీలలో ఇంతటి అద్భుతాలు గాంధీజీ చూసినాకూడా, ఇండియాలో అనేక ప్రదేశాలలో హిందువులు, ముస్లింలు, సిక్కులు పెద్దపెట్టున ఘాతుకంగా హత్యాకాండ సాగించటంతో, బైట దేశాలలో గాంధీజీ ప్రతిష్ట కొద్దిగా దెబ్బతిన్నది. "తన బోధలు, తన తత్వము తన ఇండియా దేశమే పాలించనినాడు, పాశ్చాత్య ప్రజాస్వామ్యాల కిక ఈయన చెప్పేదేమిటి, ఈయన తత్వప్రభావమెంత" అని అన్నారు.

కాని ఈ ఘాతుక కృత్యాలు, తదుపరి భేదాలూ కూడా ఫాసిజం బీజాలను నాటుతాయి జాగ్రత్త అని నెహ్రూ ప్రధాని హెచ్చరించటంతో గాంధీజీ తత్వమే మరల గోచరించింది. హింసా విధానాలు నియంతృత్వాలకు దోవలు తెరుస్తాయి. తన ప్రజను నిందిస్తూ, (ప్రపంచం ముందర ఇండియా సిగ్గుతో తల వంచుకోవలసి వచ్చింద)ని నెహ్రూ తన వారిని కోప్పడ్డాడు.

ఇల్లాంటి నిజాయితీ అయిన, ఆత్మపరీక్ష, తదనుగుణమైన పశ్చాత్తాప ప్రాయశ్చిత్త సంస్కారాలూ — న్యాయము, స్వతంత్రము వీటికి అక్కడ నిలవనీడ ఉందని వక్కాణిస్తాయి. స్వదేశస్థులను ఖండించి చెప్పగల ధైర్యమూ చాలా కొద్దిమంది రాజకీయ నాయకులకుంటుంది. పైవారిపై తప్పు వేయటమే సామాన్యమైపోయింది.

ఒక్కరోజులోగాని, లేదా ఒక ఏడాదిలోగాని, ప్రజాస్వామ్యాలన్నీ గాంధీ తత్వంలోకి వచ్చేస్తాయని నేనాశించటంలేదు. ప్రస్తుతం ఉన్న కంగాళీలోనుంచి, ఆత్మవిశ్వాసంతో ఎల్లా బయట పడటమా అన్న ఆశాకిరణం కోసం, ఒక విశ్వాస బలంకోసం, పశ్చిమలోకం, తడుములాడుతోంది. పూర్వం ఎప్పటికన్నా కూడా ఆత్మవిచారణ, ఆత్మదూషణ ఎక్కువే అయ్యాయి. విమర్శన మైత్రీయుతంగాఉంటే, అట్టివాణ్ణి జనం తూర్పారబట్టడంలేదు. మనలో చాలామంది ప్రజలకు తెలుసును. ఈ మన స్థితిలో, ఈనాటి రాజకీయ స్వార్థపరత్వాలను, కాస్త గాంధీ తత్వంతో జోడించి వ్యవహరిస్తే మేలు కలుగక తప్పదు. ●

ఆంధ్రపత్రిక
1947 అక్టోబరు 22
సంచిక నుంచి



శకుంతల

—చక్కిలం విజయలక్ష్మి

అక్కడ... ఆ రోడ్డుమీద...

మనిషిని ఆశ్రయించుకుని తన వునికిని నిలుపుకునే జీవితం... ఆ జీవితం మోసగించి నప్పుడు మనిషి ఎక్కడ నిలబడాలో అక్కడే నిలబడి వుంది శకుంతల... రోడ్డుమీద.

భారతదేశపు గాలి పీల్చిన నేరానికి దాని పవిత్రతను కాపాడవలసిన బాధ్యత భుజస్కంధాల మీద కలిగివున్న స్త్రీ, శకుంతల ఆ బాధ్యతను మరచినదానిలా ఖూనీ చేయవలసిన పాప భారాన్ని పదిలంగా కడుపులో మోస్తూ నిలబడి వుంది! ఆమెకు భారతదేశపు పవిత్రత, స్త్రీ మాత్రమే నిలబెట్టవలసి వున్న పవిత్రత విలువ తెలిసినట్టు లేదు. లేకపోతే మాతృత్వపు మమకారాన్ని వూపిరితోనే పాతిపెట్టి, తన జీవితాన్ని పవిత్రత అనే పదానికి మీదు కట్టి వుండేది. ఇలా సిగ్గు విడిచి తన అపవిత్రతా చిహ్నన్ని కడుపుతో ఎత్తి పట్టుకుని తగుదునమ్మా అంటూ వూరూ వాడా తిరిగేది కాదు. చూస్తే అడవిమనిషిలా వుంది!

అయినా శకుంతల శకుంతలలాగే వుంది, అందంగా, అనితర సుందరంగా. కాకపోతే పనికిరాని ఫ్రేము బిగించిన అద్భుత చిత్రంలా వుంది. తగిన శిల వుపయోగించని అపురూప శిల్పంలా వుంది. అంతే.

శకుంతల మళ్ళీ ఆ భవనంకేసి చూసింది, కుంటివెధవ ఎవరెస్ట్ నెక్కాలని చూసినట్టు, మహాపాపి స్వర్గాన్ని అధిరోహించాలనుకున్నట్టు. కనీసం ఆ భవనం తాలూకు గూర్ఖా కలా అనిపించింది. 'జా జా' అన్నట్టుగా చేయి విసిరాడు.

దాదాపు గంట సేపటిగా గూర్ఖాకు, శకుంతలకు మధ్య ఈ యుద్ధం జరుగుతోంది. గేటు దగ్గరకు వచ్చిన శకుంతలను తోసినంత పని చేశాడు, కనీసం ఆమె చెప్పేదైనా వినిపించు కోకుండా. అప్పట్నించీ అలా దూరంగా నిలబడి చూస్తూనే వుంది శకుంతల, నోరుండీ లేనిదానిలా.

గూర్ఖా తిరస్కారం శకుంతల మనసును ఛిద్రం చేసింది. అభిమానం, ఆత్మ గౌరవం తాలూకు తొక్కిసలాటలో శకుంతల గుండె నలిగిపోయింది.

ఆయన కనిపించాలి ... ఆయన కనిపించాలి. అప్పుడు... ఆ అప్పుడు గూర్ఖాను శిక్షించాలనేమీ లేదు.

శకుంతల

శకుంతలకు. ఆయన ... ఆయన తన నడుము చుట్టూ చేయివేసి, మరో చేతితో తన చేయి పట్టుకుని లోనికి నడిపిస్తూ వుంటే గూర్ఖాను చూసి చిరునవ్వు, చిన్న చిరునవ్వు నవ్వాలని వుంది. అంతే.

కానీ అది జరుగుతుందా ?! జరుగుతుందనే శకుంతల నమ్మకం. ఆమెకు అభిజ్ఞాన శాకుంతలం ఎంతో ఇష్టం. ఏ పాపమూ ఎరుగని దుష్యంతుడు శకుంతల పొందిన శాపం వల్ల దుర్మార్గుడుగా, నమ్మక ద్రోహిగా చిత్రింప బడటాన్ని ఎంతైనా నిరసిస్తుంది శకుంతల. ఆమె దుష్యంతుని ఎంతో సానుభూతితో అర్థం చేసుకుంది. తన జీవితంలోని దుష్యంతుని కూడా ఆమె అదే దృష్టితో చూస్తోంది.

ఎందుకో తెలీదు; ఆయన తన దగ్గరకు రాలేని పరిస్థితి ఏర్పడింది. తనే రావాలనుకుంది. వచ్చింది. తప్పేముంది ? ఇదీ శకుంతల అభిప్రాయం.

ఎంత కష్టపడాలో అంతా కష్టపడి ఆయన, సుకుమార్ ఇల్లు తెలుసుకుంది. కానీ గూర్ఖా ...

ఆయన రావాలి. అప్పుడు ... అప్పుడు ...

కారు హారన్ శబ్దానికి వులికిపడి పక్కకు తప్పుకుంటూ కార్లోకి చూసింది శకుంతల. అంతే.

శకుంతల గుండె లయ తప్పింది.

ఆయన ... ఆయన ... !!!

శకుంతల ఆనందపు కోలాహలంలోంచీ, ఆశ్చర్యపు వెల్లువలోంచీ తేరుకోకముందే కారు ఆమెను దాటుకుని గేట్లోకి వెళ్లిపోయింది.

శకుంతల రెప్పపాటులో తేరుకుంది. లేడిలా పరిగెత్తింది.

'''ఏమండీ ... ఏమండీ ...''

గూర్ఖా ఆమె శరీరాన్ని అడ్డగించాడుగానీ స్వరాన్ని అడ్డగించలేకపోయాడు. ముందుకు వెళ్తున్న కారు స్లోఅయి క్రమంగా ఆగిపోయింది. కారు విండోలోంచి ఓ తల బయటకువచ్చి, ఇటు తిరిగి శకుంతలకేసి చూసింది. ఆ చూపు తన మీద పడినప్పుడు పాల వెన్నెలలో స్నానం చేసినట్లు పులకించిపోయింది శకుంతల. ఆయన చూపుల కొసలు తనను తాకిన క్షణం ఆయన కన్నులలో మెరుపులు మెరుస్తాయనీ, అమృతం కురుస్తుందనీ ... కానీ, అతని కనుబొమలు అర్థంకాని లెక్కను చూసినట్లుగా చిక్కుముడి పడ్డాయి !

అతను గూర్ఖాను రమ్మని సౌంజ్ఞ చేశాడు. గూర్ఖా పరిగెత్తుకుంటూ వెళ్లాడు. అతను శకుంతలను చూపిస్తూ ఏదో చెప్పాడు. గూర్ఖా తల వూపాడు.

శకుంతల ఆదుర్దాతో చూస్తోంది.

ఆయన ... తన నడ్డగించి నందుకు గూర్ఖాను చీవాట్లు వేస్తున్నారా ? లేక తనను లోనికి తీసుకురమ్మని చెబుతున్నారా ?

ఆమె ఆశలమీద, ఆలోచనలమీద కారు చక్రాలు బరువుగా దొర్లిపోయాయి.

నిర్ఘాంతపోయింది శకుంతల. నిర్విణ్ణు రాలయింది శకుంతల.

ఆయనేం చెప్పారో తెలీదు. ఏం చేయ మన్నారో తెలీదు. అయితే తనేం ఆశించిందో అది జరగబోవడంలేదని మాత్రం అర్థమైంది శకుంతలకు.

గూర్ఖా దగ్గరకు వచ్చాడు.

"ఇదిగో ! ఇట్లారా. ఇక్కడ నిలబడు. ఒక్క అడుగు ముందుకు వేశావో మెడబట్టి బయటికి గెంటేస్తాను" శకుంతలను తీసికెళ్లి భవనానికి కొంచెం దూరంలో, దారికి ఒకవైపుగా లాన్‌లో నిలబెట్టాడు.

అతని మాటే తప్ప తనేం అడిగినా సమాధానం ఇచ్చేలా కనిపించలేదు గూర్ఖా. ఏమీ అడగాలనీ అనిపించలేదు శకుంతలకు. ఖైదీలా అతను నిలబెట్టిన చోట నిలబడి పోయింది.

గూర్ఖా గేటు దగ్గరకు వెళ్లిపోయాడు.

శకుంతల భవనం కేసి చూసింది.

అలనాడు దుష్యంతుని రాజభవనం ఇంత గొప్పగానూ వుండిందా ! అనుమానం వచ్చింది శకుంతలకు.

అమాయకమైన కళ్లతో తనను కరిగించిన యువకుడు, ఆరాధనా సుమాలతో తన నభిషే కించిన ప్రియుడు ఇంత స్థితిపరుడంటే నమ్మ సఖ్యంగా లేదు. కానీ నమ్మాలనే అనిపించింది శకుంతలకు. ఎందుకంటే అతని కళ్లున్నది తనను చూడడానికే అన్నంత మక్కువతో పూలు కురి సేలా చూసిన ఆ చూపులకు... కార్లోంచి అపరి చితుడిలా, అహంతో, హుందాగా ముళ్లు గుచ్చి నట్లుగా చూసిన ఈ చూపులకువున్న తేడాకంటే

స్వార్థపరుడు

స్వార్థపరుని గుండె
తేలు కొండె —
స్వార్థపరుని హృదయం
దెయ్యాల నిలయం —
స్వార్థపరుని తెలివి
దేశం తలపై కొరివి —
స్వార్థపరుని కళ్ళు
దేశం దేహంపై పుళ్ళు —
కరడుగట్టిన మతోన్మాదం
వీడికి వేదం —
కుళ్ళిపోయిన కులతత్వం
వీడికి సర్వసమ్మతం —

— భగ్వాన్.

ఇదేమీ ఎక్కువకాదు. లేడికూన పెద్ద పులిగా కనిపించినట్లుగా... !

ఏమయిందీయనకు ? తనను మరచిపోయారా ? తన కెవరూ శాపం ఇచ్చిన గుర్తు లేదే ! నవ్వు వచ్చింది శకుంతలకు.

ఆయన తనను మరచిపోలేదు. లేకపోతే తన నిక్కడిదాకా రానిచ్చి ఇక్కడ నిలబెట్టవలసిన అవసరం లేదు. కాకపోతే గుర్తుంచుకోవలసిన రీతిలో గుర్తుంచుకోలేదు. అంతే.

లోనుండి సుకుమార్ వచ్చి వరండాలోని సోఫాలో కూర్చున్నాడు. అతని వెంట దాదాపు అరడజను కుక్కలు వున్నాయి. అతని చేతుల్లో బిస్కెట్ పాకెట్లు వున్నాయి. సుకుమార్ పాకెట్లువిప్పి బిస్కట్లు కుక్కలకు అందించ సాగాడు సుతారంగా.

చాలా అందమైన కుక్కలు. బాగా బొచ్చు వున్నవి ఖరీదైన బిస్కట్లు తింటున్నాయి. యజమాని వజ్రపుటుంగరాల వేళ్లతో పెడుతున్నాడు. ఈ దృశ్యం ఎంతో బావుంది. చూడ ముచ్చటగా వుంది.

రాక్షసులు ఏలుతున్న స్వర్గాన్ని చూస్తున్న దేవతలా చూసింది శకుంతల ఆ దృశ్యాన్ని.

కుక్కలు బిస్కట్లుతింటూ యథాలాపంగా చూస్తూ శకుంతలను చూశాయి. శకుంతల తమను చూడ్డం చూశాయి. భుక్తాయాసంతో చికాగ్గా వున్న కుక్కలకు ఆ చూపు సహించినట్లులేదు. "భౌ" మంటూ ముందు కురికి వచ్చాయి. అదిరిపడిన శకుంతల ఒక్కవుదుటున పరిగెత్తబోయి క్రింద పడిపోయింది.

"టామీ, బులెట్, లిజీ, కమాన్. కమాన్ ఐసే" సుకువూర్ సుకుమారంగా పిలిచాడు.

కుక్కలు అక్కడే ఆగి, నింపాదిగా వెనుదిరిగాయి.

క్రింద పడివున్న శకుంతల సుకుమార్‌కేసి చూసింది. అతని చూపులు కుక్కలమీదే వున్నాయి. కానీ అతని పెదిమలమీద కనీకనిపించని నవ్వు !

చివ్వున లేచి నిలబడింది శకుంతల. వరండా వైపు అడుగు కదపబోయింది. లోనుండి వస్తున్న ఇద్దరు స్త్రీలను చూసి ఆగిపోయింది. ఒకామె వృద్ధురాలు, మరొకామె పద్దెనిమిదేళ్ల యువతి. ఇద్దరూ అందంగా, ఆడంబరంగా వున్నారు. ఆ ఇంటి యజమాని సంపదకు అద్దాల్లా వున్నారు.

"అన్నయ్యా, చున్నీలాల్ ఫోన్ చేశాడు. మంచి డైమండ్ నెక్లెస్‌లు వచ్చాయట. చూసిరానా ?" గోముగా అందా అమ్మాయి.

వాళ్ల మాటలు బాగానే వినిపిస్తున్నాయి శకుంతలకు. వినిపించేంత దూరంలోనే నిలబెట్టాడు గూర్ఖా.

"ఓకే, ఓకే" అన్నాడు సుకుమార్.

"మా మంచి అన్నయ్య" సంతోషంగా అంది.

"నీవూ డైమండ్ నెక్లెస్‌కేనా బామ్మా?" నవ్వుతూ ప్రశ్నించాడు సుకుమార్.

"లేదురా నాన్నా. లక్ష్మీదేవి విగ్రహం ఒకటి వెండితో చేయమని ఆర్డర్ ఇద్దామని" ఆ వృద్ధురాలంది. "వరలక్ష్మీ వ్రతం వస్తోందిగా."

"మీ కారు డ్రైవర్ వచ్చాడా?"సుకుమార్.

"అదిగో" ఆ అమ్మాయి కారుషెడ్‌వైపు చూపింది.

దూరంగా విశాలమైన షెడ్‌లోవున్న ఎర్ర రంగు కారులో ఆ స్త్రీలిద్దరూ వెళ్లిపోయారు.

ఆ కారు బయటకు వెళ్తూండగానే మరో కారు బయటినుండి లోపలికి వచ్చింది. నలుగురు వ్యక్తులు దిగి సుకుమార్‌ను కలుసుకున్నారు. వాళ్లేదో వ్యాపారం గురించి మాట్లాడారు. వ్యాపారం అంతా లక్షలమీదే నడిచింది. లాభం కోట్లు మీద వుంది. అందరూ సంతోషంగా కరచాలనాలు చేసుకున్నారు. మధ్య మధ్య నౌఖర్లు తెచ్చిపెట్టిన టీలు సిప్ చేశారు. బిస్కట్లూ మునిపంటితో కొరికారు. యాపిల్ ముక్కలు నాలుకతో నాకి వదిలారు. సిగరెట్లు ఒక్క పఫ్‌తోనే యాష్‌ట్రే అనే సమాధి చేరుకుంటున్నాయి. చివరకు వాళ్లు వెళ్లిపోయారు.

మళ్లీ కుక్కల్ని ముద్దు చేయసాగాడు సుకుమార్.

లోపలినుండి ఓ మనిషి వచ్చాడు. అతని చేతుల్లో ఫోన్ వుంది.

"కాశ్మీర్ నుండి కార్పెట్లు వచ్చాయట సార్" అంటూ అందించాడు.

సుకుమార్ ఫోన్‌లో మాట్లాడాడు.

"ఆ ఆ. నమస్తే. ఏమిటీ ? పదివేలా?"

"..........."

"అహ, ఆశ్చర్యం కాదు. బావుంటే పదివేలేమిటి ఇరవై వేలైనా ఇస్తాను."

"..........."

"అలాగే. చెక్కు పంపిస్తాను."

"..........."

"ఆ. నమస్తే, నమస్తే"

సుకుమార్ సంభాషణ ముగించాడు.

ఆ వ్యక్తి లోపలికి వెళ్లి చెక్కు బుక్కు, పెన్ తెచ్చి ఇచ్చాడు. సుకుమార్ రాసి ఇచ్చిన చెక్ తీసుకుని వెళ్లిపోయాడు.

ఎవరో వస్తున్నారు. మరెవరో వెళ్లిపోతున్నారు. గడుస్తున్న ప్రతి క్షణం, నడుస్తున్న ప్రతి పని ఆ భవనం తాలూకు సంపన్నత్వాన్ని చెప్పకయే చెబుతున్నాయి.

ఎండ హెచ్చయింది. వడగాలికి ఆగలేని సుకుమార్ లోపలికి వెళ్లిపోయాడు. పోతూండగా అతని ముఖంలోకి చూసింది శకుంతల. అతని చూపులు శకుంతలమీద లేవు ! కానీ అతని పెదవులమీద నవ్వు వుంది. పంజాలో చిక్కి గిలగిలలాడుతున్న సాదు జంతువును చూసి పులి నవ్విన నవ్వు !

శకుంతల కాలు కదలబోయింది.


అతని వెనకే కుక్కలున్నాయి !


నిట్టూర్చింది శకుంతల మనను.


వాడి పెంచుకుంటూన్న సూర్యకిరణాలు శకుంతల గుండెలు చీల్చుకుని లోనికి చూడసాగాయి.

* * *

"శకుంతలా"







భారత సాంస్కృతిక సమైక్యతాసంఘం (న్యూఢిల్లీ)వారు ఇటీవల ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సంగీత కళ్యాణోత్సవానికి భారత రాష్ట్రపతి శ్రీ జెయిల్‌సింగ్ ప్రారంభోత్సవం చేసారు. సాంస్కృతిక, జాతీయ సమైక్యతలకి తమ సహకారాన్నందిస్తున్న శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణని రాష్ట్రపతి కమిటీ తరపున సత్కరిస్తున్న దృశ్యం. నిర్వాహకులు శ్రీ టి. వి. కె. శాస్త్రిని కూడ చిత్రంలో చూడవచ్చు.

''వస్తున్నా నాన్నా'' పలుకుతోనే వెలుపలికి వచ్చిన శకుంతల తండ్రిని చూసి ఆశ్చర్యపోయింది. ఆ వెంటనే ఆదుర్దా పడిపోయింది.

రఘురామయ్య భుజంమీద ఓ మనిషి అచేతనంగా వేళ్లాడుతున్నాడు!

''ఇలా పట్టు'' కూతురి సహాయంతో కుటీరంలోని నులకమంచంమీద పడుకోబెట్టాడు రఘురామయ్య.

''ఎవరు నాన్నా? ఏమైంది?'' తండ్రి అడిగిన వస్తువు అందిస్తూ అడిగింది శకుంతల.

''ఎవరో పట్నం కుర్రాడు. కోన మలుపు దగ్గర ప్రమాదం జరిగి స్పృహ పోయింది.''

రఘురామయ్య భార్య చనిపోగా విరక్తితో అడవి చేరాడు. అప్పుడు శకుంతల ఐదేళ్ల పసిపిల్ల. రఘురామయ్యకు మూలికా వైద్యం తెలుసు. విద్యాభోధన తెలుసు. ఆ రెంటితోనూ గిరిజనుల మధ్య 'రామయ్య తండ్రి'లా కాలం వెళ్లదీస్తున్నాడు.

రెండు మూడు రోజుల్లో కొంచెం తేరుకున్నాడు సుకుమార్ అనే ఆ యువకుడు.

లేడికూనలా, వెన్నెల సోనలా, పుట్టతేనెలా అందంగా, అమాయకంగా, మధుర మధురంగా కళ్లముందు తిరుగుతోంది శకుంతల. ఆమె యవ్వన మకరందం సుకుమార్ మగతనపు మధుపాన్ని పూరించి కలవర పెట్టసాగింది.

ఆ రోజు రాత్రి...

కొండ అవతల ఎవరికో త్రాచుపాము కరిచిందని రఘురామయ్యను తీసికెళ్లారు గిరిజనులు.

శకుంతల

నిద్రపట్టని సుకుమార్, లేచి కుటీరం కిటికీదగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

కుటీరానికి దిగువన, ఓ వైపుగావున్న నీటి మడుగు గట్టున కూర్చునివుంది శకుంతల. వెన్నెలలో తప్పతడిసి, ఇంకా వెన్నెల ఆరని అపురూప కుసుమంలా వుంది శకుంతల! స్త్రీ రూపంలో చెక్కిన తెల్లమేఘంలావుంది శకుంతల! తెగిపడిన శశాంక శకలంలా వుంది శకుంతల!

పాలవెన్నెల ఆమె చెక్కిళ్ల మీదినుంచి అలల వరుసలాంటి మెడమీదుగా, వక్షస్థలం మీదికీ జలపాతంలా దుముకుతోంది. చంద్ర కిరణాలు సోకిన కలువల్లా పూర్తిగా విచ్చుకున్న కళ్లతో చంద్రునికేసి చూస్తోంది శకుంతల.

ఆ క్షణంలో నిజంగానే మనసు పారేసుకున్నాడు సుకుమార్.

దగ్గరగా వేసిన తడిక తలుపు తెరుచుకుని మెల్లగా నడిచి వచ్చాడు.

''శకుంతలా'' మృదువుగా పిలిచాడు.

ఉలికిపడిన శకుంతల అతన్ని చూసి తత్తర పాటుతో లేవబోయింది.

''లేవకు. లేవకు'' తనూ ఆమెకు కొంచెం దిగువన కూర్చున్నాడు.

నిశ్శబ్దంగా ఆమె పెదిమల మాధుర్యాన్ని రుచి చూస్తున్న చంద్రుని కిరణాన్ని చూసి అసూయ కలిగింది సుకుమార్‌కు.

తనకు కొంచెం దూరంలో చీరె కుచ్చిళ్ల లోంచి జారిన ఆమె పాదాలు ... వెన్నెల కరిగి కరిగిఅ రూపంలో ఘనీభవించినట్లుగా వున్నాయి.

శకుంతల కళ్లలోకి చూశాడు సుకుమార్. నీలి కాంతులీనుతూన్న ఆ కళ్ళు, సుందర స్వప్నాలు కంటున్నట్టు మత్తెక్కి వున్నాయి.

మాటలు కలిసినా మనసెప్పుడూ బయట పెట్టలేదు సుకుమార్. ఈ అమూల్యావకాశాన్ని జారవిడువదలచుకోలేదు. జారవిడిచే అవకాశమూ లేదు.

''శకుంతలా.''

''ఊ ...''

''శకుంతల ... అంటే తెలుసా?''

''అభిజ్ఞాన శాకుంతలం చదివాను'' మెల్లగా చెప్పింది.

''అయితే శకుంతల సౌందర్యం గురించి ... నాకంటే నీకే బాగా తెలుసు.''

ఒక్క నిముషం మౌనంగా వుంది శకుంతల. తర్వాత —

''స్త్రీ సౌందర్యం గురించి స్త్రీ కంటే పురుషుడికే బాగా తెలుసు.''

ఆశ్చర్యపోయాడు సుకుమార్. శకుంతల ఇంత తెలివిగా మాట్లాడగలదని అతనూహించ లేదు. ఇంత లౌక్యం వుంటుందనీ అనుకోలేదు. అరణ్యంలో పెరిగినపిల్ల ...!

''అయితే ... అయితే శకుంతలా, స్త్రీ కంటే ఎక్కువగా స్త్రీ సౌందర్యాన్ని గుర్తించ గలిగిన పురుషుడికి ఆ సౌందర్యాన్ని ఆరాధించే అర్హత లేదంటావా? అది తప్పంటావా?''

''............''

''చెప్పు శకుంతలా.''

''కాదనుకుంటాను.''

''అయితే ... అయితే ... శకుంతలా, ఈ ప్రేమ బైరాగికి నీ ప్రేమభిక్ష ప్రసాదించు'' చప్పున శకుంతల కాలి కొనవేళ్లకు పెదిమల్ని తాకించాడు సుకుమార్.

శకుంతల హృదయం జలదరించిపోయింది. శరీరం పులకరించిపోయింది. ఆమె మనోమయ ప్రపంచం వసంతం ప్రవేశించినట్లుగా పూలు పూచిపోయింది.

సుకుమార్ పెదవులు శకుంతల పాదాల దగ్గరినుండి పైకి పైకి పాకి ఆమె అధర మధు భాండం దగ్గర ఆగిపోయాయి.


ఎంత పవిత్రంగా, సంప్రదాయ సిద్ధంగా పెరిగిన కన్యఅయినా వయసు ఆకర్షణకు లోను కావటం అత్యంత సహజం. కణ్వుని ఆశ్రమంలోని శకుంతలకే ఆ కామన తప్పలేదు.

శకుంతల లొంగి పోయింది. సుకుమార్ కోరికకు కాదు. ప్రతి ఆడపిల్లలాగే తన ప్రియుని లోచూసిన అమాయకత్వానికి, ప్రేమకు, నమ్మకానికి. ముఖ్యంగా తన పట్ల ఆరాధనకు.

పదిహేను రోజుల 'ప్రేమ వసంతం' సుకుమార్‌తోపాటే తరలిపోయింది.

గ్రీష్మం మొదలయింది!

భద్రత లేని చోట ప్రేమ భద్రంగా ఫలించటం మామూలే.



ఈ ఏర్‌కండిషనర్‌నకు ఎలెక్ట్రిసిటీ అక్కరలేదు, భరించు ఖర్చులు చాలా తక్కువ, కంటికి కనబడదు, చూచుటకు హుందాగా వుంటుంది.

కాయర్: (కొబ్బరి పీచు)

ప్రజలు యీ దినములలో దీనిని అద్భుతమైన క్రొత్త విధములైన ఉపయోగములకు వాడుచున్నారు. "ఏర్‌కండిషనర్", యిలాంటి వానిలో మచ్చునకొకటి. కాయర్ (కొబ్బరి పీచు) ఉష్ణము నుండియు శబ్దము నుండియు కాపాడగల ఉత్తమమైన సాధనం, అంటే ఇది మిమ్ము వేసవియందు చల్లగాను, చలికాలమునందు వెచ్చగాను వుంచుతుంది. శబ్దమును దూరం చేస్తుంది. కాయర్ (కొబ్బరి పీచు) తివాసీలు, గోడ చాపలు, ఫాల్స్ సీలింగులు, మీకు స్వాభావికమైన ఏర్‌కండిషనర్లుగా అనుకోవచ్చు.

మీరు ఆధారపడదగిన సుఖము:

రబ్బరుతో కలిసిన కాయర్ (కొబ్బరి పీచు) ఫోమ్ మేట్రెస్ యిచ్చునంతటి సుఖము నిచ్చును. ఇంతేగాక అనేక విధాల ఆరోగ్యకరమైనది. మీ వెన్నుకు ఆధార మిచ్చుటకై యిది కొంచెం గట్టిగా వుంటుంది.

ఇందులో గాలి సులభంగా "యిటునటు" వస్తుంది. ఎక్కువ వెచ్చదనముగాని యెక్కువ చల్లదనముగాని పొందదు. ప్రపంచమంతటాగల యెముకల నిపుణులు మరియు డాక్టర్లు ఫోమ్‌న కంటే రబ్బరు కలిసిన కాయర్ (కొబ్బరి పీచు) నే యెన్నుకొంటారు.

మీరుకూడా రబ్బరు కలిసిన కాయర్ (కొబ్బరి పీచు)ను మీ ఇంటియందు, కారునందు ఆఫీసు నందు వాడుకొనవచ్చు.

20వ శతాబ్దంలో కాయర్ (కొబ్బరి పీచు)


కొంతకాలంగానే శబ్దం దూరంగా వుంచుటలో పరిమితమైన ఖరీదుగల ఉత్తమమైన సాధనంగా ప్రపంచమంతటా ప్రత్యేక అభిమానమును పొందింది. ఇది ఏర్‌కండిషనర్లలో ఏర్ ఫిల్టరుగా కూడా వుపయోగింపబడుచున్నది.

ఇక యిప్పుడు కాయర్ (కొబ్బరి పీచు)ను అనేక విధములైన క్రొత్త పద్ధతులలో ఉపయోగించుటకై కాయర్ బోర్డ్ పరిశోధనలు చేస్తున్నారు,

నూనెకు లేక నీటికి ఫిల్టరుగాను,

బొగ్గు గనులందు మరియు గొట్టపు బావులందు ఉపయోగించుటకు.

కొబ్బరిచెట్టు, మానవునికి ప్రకృతి ప్రసాదించిన బహుమతులలో యెంతో చక్కనిదిగా పేరుగాంచింది. అత్యుత్తమైన సరిక్రొత్త అవధులు అందుకొన మానవుడు అభివృద్ధి చెందుకొలది, వాని నమ్మకమైన పాత మిత్రము కూడా, వానితోనే ముందుకు సాగిపోవుచున్నది.



కాయర్ బోర్డ్

కొచ్చిన్-682 016

శకుంతల

శకుంతల తల్లి అయింది;

ఆతనెవరో తెలీదు ... సుకుమార్ అనే పేరు తప్ప!

ఆతనెక్కడుంటాడో తెలీదు ... వస్తాడనే నమ్మకం తప్ప!

బిడ్డ గురించిన ఆవేదనతో రఘురామయ్య ప్రాణాలు కోల్పోయాడు. కడుపులోని బిడ్డ గురించిన ఆలోచనతో శకుంతల ప్రాణాలు నిలుపుకుంది.

అన్వేషణ మొదలయింది.

* * *

ఎండ కరకర లాడ్తోంది. చర చర ఘంటోంది. పగబట్టిన తాచులా వడగాలి బుసలు కొడ్తోంది.

నీడ కోసం చూసింది శకుంతల.

ఆ చుట్టు పక్కల ఎక్కడా వృక్షాలు లేవు. అన్నీ పూల మొక్కలు, క్రోటన్సు. డబ్బు పెట్టి కొన్నవి. డబ్బును నీళ్లలాపోసి పెంచుతున్నవి. ధనం ఎంత ప్రయోజన శూన్యంగా వాడబడుతోందో తెలిసింది శకుంతలకు.

సుకుమార్ అద్భుతమైన ఆరాధనను చవి చూసిన శకుంతల పూలగుత్తిలాంటి శరీరం ఎండకు కమిలిపోసాగింది! సుకుమార్ ప్రేమదాహాన్ని తీర్చిన శకుంతల పెదవులు నీళ్లు లేక ఆరిపోయి చిట్లిపోయాయి. సుకుమార్ చుంబనలతో తడిసిపోయిన శకుంతల కాళ్లు వేడికి మాడి బొబ్బలెక్కిపోయాయి.

ఆకలితో శకుంతల పేగులు వుండచుట్టుకు పోయాయి.

* * *

సాయంకాలం నాలుగవుతూండగా గేట్లోంచి ఓ లారీ వచ్చి ఆగింది. దాన్నిండా కుర్చీలు, బల్లలు వున్నాయి. అరడజను మంది నౌఖర్లు హడావుడిగా ఆ కుర్చీలను, బల్లలను తోటలోని లాన్సులో వేశారు. బల్లలమీద తెల్లటి టేబుల్ క్లాత్స్ పరచి, పూల కుండీలు వుంచారు.

ఎలెక్ట్రీషియన్సు వచ్చి రంగురంగుల బల్బులు ఇంటి ఎలివేషన్‌కు అలంకరించారు. ఇంకా రకరకాల అందాలను అవసరం లేనంత ఆడంబరంగా అలంకరించారు.

ఆరు గంటలనుండీ ఆ ఇంటికి రకరకాల మనుషులు రంగు రంగుల కార్లలో రా నారంభించారు. అక్కడ గుమిగూడిన మనుషుల అందాల్లో, అలంకారాల్లో, ఆడంబరాల్లో తేడాలున్నా వాళ్లందర్నీ అక్కడ కలిపిన పదార్థం మాత్రం ఒక్కటే. అది డబ్బు.

చీకటిపడ్డ తర్వాత విద్యుద్దీపాల వెలుగులో అక్కడ శకుంతలకు అర్థంకాని కోలాహలం ఏదో మొదలయింది. నవ్వులు, కేరింతలు, తుళ్లింతలు, చప్పట్లు. సీసాల్లోంచి గ్లాసుల్లోకి, గ్లాసుల్లోంచి కడుపుల్లోకి అంచెలంచెలుగా మారుతున్న అందమైన రంగు రంగుల ద్రవం. పచ్చిమాంసంలా పీక్కు తింటున్న కోడికాళ్లు, చేప వెన్నుపూసలు.

శకుంతల కర్థమైంది ఒక్కటే. ఇది తనకు సంబంధించని లోకం.

శకుంతలకు పూర్తిగా అర్థమైపోయింది.

ఆమె ఆకలి అణగారిపోయింది. కాళ్లు లాగటం మానేశాయి. కళ్లు తిరగడం ఆగిపోయింది. ఒళ్లు తూలటం తగ్గిపోయింది.

శకుంతల ఆతృతగా చూడసాగింది. ఒళ్లంతా కళ్లు చేసుకుని చూడసాగింది... సుకుమార్ కోసం, అతని రాకకోసం.

చాలా సేపటికి, అతిథి దేవుళ్లందరూ అదృశ్యమైపోయిన చాలాసేపటికి సుకుమార్ శకుంతల దగ్గరకు వచ్చాడు.

శకుంతల అతన్ని చూసి సిగ్గుపడలేదు. పరవశంతో సోలిపోలేదు. కనురెప్పలు లజ్జతో బరువుగా వాలిపోలేదు. ముఖం అవనతం కాలేదు. నింపాదిగా, సూటిగా చూసింది.

ఠీవిగా నిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు సుకుమార్. శకుంతల కేసి ఓరగా చూస్తూ ''ఇంకా ఈ ఇంటి ఇల్లాలుగా రావడానికి ధైర్యం మిగిలివుందా?'' అన్నాడు.

''లేదు''

నవ్వాడు సుకుమార్, విజయ గర్వంతో నవ్వుతూనే వున్నాడు. శకుంతల పెదిమలమీదా నవ్వు... వాడిగా.


''చూడూ, శకుంతల... శకుంతల కథ చాలా పాతది. అది అలా పునరావృతం అవుతూనే వుంది. నేనూ శకుంతలనే. ప్రేమానురక్తనే. పరిత్యక్తనే. అందులో విచిత్రం ఏమీలేదు. కానీ ధనం ఎర చూపి వల వేసే ఈ సమాజంలో, ధన ప్రదర్శనతో భయపెట్టి వదిలించుకోవాలనే నేర్పు వుంది చూడూ, అది చాలా కొత్తది. అరణ్యంలోని క్రూర జంతువులా, ప్రేమించిన ఆడదాన్ని ఇంత క్రూరంగా దెబ్బతీసిన దుష్యంతుడున్నాడు చూడూ, వాడు చరిత్రకు చాలా చాలా కొత్తవాడు. ఎంత నీచంగా, ఎంత క్రూరంగా చెలగాటమాడావు! సరే. ఇంతసేపటిగా, ఇంత సహనంగా నేనిక్కడ నిలబడ్డానే, నీవు కరుణిస్తావేమోననే ఆశతో కాదు. నీ పాదాల దగ్గర ఇంత చోటుకోసమూ కాదు. నీ వడిగావే 'ఇంకా ఈ ఇంటి ఇల్లాలుగా రావడానికి ధైర్యం మిగిలి వుందా?' అని. దానికి 'లే'దని సమాధానం చెప్పడానికి. నీ వంటి క్రూరమృగం మసలే ఈ భయంకరారణ్యంలోకి అడుగుపెట్టే ధైర్యం నాకు లేదని చెప్పడానికి నీ సహజ జంతు తత్వాన్ని చూపి నాకు చాలా మేలు చేశావని కృతజ్ఞత తెల్పుకోవడానికి. అయినా నిన్ను జంతువుల్తో పోల్చడం ఏమిటి!!! క్రూరజంతువులు ప్రియురాళ్ని ఎప్పుడూ మోసగించవు, వాటి కోసం ప్రాణాల్ని ఇస్తాయితప్ప. ఎందుకో తెలుసా? వాటికి 'బుద్ధి' వుండదు గనుక. వస్తాను.''

సుకుమార్ నవ్వు ఎప్పుడో ఆగిపోయింది. ఏలుకొమ్మని కాళ్లా వేళ్లా పడ్తే మాటల్తో మరింత చిత్రహింస పెట్టి ఆమె బాధను ఎంజాయ్ చేసి పంపాలనుకున్నాడు సుకుమార్. కానీ శకుంతల తిరస్కారంతో అతని అహం దెబ్బ తిన్నట్లయింది. మగతనపు పౌరుషంతో రగిలి పోయాడు. వెళ్లడానికి అడుగు కదిపిన శకుంతలను ''ఆగు''అంటూ చేయి పట్టుకున్నాడు.

బుసకొట్టే నాగులా విసురుగా కదిలింది శకుంతల. సుకుమార్ చెంప చెళ్లుమంది.

''నిన్ను క్రూర జంతు వన్నాను. క్రూర జంతువంటే నా కెప్పుడూ భయం లేదు. కాని అభిమానం దెబ్బతిన్న ఆడది పగపట్టిన పాము వంటిది. దాని జోలికి వెళ్లావా ప్రాణంతీస్తుంది జాగ్రత్త.''

బుద్ధిలేని జంతువుల మధ్యకే మళ్లీ పయనమై వెళ్లిపోయింది శకుంతల. ★






కోల్గేట్ తాలూకు నమ్మకమైన
ఫార్ములా మీ నోటి శ్వాస
శుభ్రంగా, తాజాగా వుండేలా
చేస్తుంది...
మీ పళ్లు ఆరోగ్యంగా,
దృఢంగా వుండేలా చేస్తుంది.

ఎలాగో చూడండి:



మీ పళ్లలో ఇరుక్కుపోయిన ఆహారపు తునకల్లో దుర్వాసన, దంతక్షయం కలిగించే సూక్ష్మజీవులు పెరుగుతాయి.



కోల్గేట్‌లోని అద్వితీయమైన శక్తి గల నురుగు లోతుగా చొచ్చుకుపోయి, హానికరమైన ఆహారపు తునకలనీ, సూక్ష్మజీవులనీ తొలగిస్తుంది.



ఫలితం: ఆత్మవిశ్వాసాన్నిచ్చే తాజా శ్వాస, దంతక్షయం నుంచి రక్షణ, ఆరోగ్యమైన గట్టి పళ్లు.

గుర్తుంచుకోండి, ప్రతిసారీ భోజనం కాగానే కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో పళ్లు బ్రష్ చేసుకోండి. నోటి దుర్వాసన పోగొట్టుకోండి...దంతక్షయాన్ని ఎదుర్కోండి.

GKBE 882 86 TL

దీని తాజా పిప్పరమెంట్ రుచి మీ కెంతో నచ్చుతుంది!

Seasons finest:

౹ ప్రతి రూపాయికి ఎక్కువ
ువనిచ్చే సూటింగ్స్‌ని
ుచుకోవటం ఎలా!



సూటింగ్స్ రిటైలింగ్‌లో ఎంతో పేరు, అనుభవాన్ని గడించిన సిల్కు సెంటర్, హైద్రాబాద్‌కి చెందిన శ్రీ రామ్ టి. ఉల్లా గారి సలహాలు:

“ప్రతిరోజు వాడే సఫారి, పేంట్స్‌లకు లయిట్ వెయిట్ వర్‌స్టెడ్ సూటింగ్‌లు ఎంతో మన్నికనిస్తాయి. శుభకార్యాలకు, విదేశయాత్రలకయితే ప్రత్యేకమైన ఎక్స్‌క్లూజివ్ సూట్ టింగ్స్‌ను ఎన్నుకోవటం మంచిది. ఎన్నిక పూర్తయ్యాక మీరు గమనించవలసిన ముఖ్యమయిన విషయం... ధరకు తగ్గ నాణ్యత లభిస్తుందా లేదా అని...**”**


250 కోట్ల పైగా పెట్టుబడితో నిర్మించిన అత్యంత ునికమైన టెక్స్‌టైల్ ప్లాంట్‌లో, దేశవిదేశాల్లో ుగాంచిన టెక్స్‌టైల్ టెక్నాలజిష్టుల నిరంతర సాధనకు పకల్పన విమల్ వర్‌స్టెడ్ సూటింగ్స్. సూట్స్‌కి, ారీలకు, పేంట్స్‌కి ప్రత్యేకమైన సూటింగ్ శ్రేణులు. ంతగా నమ్మదగ్గ క్వాలిటీ...ఇదంతా ఎందుకంటే, ప్రతి రూపాయి విలువ పెంచటానికి...

VIMAL®

అద్వితీయ విమల్
వర్‌సెడ్ సూటింగ్స్




From India's most modern textile plant
ONLY VIMAL



'ఖైదీ'లో చిరంజీవి, మాధవి

సినిమా విశేషాలు

-జి. వి. జి.

ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో

''చిరంజీవి సరసన రాధ తొలిసారిగా నాయికగా నటిస్తుంది,'' అన్నారు ఎ. కోదండ రామిరెడ్డి. ఈయన దర్శకత్వం వహించే శ్రీ రాజ్యలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ కొత్త చిత్రంలో సత్యనారాయణ, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, వేలు, వీరభద్రరావు ఆదిగాగల వారు పాల్గొంటారు. సత్యానంద్ సంభాషణలు,

మిద్దె రామారావు కొత్త చిత్రం

చక్రవర్తి సంగీతం, వెంకట్ ఛాయ, శాయికుమార్ శిల్పం, డి. వెంకటరత్నం కూర్పు, ఎన్. వెంకటేశ్వరరావు ప్రొడక్షన్, శరత్ సహ దర్శకత్వంతో కె. ఎల్. ఎన్. శాస్త్రి నిర్మాణ సారథి. ''సెప్టెంబర్ 18 నుండి 25, అక్టోబర్ 20 నుండి నవంబర్ 10 వరకు జరిగే రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తయి పోతుంది,'' అన్నారు నిర్మాత మిద్దె రామారావు.

కృష్ణంరాజుతో జి. ఆర్. కె. రాజు చిత్రం

''మక్కై యూర్ మకుటియాన్ — అనే తమిళ చిత్రం సూపర్‌హిట్ అని తెలిసి చూశాను. వెంటనే రైట్స్ కొనేశాను. ఆ తమిళ చిత్రాన్ని డైరెక్ట్ చేసిన రాజశేఖర్‌నే బుక్ చేశాను,'' అన్నారు నిర్మాత జి. ఆర్. కె. రాజు. ఈయన ఆగస్టు 10న షూటింగ్ ప్రారంభించిన విశ్వ చిత్ర సినీ ఎంటర్ ప్రైజెస్ తాజా చిత్రంలో కృష్ణంరాజు, రాధిక, శరత్‌బాబు, సత్యనారాయణ, ప్రభ, నూతన్ ప్రసాద్, అల్లు రామలింగయ్య, నరసింహరాజు, జయమాలిని, స్మిత, ప్రసాద్ బాబు పాల్గొంటున్నారు. సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, కుదరవల్లి నాగేశ్వర రావు శిల్పం, రంగా ఛాయ, వెంకటరత్నం కూర్పు, చక్రవర్తి సహదర్శకత్వం, రాజా సహకార దర్శకత్వంలో నాగేశ్వరరావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. ''పాటలను ఊటీలో అక్టోబర్‌లో పిక్చరైజ్ చేస్తాం,'' అని నిర్మాత తెలియజేశారు.



'కాలయముడు'లో శ్రీపల్లవి




నరేష్, పూర్ణిమ 'అగ్ని సమాధి'లో


కృష్ణ
నటించిన
పద్మాలయా స్టూడియోస్
సమర్పించు
రత్నా మూవీస్
ప్రజారాజ్యం
దర్శకత్వం:
ఎం.మల్లికార్జునరావు
నిర్మాత:
జి.నాగరత్నమ్మ
నిర్వహణ:
జి.ఆదిశేషగిరిరావు B.Sc.,
స్క్రీన్‌ప్లే: జి.హనుమంతరావు
PADMALAYA PUBS.



కృష్ణ హీరోగా "బంగారు కాపురం"

"సూపర్ స్టార్ కృష్ణ సరసన సూపర్ హీరోయిన్ జయసుధ, ఆలిండియా ఫేమ్ హీరోయిన్ జయప్రద తొలిసారిగా నటిస్తున్నారు. ఇదివరకు 'ధైర్యవంతుడు' తీయాలనుకున్నాం. ఇప్పుడు కథ మారింది. 'బంగారు కాపురం' అని పేరెట్టాం. జనవరి నుంచి షూటింగ్," అన్నారు కోగంటి విశ్వేశ్వరరావు. ఈయన శ్రీ పంచవటి చిత్రాలయ బానర్‌లో నిర్మించే చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, దర్శకత్వం వహిస్తారు. సత్యానంద్, జె. వి. రాఘవులు, లక్ష్మణ్‌గోరే, మన్నె రాధాకృష్ణ, కె. రామసూరి ప్రభృతి సాంకేతిక వర్గం.



కృష్ణ సమర్పించే "రక్తసంబంధం"

"సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లలో ప్రతినెలా 21 వ తేదీ నుంచి 30 వ తేదీవరకు షూటింగ్. దీంతో చిత్రం పూర్తయిపోతుంది," అన్నారు విజయనిర్మల. ఈమె దర్శకత్వంలో కృష్ణ ప్రధాన పాత్ర ధరిస్తూ, సమర్పించే రవికళామందిర్ వారి పై చిత్రంలో రాధ, జయంతి, సత్యనారాయణ, గిరిబాబు, సుదర్శన్, వేలు, వీరభద్రరావు ఇతర ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. సత్యానంద్, చక్రవర్తి, వి. ఎస్. ఆర్. స్వామి, ఆదుర్తి హరనాథ్, ఆర్. పద్మనాభం ప్రభృతి సాంకేతిక వర్గంతో ఎం.ఎస్. సాయిప్రసాద్, ఎ. భాస్కర్ నిర్మాతలు.

"రారాజు"గా కృష్ణంరాజు

''మదుమలై అడవుల్లో సెప్టెంబర్, నెలల్లో చివరి రెండు షెడ్యూల్స్ జరుగుతాయి,'' అన్నారు వడ్డే శోభనాద్రి. ఈయువ నిర్మాతగా వడ్డే కిశోర్ సమర్పించే విజయ మాధవీ పిక్చర్స్ ''రారాజు'' చిత్రం తొలి షెడ్యూల్ ఆగస్టు 18 నుంచి 31 వరకు మద్రాసులో జరిగింది. కృష్ణంరాజు సరసన శ్రీ పల్లవి నాయిక. శారద, జగ్గయ్య,ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, నూతన్‌ప్రసాద్, శివకృష్ణ తక్కిన నటవర్గం. పరుచూరి సోదరులు, జె. వి. రాఘవులు, ఎస్. వెంకటరత్నం, భాస్కరరాజు, జి. జి. కృష్ణారావు ప్రభృత సాంకేతికవర్గంతో వడ్డే రమేష్ నిర్వహణలో తయారయ్యే ఈ చిత్రానికి జి. రామ మోహనరావు దర్శకుడు.




రంగనాథ్, మోహన్‌బాబు 'నాంపల్లి నాగు'

" చిన్నికృష్ణుడు "

''పౌరాణిక చిత్రాన్ని సెప్టెంబర్‌లో ప్రారంభిస్తున్నాను,'' అన్నారు భానోదయా ఫిలింస్ అధినేత మాధవయ్య. శరత్ బాబు, గుమ్మడి, రమాప్రభ ఆదిగాగలవారు పాల్గొనే ''చిన్నకృష్ణుడు''చిత్రానికి సముద్రాల మాటలు, ఆత్రేయ పాటలు రాస్తున్నారు. సత్యం సంగీతం, భాస్కరరావు ఛాయ, సి. హెచ్. ఇ. ప్రసాద్, ప్రకాశరావు శిల్పం నిర్వహిస్తారు. శ్రీనివాస్ దర్శకుడు.





జగ్గయ్య, శోభన్‌బాబు 'జగన్'లో

కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వంలో ఎన్. కృష్ణంరాజు చిత్రం "జడగంటలు"

"అమెరికా వెళ్ళిన ఓ భారతీయ యువకుడు అక్కడి పాశ్చాత్య ప్రభావం తన మీద పడకుండా స్వదేశానికి తిరిగి వస్తాడు. పల్లెటూరిలో పెరిగిన ఓ యువతి విదేశీ నాగరికతకు అలవడిపోతుంది. దీంతో దంపతులైన వీరిరువురూ ఉత్తర దక్షిణ ధ్రువాలవుతారు. ఆడంబరంగా జీవిస్తూ పరిధికి మించకుండా ఆలోచించడమా, నిరాడంబరంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించడమా? ఈ విశిష్టమైన ఇతివృత్తంతో వెలిచేర్ల సత్యనారాయణగారు రాసిన మినీ కథ నన్నెంతో ఆకర్షించింది. ఆ మినీ కథకు నేను సినీ కథను తయారు చేశాను. తొలుత ఫస్ట్ షెడ్యూల్‌ను గోదావరీ తీర ప్రాంతాలలో ప్లాన్ చేశాం. మా యూనిట్ అంతా రాజమండ్రి చేరేసరికి కుంభవృష్టివల్ల వరదలు... విపరీతంగా ఖర్చయినా అందరం సురక్షితంగా తిరిగి వచ్చేశాం. సిటీ బాక్‌గ్రౌండ్‌లో చిత్రీకరించాల్సిన సన్నివేశాలన్నీ మద్రాసులో తీసేశాక, అటుపైన విలేజ్ బాక్‌గ్రౌండ్‌లో తీయాల్సిన సన్నివేశాలు తాపీగా గోదావరి ప్రాంతంలోనే షూట్ చేస్తాం," అన్నారు నవత ఆర్ట్స్ పతాకంలో "జడగంటలు" చిత్రాన్ని నిర్మిస్తున్న ఎన్. కృష్ణంరాజు. సురేష్, విజయశాంతి, రంగనాథ్, శుభలేఖ సుధాకర్, రాళ్ళపల్లి, హేమసుందర్, వేలు, మదన్‌మోహన్, అప్పారావు, సుత్తిబాబు, ప్రభ, అన్నపూర్ణ, తాతినేని రాజేశ్వరి, లలిత పాల్గొంటున్నారు. రాజశ్రీ సంభాషణలకర్త. వేటూరి గీతాలకు పుహళేంది స్వరకల్పన చేశారు. ఆర్. కె. రాజు ఛాయ, సూరపనేని కళాధర్ శిల్పం, గౌతంరాజు కూర్పు, శివసుబ్రహ్మణ్యం నృత్యాలతో కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఎన్. అచ్యుతరామరాజు నిర్మాణ సారథి.

'చండీ—చాముండి'లో విజయలలిత



సినిమా

"దోపిడీ దొంగలు"

"ముప్ఫై ఏళ్ళకు పైగా మాడరన్ థియేటర్స్ వగైరా ప్రముఖ తమిళ సంస్థలకు కథలు సమకూరుస్తున్న సుప్రసిద్ధ తమిళ రచయిత ఎ. ఎల్. నారాయణన్ రాసిన అత్యద్భుతమైన కథ ఆధారంగా కాశీ విశ్వనాథ్ సంభాషణలు రాశారు," అన్నారు ఎస్. ఎస్. మూవీటోన్ పతాకంలో పై చిత్రాన్ని నిర్మించే డి. అప్పారావు. ఆగస్ట్ 19న పాటలరికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. మురళీమోహన్, నూతన్‌ప్రసాద్. పద్మనాభం, నాగేష్, రావి కొండలరావు, రాళ్ళపల్లి, మాడా, సారథి, చిట్టిబాబు, సత్తిబాబు, రాధిక, ఝాన్సి, మమత, నవనటులు సత్యనారాయణ, ఎస్. చంద్ర, భానుచందర్ పాత్రధారులు. రాజన్ – నాగేంద్ర స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు. బి. జనార్ధనరావు ఛాయ, ఎస్. ఫిలిప్‌సింగ్ శిల్పం, కె. గోవిందస్వామి కూర్పు, వి. ప్రభాకర్ నిర్వహణ. సతీష్ సహకార దర్శకత్వంతో దొడ్డ సూర్యకుమారి, కొండ్రోతు బంగారయ్య సమర్పించే ఈ చిత్రానికి శాంతి వెంకటేశ్వరరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.

'లంకె బిందెలు'లో





శివకృష్ణ, రాజేశ్వరి 'నేటి భారతం'లో

తెలుగు డైరెక్టర్ల హిందీ చిత్రాలు

★ దాసరి నారాయణరావు : దిలీప్‌కుమార్‌తో "ఎం. ఎల్. ఎ. ఏడుకొండలు", రాజేష్‌ఖన్నా, జయసుధ, జయప్రదలతో "మేఘ సందేశం", దిలీప్ కుమార్, సంజీవ్ కుమార్‌లతో "బహుదూరపు బాటసారి" చిత్రాలు తయారవుతాయి.

★ విజయనిర్మల : జితేంద్రతో "అమాయకుడు కాదు అసాధ్యుడు" చిత్రాన్ని శశిరేఖా మూవీస్‌వారు హిందీలో నిర్మిస్తారు. సంగీతం : బప్పీలహరి.

★ పి. సాంబశివరావు : సంజయ్ హీరోగా "ఎర్రమల్లెలు" చిత్రాన్ని హిందీలో డాక్టర్ టి. కె. ఎం. ఛటర్జీ నిర్మిస్తారు.

★ బాపు : జితేంద్ర, శ్రీదేవి, అమ్జాద్‌ఖాన్, కాదర్‌ఖాన్, దేవెన్‌వర్మలతో "మంత్రిగారి వియ్యంకుడు" చిత్రాన్ని ప్రశాంతి క్రియేషన్స్ అధినేత ఏ. వి. శాస్త్రి నిర్మిస్తారు. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమవుతుంది.

జయసుధ, వేలు



షూటింగ్ కేన్సిల్ అయితే?

సుహాసిని

"అమితాబ్, ఋషికపూర్, దిలీప్‌కుమార్‌లు నటించిన చిత్రాలేవైనా ప్రదర్శింపబడుతూంటే, థియేటర్‌లకు వెళ్ళి చూస్తాను. లేదా, కొత్తగా వచ్చిన ఆంగ్ల నవలలు చదువుకుంటూంటాను."

కె. ఆర్. విజయ

"అభిమానుల దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలకు స్వయంగా జవాబులిస్తూంటాను. ఆ పని అయిపోతే, నే చూడని తమిళ చిత్రాల ప్రింట్‌లు తెప్పించి, మా బంగళాలోని మినీ ఎ.సి. థియేటర్‌లో వేసి చూసుకుంటూంటాను."

జయమాలిని

"దేవాలయాలకు వెళ్తూంటాను. ఎక్కువగా మాంగాడు అమ్మగారి కోవెలలో కనిపిస్తూంటాను. లేదా, ఇతర ఊళ్ళల్లో నాట్య ప్రదర్శనలు ఇస్తూంటాను."

మాధవి

"బాగా రిలాక్స్ అవుతాను. ఆంగ్ల నవలలు చదివి, వాటిని మా ఇంట్లోని వారికి చెపుతూంటాను. ఒక్కోసారి హైదరాబాద్‌కు వెళ్లొస్తూంటాను కూడా."

సులక్షణ

"మా ఆంటీ నడిపే డాన్స్ స్కూల్‌లో కూచిపూడి నృత్యం నేర్పిస్తూంటాను. ఒక్కోసారి పాత సినిమా సాంగ్ సీక్వెన్స్‌లను వీడియోలో వేసి చూసుకుంటూంటాను."

స్వప్న

"మా తమ్ముడికి హోమ్ వర్క్ చేసి పెడుతూ, పాఠాలు నేర్పిస్తూంటాను. వాడి బట్టలకు ఇస్త్రీ చేస్తూంటాను. మరీ బోర్ కొడితే, స్నేహితురాండ్రను పిలిపించుకొని, వాళ్ళతో కబుర్లు చెబుతూ, కాలక్షేపం చేస్తాను."

సుమలత

"ఏదో కోరికను మనసులో అనుకొని, అది నెరవేరాలని గుడి ప్రాకారాలు చుడ్తూంటాను. అభిమానుల దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలకు జవాబులు రాస్తూంటాను."

సిల్క్ స్మిత

"ఇంటి పనులలో అమ్మకు సాయపడుతూంటాను. పూలమొక్కలకు నీళ్ళు పోయడమంటే నాకెంతో ఆనందం. శ్రీప్రియ నాకు ప్రీతితో ఇచ్చిన పామేరియన్ కుక్కతో ఆడుకుంటూంటాను."

"దొంగల రాజ్యం"

"కథానాయకుడు — చిత్రం తర్వాత రచయిత భమిడిపాటి రాధాకృష్ణ, నేను కలిసి ఈ సోషల్ సెటైర్ చిత్రానికి పని చేస్తున్నాం," అన్నారు. కథకుడు, దర్శక నిర్మాత కె. హేమాంబరధరరావు. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభమయ్యే నవీన్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "దొంగల రాజ్యం" చిత్రంలో మాదాల రంగారావు ప్రధాన పాత్రధారి. చక్రవర్తి సంగీత దర్శకుడు. ఆర్. రామారావు ఛాయాగ్రాహకుడు. ★

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ప్రఫుల్ల – ధర్మవరం

రామలక్ష్మిగారూ, అప్పడాల కర్ర చేతిలో లేదుకదా ? మంచి ప్రశ్నకు మంచి బహుమతి ఇవ్వకూడదా ?

★ ఎందుకు ? మీకు తెలిసిన వారా ? బహుమతి యిచ్చారంటూ – ప్రశ్నలు వేయడానికా ?! నాకు అప్పడాల కర్రతో పనేమిటి గురూ. నేను ఎప్పుడూ రొట్టెలు ఒత్తలేదు. అప్పడాలు అంబికాలో కొమక్కోడమేగాని చేయలేదు. ఎవరి నెత్తైనా పగలకొడదామా అంటే – అలా విసిగించేవాళ్లు లేరు ... ఇంకెందుకు ఆయుధం? అయినా మరీ ఆడదానిలా వంటింట్లో – వస్తువులే ఆయుధాలా ఏమిటి?– చాలా ప్రాచీనంగా ఆలోచిస్తున్నారు. కాస్త దృష్టి మార్చుకోండి...కాలం మారింది కద.

కె. వి. – హైదరాబాదు

ప్రఖ్యాత నర్తకులు యామినీ కృష్ణమూర్తి స్త్రీయా, పురుషుడా ?

★ హైద్రాబాదు నడిబొడ్డున వుంటూ అన్ని అకాడమీల కళా కాలక్షేపాలు(!) చూస్తూ యీ సంగతి మీకు తెలియలేదంటే – ఆశ్చర్యంగా వుంది. యామిని స్త్రీయేకాదు. ఆంధ్రుల ఆడబిడ్డ; తెలుగువారికి గర్వకారణం. అందుకే– తెలుగుదేశంలోకాక యితరత్రా ఘనకీర్తి సంపాదించిన నర్తకీమణి.

టి. బి. ఆర్. – పోర్టుబ్లయిర్

ఒక స్త్రీ ఒక పురుషుడు– పరస్పర వ్యామోహంతో కామ కలాపాలు సాగించడం చట్టరీత్యా నేరంకాదు. మీరేమంటారు ?

★ చట్టం– వ్యక్తుల నీతి బాహ్యతని ప్రోత్సహించేది కాదు. అంత మాత్రంచేత దాని కన్నుకప్పి–నాటకాలాడేవారిని వేటాడి పట్టే– అధికారీ కాదు. నీతిలేని మనిషిని చట్టం ఏమీ చేయలేదు. కాని ఆ నీతి లేమిచేత బాధపడిన వాళ్లు– మొరపెట్టుకుంటే– తగిన రక్షణకి తప్పకుండా పూనుకుంటుంది.

పి. ఎల్. ఎమ్; ఎం. ఎల్. ఆర్. – అక్కవల్లి

సాహిత్య సౌధాలు నిర్మిస్తున్న యీ రోజుల్లో సాటి రచయితకు చేయూతనివ్వని ఈ మనుషులనేమనాలి ? మా అన్నయ్య రాసిన కథలు నాటికలు మీరైనా ప్రోత్సహించి చేయూత నిస్తారా ? కట్టకట్టి కాటిలో కాల్చమంటారా ?

★ దీన్నే ముఖంమీద కోపం వచ్చి ముక్కు కోసుకోవడం అంటారు ? ఇక ఏ యితర విద్య లైనా ఎదుటివారి చేయూతపై ఆధారపడతా యేమోగాని, రచన కాదు. రచన – తన శక్తిని తనే తెలియచేస్తుంది... మరీ అచ్చవలేదని అందరినీ ఆడిపోసుకోవడం – భావ్యం కాదు.

బి. ఎస్. కె. బి. – కాజీపేట

కె. రామలక్ష్మిగారూ, నోటుకంటే విలువైనది ఏమిటి ?

★ ఓటు కాదా ?

మనిషి జీవించేది దేనికొరకు ? జీవితం అంటే ఏమిటి ?

★ మంచి రోజులు చూద్దామన్న ఆశతో జీవితం సాగిస్తాడు మనిషి. జీవితం అంటే– ఏమిటి ? చావు పుట్టుకల మధ్య వ్యవధే కదా !

ఇ. పి. పి. – ఖమ్మం

పతనమైన ప్రతి ఆడదాని వెనక ఓ మగాడి హస్తం వుందంటాము నేను. ఏమంటారు ?

★ హస్తం కాదు. నిర్లక్ష్యం.

కె. ఆర్. ఆర్. – అంకాపూర్

ఈ రోజుల్లో మానవుడు సృష్టించిన డబ్బుకి విలువ వుంది. కాని మనిషికి లేదు – ఎందుకని ?

★ డబ్బు సృష్టి తక్కువ – మనుషుల సృష్టి ఎక్కువగానూ వుండడంవల్ల !

ఎం. ఆర్. కె. – ధర్మవరం

రాజకీయ నాయకుల నెత్తిన టోపీ ఎందుకు ?

★ ఇంకెవరిచేతా పెట్టించుకోకుండా వుండడానికి !

జి. వి. – కాకినాడ

రెండు రకాల వెధవాయిలుంటారంటారు? మీకు తెలుసా ?

★ ఆఁ అంతా తెలుసు ననుకునేవాళ్లూ ! ఏమీ తెలియదనుకునేవాళ్లూ ?!

కె. వి. ఆర్. – విజయవాడ

ఎవరిపైనేనా యిట్టే నింద మోపుతారు కొందరు. వారిని ఏమి చేయాలి ?

★ ఏం చేస్తాం ? అపవాదు ముగ్గుర్ని చంపుతుంది– వేసినవారిని, వేయబడ్డవారిని, విన్నవారిని కూడా !

బి. ఎస్. జి. – అర్మూరు


లక్ష్మి అక్కా మీ ఫొటో కావాలి. నా చిరునామా తెలుపుతాను ఏమంటారు ?


★ ఈమధ్య ఫొటో లివ్వడంలేదు – చూపించి భయపెడుతున్నారని తెలిసి !

మధు – కొటాల

సెన్సారు గురించి కాస్త వివరంగా చెప్పండి. సెన్సారువల్ల ఉపయోగం ఏమిటి ? సెన్సారు వాళ్లు ఏవి పన్లు చేస్తారు ?

★ కాస్త ఓపిక పట్టండి. నా సభ్యత్వం అయిపోయింది. నా అనుభవాలు ఉదాహరణలతో సహా – రాస్తాను !!





కేవలం ఒక్క డెట్ బిళ్లలోనే వుంది సాల్వెంట్ పవర్

బట్టలను అన్నిటికంటే ఎక్కువ తెల్లగా ఉతుకుట కొరకు



జిడ్డును తీసివేసే శక్తి

మురికిని తొలగించే శక్తి

మిరమిట్లు తెలుపును ఇచ్చే శక్తి



Shilpi DM/31A/81 Tel

మరే ఇతర డిటర్జెంట్ బార్ లేక బిళ్ల దీనికి సాటి రాదు

సీరియల్

మూగ ముత్యాలు

యలమంచిలి ఝాన్సీలక్ష్మి

(గత సంచిక తరువాయి)

శ్రీనివాస్ వెళ్ళిపోయాడు. ఆషా శుభలేఖల్ని పట్టుకువచ్చింది. సలీమ్ బిజినెస్ వ్యవహారంతో బొంబే వెళ్ళాడు. పెళ్ళి నెలరోజులుందని చెప్పింది.

సారధి కళ్ళనిండుగా ఆనందం నింపుకుని చూశాడామెవైపు.

''మావాణ్ణి ఆ బిజినెస్‌నుంచి బయటికి లాగేశావన్నమాట! వాడికి నువ్వూ నేనూ ఆ బిజినెస్‌లాగే కనబడుతామమ్మా...! ఇద్దరం కలిసి యీ శుభలేఖతోపాటు నాలుగైదు పేజీల వుత్తరం వ్రాస్తేగానీ ఆ బొంబాయినుంచి దిగిరాడు! లేకపోతే పెళ్ళి ఎవరిదో అనుకుని ఓ బహుమానం పంపి మరో పట్టణం వెళ్ళిపోతాడు!''

సారధి మాటలకి నవ్విందామె.

''సలీమ్‌ని ఓసారి రమ్మని రాయమ్మా! వాణ్ణి చూడాలని నీలాగే నాకూ బెంగగా వుంది!'' అన్నాడతడు. ఆషా అందుకే నెలరోజులుముందే శుభలేఖ తెచ్చిందని గ్రహించే అలా అన్నాడు.

''సలీమ్‌ని రమ్మని రాయన్నయ్యా!'' అన్నది ఆఖరికి సిగ్గుని కప్పిపుచ్చుకుని.

''ఆషా రాస్తేనే వాడు తొందరగా వస్తాట్ట!'' సారధి నవ్వాడు.

''ఏంకాదు! ఆ మహానుభావుడికి.... యీ ఆషా గుర్తేవుండదు! వుత్తరంకూడా రాయలేదీసారి! ఎన్నాళ్ళయ్యిందో వెళ్ళి!''

''అయితే ఓ పని చేద్దాం! 'ఆషా పెళ్ళి జరిగిపోయింది!' అని రాసేద్దాం! క్షణాల్లో నీ ముందు వాలతాడు!'' ఆషా కళ్ళల్లోకి సిగ్గు నిండుకువచ్చింది.

సన్నగా నవ్వింది! ''నిజమే! ఆ మాటే రాసెయ్!'' అని రేఖకికూడా చెప్పి వెళ్ళిపోయింది. ఆ మరునాడే సీత వచ్చింది.

'విజయ బావుందా?' సీత మాటల మధ్యలో 'విజయ' గురించి ప్రశ్నించింది. సారధి మౌనంగా తల వూపాడు.

అంతలో రేఖ వచ్చింది.

''సీతా! వచ్చేనెలలోనే మా పెళ్ళి! నువ్వు తప్పకుండా రావాలి!'' అన్నది వుత్సాహం నిండిన గొంతుతో.

''వస్తాను ... రాకుండా ... ఎలా వుంటాను?'' సీత శూన్యంలోకి చూస్తూ అన్నది.

''శ్రీనివాస్ రెండువేలిచ్చి వెళ్ళాడిప్పుడే! మంచి చీరలు కొనిపెట్టాలి నువ్వు! ఇకనుంచి చీరలు కట్టుకో మంటున్నాడు!''

రేఖ సీతనే చూస్తూ చెప్పుకుపోతోంది.

''ఓ యిల్లు కూడా కొనేస్తున్నాడు శ్రీనివాస్! ఆ యింట్లో ముందు నువ్వే అడుగు పెట్టాలి! ... ఆ యిల్లు ...''

''ఛీ! నేనా? రాను! ... నాకెందుకతని సంగతి? ...'' సీత లోలోన అణిచిపెట్టిన కోపం తారాజువ్వలా పైకి లేచి మండిపడింది.

''అతనికోసం గాదు! నాకోసం! నాకు నువ్వే అమ్మవి! అక్కవి!'' రేఖ ఆనందం పట్టలేనన్నట్లు మాట్లాడసాగింది. సీత కోపాన్ని గుండెల్లోనే బంధించిందీసారి. బాధని గొంతులో అణిచిపెట్టివేసింది. అందుకే మౌనం దాల్చింది.

''ఆఁ! మరిచేపోయాను! శ్రీనివాస్ మొదటిభార్య విడాకులివ్వడానికి ఒప్పుకుందట! నిన్ననే వుత్తరం వచ్చింది!''

సీత కోపాన్ని పళ్ళమధ్యన బిగబట్టింది. తలెత్తలేదీసారి. సారధి వెంటనే లేచి బయటికి వెళ్ళిపోయాడు సీత ముఖాన్ని చూడలేక.

''పాపం! ఎంత దురదృష్టమో చూడు ఆ అమ్మాయిది!'' రేఖ జాలిపడింది. ''ఓసారి వెళ్ళి చూసి రావాలనిపిస్తోంది!'' అన్నది మళ్ళీ.

''వెళ్ళకు! వెళ్తే పీకపిసికి చంపేస్తుంది!'' సీత కోపం భగ్గున మండింది.

''నీకెలా తెలుసు? నువ్వు చూశావా ఆ అమ్మాయిని?''

''చూశాను! మా వూరే! నాకు బాగా తెలుసు!''

రేఖ సీత ప్రక్కనే కూర్చుంది లేచివచ్చి—

''పాపం! ఏడ్చిందా?'' అన్నది.

''ఎందుకూ? ఆ అమ్మాయి అంత మూర్ఖురాలేంగాదు!''

''నన్ను... నన్ను తిట్టిపోసిందా?''

''మధ్యలో నిన్నెందుకు తిట్టడం? ఈ శ్రీనివాస్‌గారేమైనా శ్రీరామచంద్రులా? ఈ అనుబంధం నుంచి బయట పడినందుకు హాయిగా వున్నదని చెప్పింది!'' సీత లోలోని వూహల్లో ఒదిగివున్న అనురాగం ఏడుస్తోంది.

''శ్రీనివాస్ నీకు తెలుసా?''

రేఖ ప్రశ్న విని వులిక్కిపడిందీసారి. ఓ క్షణం సేపు ఆగి అన్నది—

''తెలియదు!'' గొంతునిండుగా కోపం! అసహ్యం! కక్షా!

''అవున్లే! నీకెలా తెలుస్తుంది? నేను మాత్రం ఏం చేయను సీతా? శ్రీనివాస్‌కి ఎన్నో సార్లు చెప్పాను. ఆమెని అన్యాయం చేయవద్దని. నాకిలాంటి జీవితం అలవాటే గదా! వెళ్ళిపొమ్మన్నాను! ఆమెను తీసుకు రమ్మన్నాను!

జరిగిన కథ — 10: సలీంకు సారధిపట్లగల ఆరాధనను మనస్సులోనే మెచ్చుకొంటుంది శశిరేఖ. సారధి శశిరేఖతో విసిగి ఆమెను వదిలేసి సీత దగ్గరకు వెళతాడు. సీత భర్త శ్రీనివాస్ అని తెలుసుకుంటాడు. శశిరేఖను చూడాలంటుంది సీత. తను విజయకు తగనని సోమయాజులు గారితో అంటాడు సారధి. మనిషికి మనస్సు ముఖ్యం కానీ, కులం ప్రధానం కాదని చెపుతాడు సోమయాజులు. సోమయాజులుగారికి పక్షవాతం వస్తుంది. విజయను, రాజ్యంను ఆయన దగ్గరకు తీసుకెళతాడు సారధి. సోమయాజులుగారికి సలీంను పరిచయం చేస్తాడు. సీత సారధి ఇంటికి వచ్చి అక్కడ శశిరేఖను చూస్తుంది. శ్రీనివాస్‌కన్నా మంచివాడిని తెచ్చి పెళ్ళి చేస్తానని సారధి శశిరేఖకు చెప్పబోగా ఆమె అతని మాట వినకుండా అతనితో ఘర్షణ పడుతుంది. మెల్ల మెల్లగా విజయ మనస్సును సారధి ఆకట్టుకొంటుంటాడు. సారధి తీసుకు వచ్చిన కుర్రాడు తనకు నచ్చలేదని చెబుతుంది విజయ. విజయ నూతి దగ్గర కాలు జారి పడగా కాలు ఫ్రాక్చరవుతుంది. విజయ మాటల వలన ఆమె మనసులో తనకు స్థానం ఉందని సారధికి స్పష్టంగా తెలిసిపోతుంది. సారధి హైదరాబాదునుంచి వస్తాడు. సారధి, విజయ ఒకరిపై ఒకరికి గల ప్రేమను వ్యక్తం చేసుకుంటారు. సారధి హైదరాబాదుకు రాగానే శశిరేఖ తను శ్రీనివాసును పెళ్లి చేసుకోబోతున్నట్లు చెపుతుంది. అది విని బాధపడతాడు సారధి. శ్రీనివాస్ ప్రవర్తనకు అసహ్యపడి అతడిని వెళ్లిపొమ్మని శాసిస్తుంది శశిరేఖ.

కానీ నన్ను విడిచి వెళ్ళలేనన్నాడు ! వెళ్తే బ్రతక నన్నాడు !''

''అబద్ధం ! అంతా నటన !'' సీతలోని కోపం గర్జించింది.

''ఎవరిది ?''

''సీత వెంటనే కోపాన్ని గుండెల్లో దాచి వేసింది. తుపాను వెలిసిన తరువాత ఏర్పడే ప్రశాంతత నిండుకువచ్చిందామె గొంతులో —

''నాకెవరో గుర్తొచ్చారు రేఖా !'' అన్నది నెమ్మదిగా.

ఆ తరువాత రేఖ ఏం జెప్పినా తల వూపింది. 'ఆ, వూ' లతో సరిపెట్టింది. రేఖ కాసేపటికి విసుగ్గా చూసింది.

''నువ్వు నా మాటలు వినడంలేదు గదూ?''

''వూ !'' అన్నదామె.

''ఫో ! నీ కసూయగా వుంది ! నేనంటే !''

''లేదమ్మా ! నాకు... చాలా... సంతోషంగా వుంది ! అన్నయ్యకు చెబుతానుండు ! వాడు ఆనందంతో పొంగిపోతాడు !''

ఉన్నట్టుండి రేఖ సీత భుజంమీద వాలిపోయి పెద్దగా ఏడవడం మొదలెట్టింది.

ఆమె దుఃఖం సీత గుండెల్ని కోసివేయ సాగింది.

''రేఖా ! ఏమైంది ? చెప్పమ్మా ! మా తల్లివి గదూ ? చూడు !... అయ్యయ్యో ! ఏడవకు !...'' రేఖ కన్నీళ్ళు తుడిచింది తన పైటచెంగుతో ! ఆప్యాయంగా నుదుటిపై బడిన వెంట్రుకల్ని సర్దింది. రేఖ యింకా వెక్కి వెక్కి పడుతూనేవుంది. కానీ అంత పెద్దగా దుఃఖించడంలేదిక.

''ఏమైందమ్మా ? ఈ పెళ్ళి నీ కిష్టం లేదా ?''

''కాదక్కా ! నాకు... నాకు... నీలాంటి అక్క వుంటే బావుండేది... మనస్సులోని మాటని చెప్పుకోడానిక్కూడా యిన్నాళ్ళూ నాకెవ్వరూ లేరు ! నువ్విలా శ్రద్ధగా, నా మాటలు వింటూంటే అమ్మ గుర్తుకు వచ్చింది !'' రేఖ దుఃఖాన్ని అణిచిపెట్టింది గొంతులో.

సీత కళ్ళల్లో తడి మెరిసింది. 'రేఖ' ఒంటరితనాన్ని చూసి. మరునాడు సారథే అన్నాడు.

''రేఖ పెళ్ళట ! నిన్న నిజంగాదేమోనను కున్నాను. శ్రీనివాస్ స్నేహితుడొకడు కన్పించి చెప్పాడు.''

''మనిద్దర్నీ ఒడ్డున పడేస్తుంది! విజయకి రాస్తానుండు !''

''వద్దు !... అమ్మ విషయం తెలిసి పోతుంది !... విజయ రాదు !''

''విజయ నిన్ను ప్రేమించడంలేదా ?''

''ఏమో ! నాకు తెలియదు ! అయినా నామూలాన వాళ్ళకి సమస్యలెందుకు ? పైగా



తాతయ్య మంచంబట్టారు ! ఆ వూరి వాళ్ళ యిన్నికూడా వెలివేస్తారు నేనెవర్నో తెలిస్తే!''

''అంటే ... నీక్కూడా ... నీ పైన అసహ్యంగా వుందా ?''

''కాదు ! అమ్మని అర్థంచేసుకోలేదీ సంఘం ! నామూలాన ఎక్కడో స్వర్గాన వున్న అమ్మని అపవాదులతో హేళనజేసి నవ్వుకుంటారీ మనుషులు ! నేను భరించలేనా నరకాన్ని !''

''మూర్ఖుల మాటల్ని పట్టించుకో గూడదు ! అంతమాత్రాన అమ్మ పవిత్రత తగ్గిపోతుందా !'' సీతకి యీ సంఘంలోని అర్థం లేని ఆచారాల్ని మంటల్లో వేసి తగులబెట్టాలన్పించింది.

''కానీ తాతయ్య రాజీపడలేకపోతున్నారమ్మా !''


''అంత తెలిసిన ఆయనక్కూడా కులాల పిచ్చిపోలేదా ?''

''పిచ్చిగాదు ! ఈ సంఘం ఆయన్ని భయపెడుతోంది ! విజయని నాకిస్తే... రాజ్యలక్ష్మి బ్రతుకులో... సుఖం — శాంతీ... అన్నవి... వుండవని తాతయ్య అనుభవాలు గొణుక్కుంటున్నాయి ! అందుకే విజయకి మరో సంబంధం చూడమని చెప్పారు !''

''అసలు నువ్వు తాతయ్యకి వున్న విషయం చెప్పావా ?''

''పరోక్షంగా చెప్పాను ! తాతయ్య విజయని శాసించరు. శాసించడం ఆయనకు రాదు. అదీగాక మృత్యువు ఆయన్నెప్పుడు పిలుస్తుందో ! వయస్సు పైబడిన ఆయనను మృత్యువు మింగివేయడానికి సిద్ధంగా వున్నదని తెలుసు ! ఆ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖ పట్నం ఆంధ్రాబ్యాంక్ ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌వారు ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు శ్రీ నేరెళ్ల వేణుమాధవ్‌ని సన్మానించారు. మొమెంటో అందజేస్తున్న శ్రీ కె. వి. భాస్కరరావు (పి. ఆర్. ఓ., సెంట్రల్ ఆఫీసు), క్లబ్ అధ్యక్షుడు శ్రీ శివశంకరం, కార్యదర్శి శ్రీ మోహన్‌లని చిత్రంలో చూడవచ్చు.



మూ గ ము త్యా లు

తరువాత వచ్చే సమస్యల్ని విజయ ఎదుర్కోలేదేమోనని తాతయ్య సందేహం ! అయినా అనవసరంగా విజయని యీ పద్మవ్యూహంలోకి లాగడం నాకిష్టంలేదమ్మా !'' సారధి లోలోని వూహలన్నీ నిట్టూర్చాయి.

సీత మాట్లాడలేకపోయిందాపైన.

* * *

ఆ తరువాత ఓ రోజున శ్రీనివాస్, శశిరేఖ కోసం వచ్చాడు. రేఖ లేదపుడు. ఎవరో అనుకున్న సీత తలుపు తీసింది.

''ఓ ! మీరా !!'' ఏ భావమూ ధ్వనించలేదామె స్వరాన.

శ్రీనివాస్ తడబడిపోయాడు ! నోటమాటే రాలేదెంతోసేపటివరకు.

''రేఖ బజారుకెళ్లింది !'' సీత మాటల్లో నిర్లక్ష్యం దొర్లింది.

శ్రీనివాస్‌కి అంతా పద్మవ్యూహంలా వుంది. ''సీత ఇక్కడికెలా వచ్చింది ?'' అతని మనస్సు భయంగా ప్రశ్నించింది.

''నువ్వు...యిక్కడ ... ఎలావున్నావ్ ?''

''సారధి మా అన్నయ్య !''

''అలాగా ... మరి నువ్వెపుడూ ... చెప్పనేలేదేమిటి ?''

''ఎందుకలా వణికిపోతారు ? నన్ను చూసి భయపడుతోందా మీ మనస్సు ? నేను మనుష్యుల్ని తినే రాక్షసినిగాదు ! అన్నయ్య గురించి చెప్పాను ! బహుశా మీకు నిషాలో విన్పించి వుండదు ! మన మధ్య ఎప్పుడూ నిషా అన్నా వుండేది ! లేకపోతే అందమైన ఆడపిల్లయినా వుండేది ! అందుకే మీకు గుర్తులేదు !'' సీత శాంతస్వరంతో అన్నది. ఆమె మాటల్లో వెదికి చూద్దామన్నా కోపమే లేదు. శ్రీనివాస్‌కి మహా యిబ్బందిగా వుంది.

''రేఖకి తెలుసా ?... నువ్వు... నా... సీత...''

''నేను మీకేమీ గాను ! మీరేవైపునుంచీ నాకు బంధువులు గారు ! రేఖకి తెలియదు ! తెలిసినా నేనేమీ బాధ పడను ! అసలు నేనందుకు సంతోషిస్తాను ! మీరు దక్షిణ ధ్రువం ! నేను ఉత్తరధ్రువం ! అందుకే విడిపోయాం ! రేఖని మాత్రం యిలా వంచించకండి ! నాతోపాటు అన్నయ్యున్నాడు! సలీమ్ వున్నాడు ! ఆ పైన ఆషా వుంది ! రేఖ కోసం మేము ఏమైనా చేయగలం !'' సీత స్వరం కటువుగా వుందీసారి.

''నా మనస్సులో నీకు చోటే లేదు సొమ్మంది'' ఆమె నిర్దాక్షిణ్యంగా.

శ్రీనివాస్ ఆమెనే చూస్తుండిపోయాడు విభ్రాంతుడై.

''ఈ సీత నాకు తెలియదు ! నాకు తెలిసిన సీతకి యిన్ని మాటలు రావు ! మేకపిల్లలా అమాయకంగా, భయం భయంగా నావంక

మాట వినే మరమనిషి !

టోక్యోలోని టామీ కంపెనీ వారు తయారుచేసిన 'ఎలామీ' అనే మరమనిషి చెప్పినట్లు వింటుంది. పర్సనల్ కంప్యూటర్ గేమ్స్‌లో మనిషికి జతగా ఉంటుంది— ఈ మరమనిషి 16 రకాల ఆజ్ఞలను గుర్తించగలదు. ఈ ఆజ్ఞలను మామూలుగా ఉచ్చరించితే, ఎలామీ 90 శాతం వరకు అర్థంచేసుకొంటుంది. పైగా ఇది 300 ఇంగ్లీషు పదాలను ఉచ్చరించగలదు. ముందుగా టైమ్ అమర్చిపెడితే అలారం లేక సంగీతం విన్పిస్తుంది. టామీ సంస్థ నెలకు పదివేల యూనిట్లు చొప్పన ఉత్పత్తి చేయగలదు. దీని ఉత్పత్తి సెప్టెంబరు నెలలో ప్రారంభం కాగలదు.

చూసేది ! ఇంత ధైర్యం ఎలా వచ్చింది ?'' అతని మనస్సు నిలదీసి ప్రశ్నిస్తోంది.

''నేను కోర్టుకు రావడంలేదు ! అక్కడ మీ పేరుతో నా పేరు జోడిస్తే భరించడం నా వల్లగాదు ! మళ్ళీ యీ యింట్లో అడుగు పెట్టకండి ! ఇక్కడ వున్న వాళ్ళకి వంచన, మోసం, కుట్రా తెలియవు ! రేఖకి చెప్పేశాను. విడాకులు యిచ్చేశానని. నేను ఏలూరు నుంచి రాకమునుపే నిశ్చయించుకున్నాను నా బ్రతుకు నేనే బ్రతకాలని. అందుకే మీ అమ్మగారినీ, నాన్నగారినీ తీర్థయాత్రలకి పంపించాను.''

''కొడుకు పుట్టనే లేదనుకుంటాను'' అని ఏడ్చారు మీ అమ్మగారు ! ఆస్తి నా పేర రాయించుకున్నాను ! మీ నాన్నగారే రాయించుకోమన్నారు !''

''నేన్నమ్మను !'' శ్రీనివాస్ కోపంగా అరిచాడు.

''నాకు జరిగిన అన్యాయానికి మీ నాన్నగారిని శిక్షించాను !'' సీత మనస్సు అవమాన భారంతో దహించుకుపోతోంది.

''అది నా ఆస్తి ! కోర్టుకు వెళ్తాను !'' మళ్ళీ నోరు చించుకున్నాడతడు.

''మీ నాన్నగారి స్వార్జితం అది ! ఎవరికీ రాయనన్నారు ! నాకు మాత్రమే రాస్తానన్నారు ! ఆయనకా హక్కుందని చెప్పారు.'' సీత కంఠం గంభీరంగా వుందీసారి.

''రేఖకి రాసేశాన్నేను ! ఆమె యిన్నాళ్ళూ యీ డబ్బుకోసమే మీలాంటి గోముఖ వ్యాఘ్రాలతో స్నేహం చేసింది ! ఆ నరకాన్నుంచి తప్పించడానికి అన్నయ్య రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నాడు. వాడికోసం ఆస్తినంతా రేఖకి రాసేశాను.''

''నిన్ను... నిన్ను... ఏంజేస్తానో చూడు!'' అతడు పళ్ళు పటపట లాడించాడు ఆగ్రహం పట్టలేక.

కర్నాటక రాష్ట్ర లాటరీ

గొప్ప బహుమతి

రూ. 20 లక్షలు

5 మొదటి బహుమతులు

రూ.1,00,000

రూ. 38,00,000 విలువగల


2,11,061 నగదు బహుమతులు


ప్రతి టిక్కెట్టు రూ. 2

పండుగ బంపర్ డ్రా

20-10-83

మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ KSL/245-A/Tel





"ఏమీ చెయ్యలేరు ! నేను సీతని ! సారధికి చెల్లెల్ని ! దయదలిచి వదిలిపెట్టా నింతటితో ! ఉద్యోగంకూడా వూడగొట్టమన్నారు మా అత్త గారు ! పేపర్లో ఫోటో వేయించి మీ నిజస్వరూపం గురించి పదిమందికీ తెలియపరచమన్నారు మా మామయ్య ! కానీ నేనే వద్దన్నాను ! నాకు జాలివేసి మామయ్యని బ్రతిమాలాను !"

"స్టుపిట్ ! నిన్ను చంపేస్తాను !"

"ఏమిటా అరుపులు ? ! ఎందుకూ ? రేఖకి చెప్పనా? నాకు మంచివాళ్ళంటేనే భయమూ, భక్తీ ! ఆ మంచితనానికి దూరంగా వున్న వాళ్ళని నేను లెఖ్ఖచేయను."

"హల్లో ! సీతా! సో యూ హేవ్ సీన్ మై హీరో ! ఏం శ్రీనివాస్ ! ఎలావుంది మా సీత ?! మా అక్కయ్య ! అంతేగాదు ప్రియాతి ప్రియమైన స్నేహితురాలుకూడా ! ఓ వెధవ అక్కని మోసంజేశాడు ! కూర్చో ! డాళింగ్ ! ఆ రాస్కెల్ ఏ వూళ్ళో వున్నాడోమరి ! మా సీత చెప్పనంటోంది ! కానీ ఎప్పుడో తెలుసు కుంటాను ! ఆ ఫూల్ని కాల్చిపారేస్తాను ! సీతా ? నాకడ్డురాకిపుడు ! ఐ విల్ కిల్ హిమ్! వాణ్ణి ముక్కలు ముక్కలుగా నరికిపారేస్తాను!" రేఖ వచ్చీ రావడంతోనే కోపంతో విరుచుకుపడింది. శ్రీనివాస్ కుర్చీలో కూర్చుని రుమాలు తీసి ముఖానబట్టిన స్వేదబిందువుల్నితుడుచుకున్నాడు.

"రేఖా ! నీ కోపానికి పట్టాభిషేకం చేస్తానుగానీ యిలారా ! మీ హీరోకి కాఫీయిచ్చి పంపించు ?" లోనికి వెళ్ళిన సీత పిలిచింది.

"శ్రీనూ డియర్ ! సీత అందమైంది గాదా ?" రేఖ ప్రశ్నించింది సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ !

శ్రీనివాస్ కోపాన్ని దిగమ్రింగుతూ తల వూపాడు.

"మరి ఆ ఫూల్కేమైంది ? గుడ్డి వాడంటావా ? ఎందుకింత అందాన్ని కాలదన్ని వెళ్లిపోయాడు ! వాడికి పిచ్చయినా వుండాలి ! వెర్రయినా వుండాలి !"

మూగ ముత్యాలు

"రేఖా! నువ్వు హద్దులు మీరిపోతున్నావు?" సీత లోపలినుంచి వారించింది.

"ఎందుకు సీతా ? ఇంకా ఆ మోసగాణ్ణి సమర్థిస్తున్నావు ? నేనయితే యీ సరికి ఆ రాస్కెల్ని జైలుకి పంపించేదాన్ని! ఆ! డాళింగ్! మా సీత వట్టి పిచ్చిది! ఆ మాటలకేంగానీ ! నా బదులు నువ్వుసీత నెందుకు చేసుకోగూడదు!..."

"రేఖా ! ... నువ్విలారా !" సీత కేక వేసింది.

"అబ్బా... వుండు సీతా ! నా దగ్గర పదిహేనువేలున్నాయి ! సారధి ప్రాణం కూడా యిస్తాడు సీత కోసం ! నేను నా డబ్బంతా సీత పేరిట బ్యాంకులో వేస్తాను ! ఇంకా చాలదను కుంటే సలీమ్ భయ్యాని అప్పు అడుగుతాం !"

శ్రీనివాస్ లేచి నిలబడ్డాడు.

"ఏం ? వెళ్లిపోతున్నావ్ ? సీత నీకు నచ్చలేదా ?"

"నాక్కాస్త పనుంది ! వెళ్తాను !" అతడు గొణిగాడు.

"మరి సీత మాటేమిటి ?" రేఖ మళ్లీ ప్రశ్నించింది.

"మరీ పిచ్చిగా మాట్లాడుతున్నావు రేఖా!"

"ఐసీ ! నీకు సీత నచ్చలేదన్నమాట ! నీక్కావలసింది నేనన్నమాట ! పోన్లే ! మన పెళ్లయ్యాక నువ్వు నాకోసాయం చెయ్యాలి శ్రీనూ ! మా సీత మొగుణ్ణి ఎక్కడున్నా వెదికి పట్టుకురావాలి ! ఇద్దరం కలిసి వాణ్ణి చిత్రవధ జేద్దాం !" శ్రీనివాస్ వినలేనట్లు తల వంచు కున్నాడీసారి.

రేఖ అతనికి దగ్గరగావచ్చి, గొంతు తగ్గించి అన్నది—

"ఏమిటి? శ్రీనూ ? సీత మీదే మైనా మనసు పోయిందా? మనం క్రొత్తతరం మనుషులం ! కోరికల్ని అదుపులో పెట్టడం మన సివిలిజేషన్గాదు ! సిగ్గుపడకు డాళింగ్ ! సీతని కూడా చేసుకుంటానంటే ... మాట్లాడ తాను ! ఎందుకంటే నాకు యీ పెళ్ళిళ్ల మీద అంతగా నమ్మకం లేదు ! సీత మొగుణ్ణే తీసుకో! వాడు వేదమంత్రాలు వల్లించి మంగళసూత్రం కట్టాడు. వందలమంది సాక్ష్యంగా వున్నారట ! దేవుడికీ, దయ్యానికీ, చుక్కలకీ, సూర్యుడికీ నమస్కారాలు పెట్టి ఏడడుగులు నడిచాట్ట ! ఆపైన డబ్బుకూడా పుచ్చుకున్నాట్ట ! ఇంతా జేసి – ఆ మంత్రాల్నీ, ఆ నమస్కారాల్నీ, ఆ సాక్ష్యాల్నీ గంగలోకి నెట్టేసి పారిపోయాట్ట ! ఎందుకా పెళ్ళి ? ఆ వేదమంత్రాలకే కట్టుబడని ఆ వెధవమనిషే నంటావా ? అంతమంది సాక్ష్యం వున్నా, అందర్నీ మించిన ఆ దేవుడు చూస్తున్నా... ఆ పెద్దమనిషి ఎలా పారిపోయా డంటావ్ ? బహుశా వాడు రాక్షసుడేమో ! అందుకే శ్రీనూ ! నాకా మంత్రాలతో పెళ్ళంటే భయం ! ఏదో యిష్టం వున్నన్నాళ్ళు కలిసి వుండడం ! లేనినాడు మర్యాదగా, చడీచప్పుడు గాకుండా విడిపోవడం ! ఇదే నాకు నచ్చిన పద్ధతి ! ఏదో సీత గోలపెడుతోందని గుళ్ళో పెళ్ళికి ఒప్పుకున్నాను!" రేఖ వాక్ప్రవాహానికి అడ్డే లేకుండాపోయింది.

"కూర్చో డాళింగ్ ! అన్నయ్య వచ్చే వేళయ్యింది ! నీతో మాట్లాడాలన్నాడు !" అతణ్ణి బలవంతాన కూర్చోబెట్టింది.

లోనికి వెళ్ళింది "సీతా ! కాఫీ అయ్యిందా?" అని అరుస్తూ.

"అరే ! ఏడుస్తున్నావెందుకూ ?" సీతని చూడగానే ఆశ్చర్యపోయింది.

"ఛ ! ఎందుకూ ? ఒక్కసారే స్టౌ ఆర్పేశాను ! ఆ పొగ కళ్ళల్లోకి పోయి నీళ్ళొచ్చాయి !" సీత సమాధానం విన్న రేఖ మాట్లాడలేదు. కాఫీ పట్టుకువెళ్ళి శ్రీనివాస్ కిచ్చింది.

"కాఫీ చేదుగా చేసిందీవేళ ! సీత మరీ పిచ్చిదై పోతోంది రోజురోజుకీ ఆ ఫూల్‌ని తలుచుకుని !" శ్రీనివాస్ రేఖ మాటలు విన్పడ నట్లు పేపరు చూడసాగాడు.

"శ్రీనూ ! సీతను చేసుకుంటానని నాకు మాటివ్వు ! నీ క్కావలసినంత డబ్బిస్తాను !" రేఖ మళ్ళీ ప్రాధేయపడింది.

"నీకేమైందీవేళ ?" శ్రీనివాస్ లేచి నిలబడ్డాడు.

"మా సీత ఏడుస్తోంది శ్రీనూ !"

"అయితే నేనేం చేయను ?"

"సీత నీకేమీ గాదా ?"

"ఇదేం ప్రశ్న ? నాకేమవుతుంది ?"

"ఎందుక్కాకూడదు ? నీ క్కావలసింది అందమే గదా ? సీత నా కంటే అందమైంది ! శ్రీనూ ! నువ్వు సరిగ్గా చూడలేదేమో ! ఓసారి పిలుస్తానుండు ! సీతా ! ఓసీతా ! ఓసారిలారా!"

సీత శ్రీనివాస్ వెళ్ళిపోయాడనుకుని వచ్చింది. అక్కడేవున్న అతణ్ణి చూసి వెంటనే లోనికి వెళ్ళి పోయింది.

"రేఖా! నేను గుడికెళ్తున్నాను! తలుపులు వేసుకో !" అని లోపలనుంచి చెప్పివెళ్ళిపోయింది.

శ్రీనివాస్ పెద్ద ఆపదనుంచి బయట పడ్డట్టు నిట్టూర్చాడు.

"చూశావా ?" రేఖ అడిగింది.

"రేఖా ! నా క్కావలసింది నువ్వు !"

"నాలో ఏం వుంది ?"

"అదంతా నాకు తెలియదు రేఖా ! నేను నీకోసమే పుట్టాను !" రేఖ నవ్వింది పెద్దగా అతని మాటలు విని.

"నువ్వు... చాలా... తెలివిగలవాడివి శ్రీనూ ! నిన్ను... నిన్ను పోగొట్టుకోలేనిక !" రేఖ నవ్వుతూనే సమాధానం చెప్పింది. శ్రీనివాస్ సెలవు దీసుకుని వెళ్ళిపోయిన తరువాత కూడా అక్కడే కూర్చుండి పోయింది ఎంతోసేపటివరకు. సీతవచ్చి చూసింది.

"చీకట్లో కూర్చున్నావేమిటి రేఖా ?" లైటు వేసి అడిగింది.

"నీకు బాధగావుందా సీతా ? నేను పెళ్ళి జేసుకుని వెళ్ళిపోతున్నానని ! అందుకేగదూ ? నువ్వు ఏడిచింది ! 'పొగ'కి కన్నీళ్ళొచ్చాయని నన్ను భ్రమలో ముంచకు సీతా ! నాకు తెలుసు! అవి నీ గుండెల్లోనుంచి వచ్చిన కన్నీళ్ళు !" రేఖ కళ్ళు మూసుకుంది చివర్లో !

"చిన్నప్పటినుంచీ నాకూ ఓ చెల్లెలుంటే ఎంత బావుండును ! అనుకునేదాన్నమ్మా ! తీరా నువ్వు లభించిన తరువాత... నానుంచి దూరంగా వెళ్ళిపోతున్నావనుకుంటే నా మనస్సు భరించలేకపోతోందమ్మా !" సీత కళ్ళల్లోనుంచి అశ్రుబిందువులు రాలిపడ్డాయి.

"ఒద్దు ! సీతా ! ఏడవకు ! ఒంటరిగా పుట్టడం ఎంత బాధో నాకు తెలుసు! నేనెక్కడికి వెళ్తాను ? ఈ సిటీలోనే వుంటానుగా ? నీ గురించి... నా మనస్సు... యీ మధ్య ఎంత గానో ఆలోచిస్తోంది సీతా ! నిజంగా పిచ్చిదానిలా ఏడ్చాననుకో నీకు జరిగిన అన్యాయం వినగానే !"

"నాకా విషయం గుర్తుజేయకమ్మా ! నాకు గతం లేదనుకుంటున్నాను !"

"నీ అంతటి మనోబలం నాకు లేదక్కా ! అందుకే యిలా బ్రతుకుతున్నాను !" ఆమెలోని వూహాలు 'సీతని' ఆప్యాయంగా 'అక్కా' అని సంబోధించకుండా వుండలేకపోయాయి.

"జరిగింది పీడకల అనుకోరేఖా ! ఇకనైనా అన్నయ్య మాట విను ! వాడికి... వాడిని... మనం జీవచ్ఛవంలా మార్చివేశామని భయం వేస్తోంది !" సీత గొంతు భారమైంది.

(ఇంకా వుంది)

నేను మహాత్ముని అనుసరించుటకు కారణం

శ్రీ సర్ విజయానందగజపతి

మన సాంఘిక రాజకీయాలలో సంభవించిన విచిత్రములందు నాలో కలిగిన పరివర్తన ఒకటని నా మిత్రులన్నారు

నేను ఆగర్భశ్రీమంతుణ్ణవటమే కాకుండా మా తెగవారందరూ ఉగ్గుపాలతో నేర్చుకొన్న ప్రభు భక్తిపరాయణత్వంకూడా చిన్ననాటనే నా కలవడింది. అప్పటికి అమలులో వుండే పాలక వర్గానికి భక్తి తత్పరుడు కాకుండా జమీందారైన వాడెవ్వడూ వుండలేదు. కాని ప్రతి మానవుడి జీవితంలో కలిగే అద్భుత పరిణామాలను గురించి మనస్తత్వవేత్త లెవరైనా చెప్పగలరు. అసలు యధార్థం ఏమిటంటే ఆంగ్లేయునితో ఎంత సన్నిహితంగా సంచరిస్తే, అంత స్పష్టంగా అతడికీ మనకీ వుండే సంబంధం యొక్క మిథ్యా, కృత్రిమత్వం కండ్లకు కట్టుతుంది. ఆంగ్లేయుల్లో పెద్దలతో మనం విందులారగించవచ్చు; గొప్పవారి సరసన భోంచెయ్యవచ్చు; మహోన్నతులతో భాయి భాయి అంటూ బుజాలు కలిపి తిరగవచ్చు; గవర్నమెంటు భవనంలోగాని, రాజప్రతినిధి యింటగాని గౌరవనీయులైన అతిథులుగా వుండవచ్చు. చీట్లాటలో వారిని చిత్తుచేయవచ్చు; క్రికెటులో వారిని అవలీలగా వోడించవచ్చు. మనలను చూసి వారు సంతోషిస్తారు; ప్రేమిస్తారు. అయితే, అదేమి చిత్రమోగాని, వారికీ మనకీ మధ్య హిమాలయం లాంటి పెద్దగోడ వొకటి అడ్డు వున్నట్టు అంతలో స్ఫురిస్తుంది.

తాము పాలకవర్గానికి చెందినవారమని ఆంగ్లేయులెన్నడూ మరువలేరు. ఉత్తమోత్తముడైన భారతీయుడు సయితం అధమాధముడైన ఆంగ్లేయుడికి జోహారు చేయవలెననే భావాన్ని వారెన్నటికీ విస్మరించలేరు. ఆంగ్లేయుల యొక్క ఈ వైఖరి మనలో అణగియున్న స్వతస్సిద్ధమైన భారతీయత్వాన్ని పైకుబుకిస్తుంది. జ్ఞానోదయం లాగా అది నీలో వుత్పన్నం అవుతుంది. పాత వాసనలను వదిలి కొత్త భాంధవ్యాల కోసం నీ మనస్సు పరిశోధిస్తుంది. నాలో కలిగిన పరివర్తనకు కారణం యిది తప్ప మరొకటి కాదు. ఇది కేవలం మనస్తత్వానికి సంబంధించిందే.

భూమ్యాకర్షణ శక్తినుంచి తప్పించుకోగలమని అనుకోటం ఎలాంటిదో, ఈ కాలంలో భారతీయుడై వుండి గాంధీ తత్వానికి ఆకర్షింపబడకపోవటం అలాంటిది. నిర్జీవంగానీ సజీవంగానీ విగ్రహారాధన అనేది మనలో పాతుకు పోయి వుంది. భారతభూమి ప్రధానంగా అవతారాలకు ఆలవాలమైన దేశం. రాజకీయాల మాట అలావుంచండి; భారతదేశానికి ప్రపంచంలో ప్రత్యేకత సంపాదించిన మహోన్నత వ్యక్తిని గురించి ఏ భారతీయుడు గర్వించడు? ఫకీరుగానీ, అమీరుగానీ ప్రతి భారతీయుడిలోనూ త్యాగ తత్వం ఎముకకంటుకొని వుంది. గాంధీ మహాత్ముని జీవిత నిరాడంబరత అప్రతిమానమైనది. మన మత, సంస్కృతుల ఉదాత్తత యావత్తూ ఆయనలో మూర్తీభవించియుండటం చేతనే గాంధీజీ అంటే మన కంతటి ఆకర్షణ. దానిని కాపాడటానికే మహాత్ముడు చరిత్రాత్మకమైన నిరశన వ్రతంలో ప్రాణాలొడ్డాడు. ఆయన మహా త్యాగం నన్ను ఆత్మ పరిశోధనకు పురికొల్పింది. ఎంతటి మహోన్నతపథాలకు ఆత డెగిరిపోగలడో ఒక్క త్రుటిలో మెరుపు భంగి నాకనుభూతమైంది. మనలోని పతితులయెడలా, నికృష్టులయెడళా మనకు గల బాధ్యతలను గురించి నాకది కనువిప్పు అయింది. గాంధీ మహాత్ముని జీవితం భగవద్గీతానుష్ఠానం. మహాత్ముని హిందూమతావలంబనం సంవత్సరంలోని ఋతువులవలె కాలానుగుణ్యమూ, స్వయం పోషకమూనైనది.

సత్య, అహింసలను గురించిన జిజ్ఞాసను మనం వేదాంతులకు వదిలివేయవచ్చు. కాని, సిద్ధాంతపూర్వకంగా సత్యాన్ని ఎట్లా కాదనలేమో అట్లాగే అహింసా సిద్ధాంతాన్ని కూడా కాదని వాదించలేము. మానవుడు అహింసను పూర్తిగా ఆచరించగల పరిణతిని పొందాడా అన్నది వేరే విషయం. అతడింకా ఆ స్థితికి రాలేదనే నా అనుమానం. మనల్నింకా యుద్ధాలు వదలలేదు. మరికొన్ని రుధిరస్నానాలతోగాని ప్రపంచ చరిత్ర పూర్తికానట్టు తోస్తుంది. కాని, అంతమాత్రాన ప్రవక్తల దివ్య సందేశాలను, వారి కర్తవ్య పాలనను, వారి భావోన్నత్యాన్ని మనం కాదనలేము. దేశభక్తుడుగా కంటె మహా ప్రవక్తగా ప్రపంచంలో మహాత్ముడికిగల స్థానం అధికమని అంగీకరించక తప్పదు. బుద్ధుడు; ఏసుక్రీస్తుల వంటి వాడు గాంధిమహాత్ముడు.

అన్యోన్య ప్రతికూల శక్తులవల్ల మానవ స్వభావం విచిత్రగతుల సంచరిస్తుంది. దైనందిన ప్రత్యక్ష జీవితంలో అహింసావలంబనం మనకు అసాధ్యం కాబట్టే దానిని ఆదర్శంగా మనం ఆరాధిస్తున్నామేమో! అందుచేతనే మహాత్ముడికి మన హృదయాల్లో స్థిరమైన స్థావరం ఏర్పడ్డది. అంగుష్ఠమాత్రుడైన ఈ ప్రవక్త మనల్ని సందర్శన మాత్రంచేతనే ఆకర్షించుకుంటాడు.

ప్రతి క్రికెట్ ఆటగానివలె నేను కూడా నిర్మాణశక్తి యొక్క విలువనూ, ఐకమత్యావస్యకతనూ, అందువలసిన త్యాగాన్ని గ్రహించి, గౌరవించగలిగాను. ఈ గుణాలు గాంధి మహాత్ముడిలో కొల్లలుగా కనపడుతాయి. మహాత్ముడు ఈ గుణాలను తన మిత్రులకూ, అనుచరులకూ కూడా అనుగ్రహించాడు.

ఖమ్మంలోని శ్రీ రాఘవేంద్ర సేవాసమితివారి ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని 250 మంది రోగులకు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బత్తాయిపండ్లు, గ్రుడ్లు పంచిపెడుతున్న దృశ్యం. జిల్లా కలెక్టరు శ్రీ రస్తోగి, ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ శ్రీ రాఘవేంద్ర సేవాసమితివారి కార్యకలాపాలను అభినందించారు. ఈ సేవాసమితి 1983 జనవరి 26న 25 మంది ఉత్సాహవంతులైన వ్యక్తులతో ప్రారంభించబడి, నిరంతరాయంగా సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నది.



నేను మహాత్ముని...

ఏకీభావంతో కలిసి పని చేయడం మనకు నేర్పినవాడు గాంధీ మహాత్ముడే. సగం ఘనీభవించి, అపక్వ స్థితిలో ఉన్న కాంగ్రెసును చేపట్టి దానిని ఉక్కు ముక్కలాంటి ఇటుకగా తయారుచేసిన మహా నిర్మాత గాంధీ మహాత్ముడు. ఆ ఇటుకకు అచ్చును తయారు చేయటమే కాకుండా, అది ఘనీభవించేలోపుగా దానికి తీర్పులు తీర్చి, రూపురేఖలు దిద్దాడు. సామాన్య దృష్టికి అసంభవంగా కనిపించే సత్యము, అహింస అను ఆదర్శాల మీద ప్రపంచంలో కెల్లా గొప్పదైన స్వచ్ఛంద సేవాసంస్థ నొకదాన్ని నిర్మించి పోషించడం అల్ప విషయం కాదు. ఆ ఆదర్శాల కతడు వివిధగతుల నిర్మాణ రూపం కలగజేశాడు. వాటిలో ముఖ్యమైనది కాంగ్రెసు 'నిర్మాణ కార్యక్రమం.' హిందువుల ఏకత్వం, భారతైకమత్యం, మహిళోద్ధరణ, గ్రామ పునరుద్ధరణ— ఇంకా ఇలాంటి అనేక మహద్విషయాలను గురించి మనందరి కంటె ఎన్నో వత్సరాలు ముందే ఆలోచించాడు; నేటికీ ఆలోచిసున్నాడు. అతడు కొట్టిన ప్రతి దెబ్బకూ పాత సంకెళ్ళు ఫెళ్ళన రాలిపోతూ వున్నవి. ఒకవంక పరపరిపాలనా భవనం నించి వొక్కటొక్కటిగా ఇటుకలనన్నిటినీ లాగివేయుటమే కాకుండా, వేరొకవంక మన భవిష్యదావాసమైన ఆ స్వరాజ్య భవనానికి ఒక్కొక్క యిటుకను పేరుస్తున్నాడు. నిర్మూలనంతో బాటు నిర్మాణమూ, సంహారంతో బాటు సృష్టి చేయగల అదృష్టం ప్రపంచేతిహాసంలో ఏ కొద్దిమంది వ్యక్తులకోగాని లభించదు. గాంధి మహాత్ముడు మనకు స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టడమే కాక దానిని వినియోగించుకోడానికీ, సంరక్షించుకోటానికీ కూడా శక్తి సామర్థ్యాలను ప్రసాదించాడు. గాంధీ జీవితాని కంతటికీ ఇది మకుటప్రాయమని భవిష్యచ్చరిత్రకారులు కీర్తిస్తారు. తర తరాలుగా భారత సంతతి అత్యంత కృతజ్ఞతా భావంతో సంస్మరించగలదు.

మనం కాంక్షించే విప్లవం మన మీదనూ, మన వెంటనూ, మనతోనూ ఉన్నదని తెలుసుకోలేక 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని అరుస్తుంటాము. అలాగే, ధర్మసంస్థాపనార్థం అవతరించుతాడన్న ఆ మహాపురుషుడు ఎన్నడో రాబోవడం లేదు: మనతోటే వున్నాడు. అట్టి యుగపురుషుని అడుగు దమ్ములలో నడవగల అవకాశాన్ని కోల్పోయే మందభాగ్యుడెవడుంటాడు ?

ఆంధ్రపత్రిక
1942 మార్చి 25
సంచిత నుంచి

బ్రోచేవారెవరురా?



పాలకూర సీతాలత

పినాకపాణి తల్లివైపు చూశాడు. ఆమె ఆదమరిచి నిద్రపోతోంది. మంచంమీంచి లేచివెళ్ళి ముఖం కడుక్కున్నాను. కుంపటి అంటించి నీళ్ళు పడేశాడు. మధ్యలో ఒకసారి వచ్చి తల్లి లేచిందేమోఅని చూశాడు. రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు కాబోలు, ఇంకా నిద్రపోతూనే వుంది ఆమె. కాఫీ తయారుచేసి గ్లాసుతో తీసుకెళ్ళి తల్లిని తట్టిలేపాడు.

"అమ్మా !... కొంచెం కాఫీ తాగు... లేకపోతే మరీ నీరసంగా వుంటుంది..."అన్నాడు. ఆమె నీరసంగా కళ్ళు తెరిచింది. నెమ్మదిగా లేచి కూర్చుంది. గ్లాసును ఆమె నోటి ముందు వుంచాడు పినాకపాణి. ఆమె మెల్లగా గుటకలు వేస్తూ కాఫీ తాగింది.

"వేడినీళ్ళు పెడతాను. నెమ్మదిగా లేచి ముఖం కడుక్కో... ఆ తర్వాత రొట్టె కాల్చి ఇస్తాను... తిను..." అన్నాడు పినాకపాణి.

"వద్దురా... నాకు సహించదు..." అంది అనంతమ్మ తల అడ్డంగా తిప్పుతూ.

"అలా అంటే ఎలా ? ఎలాగోలా తినాలి.. లేకపోతే నీరసందాదూ ?..." అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. వేడినీళ్ళు కాచి ఇచ్చాకా ముఖం కడుక్కుంది.

అనంతమ్మ భర్త పది సంవత్సరాల క్రితం ఏదో ప్రమాదంలో మరణించాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు. గుమాస్తాగా పనిచేసిన భర్త ఏమీ వదలలేదు. పెద్దవాడు సుబుద్ధి ఇప్పుడు ఏదో పల్లెటూర్లో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా వున్నాడు. ఆ పల్లెలో హైస్కూలు చదువు లేదన్న మిషతో తల్లినీ, తమ్ముడినీ అక్కడే వదిలాడు. సుబుద్ధి పేరుకు తగ్గట్టుగానే వుండేవాడు పెళ్ళి కాకముందు. కొత్తగా వచ్చిన పెళ్ళాం అతన్ని లొంగిదీసుకున్నందువల్ల కొంచెం మారిపోయి, తల్లికి డబ్బులు పంపడంలో కొంచెం ఆలస్యం చేస్తున్నాడు. అందువల్ల ఇంట్లోని చిన్న, చితక సామాను కాళ్ళువచ్చి బైటకు పోతున్నాయి. ఇంటి పనుల్లో రోగిష్టి తల్లికి సాయంచేస్తూ హైస్కూల్లో కష్టపడి చదువుకుంటున్నాడు పినాకపాణి.

ఈ మధ్య అనంతమ్మ ఆరోగ్యం మరింత పాడయ్యింది. ఆమెకు మరీ బాగోనప్పుడు స్కూలు మానేస్తాడు పినాకపాణి. అందుకు తల్లి అంగీకరించదు. నిజమేమరి ! తన కొడుకు శ్రద్ధగా చదువుకుని మంచి ఉద్యోగం చెయ్యాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది.

"ఒకటి రెండు రోజులు నేను స్కూలుకి వెళ్ళకపోయినా ఫర్వాలేదమ్మా ! స్నేహితుల దగ్గర్నుంచి నోట్సులు తెచ్చుకుంటాము. నా చదువు ఏ రకంగానూ పాడవ్వదు. నువ్వు విపరీతమైన జ్వరంతో మూలుగుతూ ఇక్కడ కూర్చుంటే నాకు స్కూలుకు వెళ్ళాలని వుండదు. ముందు నువ్వు... ఆ తర్వాతే చదువు ..." అనేవాడు పినాకపాణి.

దగ్గుతూ, గాజుకళ్ళతో అతనివైపు ప్రేమగా చూసేది అనంతమ్మ.

తల్లిగురించి అంతగా ఆరాటపడే కొడుకు వుండటం ఒకరకంగా, ఆ తల్లి చేసుకున్న అదృష్టమే.

ఆమెకు వాదించేటందుకు కూడా ఓపిక వుండదు.

"ఊ..." అని దీర్ఘంగా నిట్టూర్చి పడుకుంటుంది.

ఆ ఊరి డాక్టరు విశ్వేశ్వరరావు మొహమాటంకొద్దీ వచ్చి వైద్యం చేస్తూ వుంటాడు. అందుకు కారణం అనంతమ్మ భర్త, ఆయన తండ్రి స్నేహితులు కావడం. అక్కడికీ ఒకటి రెండుసార్లు పినాకపాణి ముందు మూలుగుతాడు.

"ఒరేయ్ ! యాభై రూపాయలు ఇవ్వాలిరా ఇప్పటివరకూ..."

పినాకపాణి తల్లికి తెలియకుండా అన్నకు ఉత్తరం రాశాడు, డబ్బు పంపమని. ఎన్ని రోజులైనా జవాబు మాత్రం రాలేదు. 'బహాశ

గ మ ని క

వ్యక్తులపేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ - 520 003 అన్న చిరునామాకి పంపండి.

—సం.

బ్రోచేవా రెవరురా?

అన్నయ్యకు ఉత్తరం అందలేదు కాబోలు...' అనుకున్నాడు. కానీ ఆ ఉత్తరం అందుకుని దాన్ని చించి ముక్కలు చేశాడని వాడికేం తెలుసు ?

సుబుద్ధి వేలకువేలు సంపాదిస్తున్నాడనీ, పెద్ద ఆఫీసరు పోస్టులో ఉన్నాడనీ అనటంలేదు కానీ సంపాదన ఎంత తక్కువైనా కన్నతల్లినీ, తమ్ముడినీ మరిచిపోతే ఎలా ? ఉన్నదాన్లోనే సర్దుకుని తన వాళ్లను సుఖపెట్టడానికి ప్రయత్నించాలి కానీ 'నేను, నా పెళ్లాం సుఖపడితే చాలు...' అనుకుంటే ఎలాగ ? తండ్రి తద్దినం మాత్రం ఘనంగా జరుపుతాడు. అది తన బాధ్యత అని చెప్తాడు. బ్రతికి ఉన్న తల్లి తిందో, లేదో చూడనివాడు చచ్చిన తండ్రికి మాత్రం తద్దినాలు పెడతాడు.

స్కూల్లో పరుగు పందెంలో పినాకపాణికి పాతిక రూపాయలు బహుమతి వచ్చింది. ఇంటికి వచ్చి తల్లితో తను పందెంలో ఓడిపోయానని చెప్పాడు. ఆ పాతిక రూపాయలూ విశ్వేశ్వరరావు చేతిలో పెట్టాడు.

"ప్రస్తుతం ఇది వుంచండి. తర్వాత సంగతి తర్వాత చూద్దాం. నేను ఈ డబ్బు మీకు ఇచ్చినట్లు అమ్మకు చెప్పకండి...', అన్నాడు పినాకపాణి.

విశ్వేశ్వరరావు అభ్యంతరం చెప్పకుండా తక్కున జేబులో పెట్టుకున్నాడు ఆ సొమ్ము.

పినాకపాణి కొంచెం కొంచెంగా పరిస్థితులు అర్థం చేసుకుంటున్నాడు. వాడికి తల్లి అంటే అమితమైన ప్రేమ. తనకు చేతనైనంతవరకూ ఆమె ఏ కష్టం కలగకుండా చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం అవసరం అయితే తన చదువు త్యాగం చేసుకుందుకుకూడా సిద్ధం అయ్యాడు. తల్లిని అనురాగంతో చూసుకోగలడు గానీ ఇల్లు నడపడానికి డబ్బు ఎలా తెస్తాడు ? ఇంట్లో సామాను కొద్ది కొద్దిగా మాయం కావడం, అన్నగారు ఈ సారి రెండు నెలలు దాటినా డబ్బు పంపకపోవడం గమనించాడు. కానీ ఏం చెయ్యాలో తెలియటం లేదు. పైగా ఈ మధ్య తల్లికి అసలు ఒంట్లో బాగోటంలేదు.

అనంతమ్మ ముఖం కడుక్కోవడం పూర్తి చేసి నెమ్మదిగా నడుస్తూ వెళ్లి మంచం ఎక్కేసింది. అప్పటికే పెనంమీద బ్రెడ్‌ముక్కలు కాల్చి తల్లికోసం చూస్తూవున్న పినాకపాణి తల్లికి అందించేడు బ్రెడ్. ఆమె రెండుముక్కలు తిని ఇక తినలేనని అంటే బలవంతంగా మరో రెండు ముక్కలు తినిపించాడు. ఆ తర్వాత ఆమె ఒంటిమీద చెయ్యివేసి "ఈ రోజు జ్వరం తగ్గినట్లే వుంది. డాక్టరుగారు వచ్చి చూశాకా అన్నం వండుతాను..." అన్నాడు పినాకపాణి.

"స్కూలుకు... వెళ్లావా ?" అడిగింది అనంతమ్మ.

వెళ్లనట్టు అడ్డంగా తల తిప్పాడు

''వద్దు... నువ్వు స్కూలుకు వెళ్లు...'' అంది తల్లి.

మాట్లాడలేదు పినాకపాణి.

''కొంచెం అన్నం వండి, నువ్వు తిని వెళ్లు... డాక్టరు వచ్చి అన్నం తినమంటే... నెమ్మదిగా లేచి నేను పెట్టుకుని... తింటాను. అన్నం వద్దంటే ... బ్రెడ్... తింటాను...'' అంది.

అన్నం వండి తను కొంచెం తిన్నాడు.

తల్లికోసం కంచం, గ్లాసు, చారు అన్నీ సిద్ధంగా పెట్టాడు, ఆమె ఎక్కువ కష్టపడకుండా.

డొక్కు సైకిలు ఎక్కి స్కూలుకి వెళ్లిపోయాడు.

స్కూలుకు వెళ్లాడన్న మాటేగానీ ఆలోచనలన్నీ తల్లి చుట్టూనే వున్నాయి.

డాక్టరు వచ్చాడో లేదో! తల్లి అన్నం తిన్నదో, లేదో...

స్కూలు అయిపోగానే తనని అభిమానించే శంకరం మాష్టారి దగ్గరకు వెళ్లాడు పినాకపాణి.

''మాష్టారూ! మీతో కొంచెం మాట్లాడాలి...''

ఇంటికి బయలుదేరిన మాష్టారు, ''పద... నడుస్తూ మాట్లాడుకుందాం...'' అన్నారు.

సైకిల్ నడిపించుకుంటూ మాష్టారితో పాటే నడవసాగాడు.

''చెప్పరా...'' అన్నారు శంకరం మాష్టారు.

''మాష్టారూ!... నాకు పార్ట్ టైం ఉద్యోగం కావాలి...'' అన్నాడు.

ఆశ్చర్యంగా వాడివంక చూశారు శంకరం మాష్టారు. పదహారేళ్ల కుర్రవాడిలో కలిగిన ఆ ఆలోచనకు కొంచెం బాధ కల్గింది ఆయనకు. లేమి మనుష్యులను ఎంత లొంగదీస్తుంది?

''పాణి...'' అన్నారు కొంచెం బాధగా.

''తప్పదు మాష్టారూ!... ఇంటి పరిస్థితి అలా వుంది. చదువు మానడానికి అమ్మ ఒప్పుకోదు కనుక ఇలా అడిగాను. లేకపోతే ఏ హోటల్లోనో సర్వర్‌గా చేరడానికూడా నేను సిద్ధం సార్...'' అన్నాడు.

''వద్దురా... నేను మీ అన్నయ్యకు ఉత్తరం రాస్తాను...'' అన్నారు ఆయన.

''వద్దుసార్... నేను అందరితోనూ వాడి గురించి చెప్పానని వాడు నన్ను కోపగిస్తాడు...''

నడుస్తున్న మాష్టారు ఆగిపోయారు. పర్సులోంచి యాభై రూపాయలు తీశారు.

''ఉంచు...'' అన్నారు పినాకపాణి చేతిలో పెడుతూ.

''వద్దు సార్... మిమ్మల్ని అప్పు అడగటం నా ఉద్దేశ్యం కాదు...''

''తెలుసు... నీ అభిమానం నేను ఎరుగుదును... ప్రస్తుతం ఇది వుంచు... మీ అన్నయ్య డబ్బు పంపగానే నాకు బాకీ తీర్చుదువుగాని...'' బలవంతంగా చేతిలో పెట్టారు.

తప్పదన్నట్లు జేబులో పెట్టుకున్నాడు డబ్బు.

''సార్... ఈ సైకిలు వుంచుకోండి సార్...'' అన్నాడు.

''అంటే?... యాభై రూపాయలకు ఈ సైకిల్ నా దగ్గిర తాకట్టు పెడుతున్నావా?'' సన్నగా నవ్వారు ఆయన.

''అదీ... అదీ...'' ఏదో చెప్పబోయాడు పినాకపాణి.

''అక్కర్లేదు... నేను అర్థం చేసుకున్నాను. ఏ పరిస్థితులలోనూ ఈ సైకిలు నీనుంచి దూరం చేసుకోకు. స్కూలుకీ, మీ ఇంటికీ మధ్య దూరం అయిదు కిలోమీటర్లు. సైకిలు దూరం చేసుకుని రోజుకి పది కిలోమీటర్లు నడుస్తావా? చదువుకుంటూ, తల్లికి సేవలు చేస్తూ, ఇంత దూరం నడిస్తే నీ ఆరోగ్యం ఏం కాను? నా దగ్గరేకాదు... వేరే ఎక్కడాకూడా సైకిలు అమ్మే ప్రయత్నంగానీ, తాకట్టు పెట్టే ప్రయత్నం గానీ చెయ్యకు. ఏదైనా కష్టం ఎస్తే నాతో చెప్పి...'' మందలించారు శంకరం మాష్టారు.

''మాష్టారూ! మీరు నిజంగా దేముడు సార్...'' అన్నాడు పినాకపాణి కృతజ్ఞతగా.

''సరే... నాకు మార్కెట్‌లో పనివుంది. నువ్వు ఇంటికి వెళ్తావా?'' అడిగేరు జంక్షన్‌లో ఆగి మాష్టారు.

''అవును. ఒకసారి డాక్టర్‌గారి దగ్గరకు వెళ్లి ఆయన ఉదయం అమ్మను చూడ్డానికి వచ్చారో లేదో తెలుసుకుంటాను. వెళ్లివుండక పోతే ఆయన్నికూడా తీసుకుని వెళ్తాను. వస్తాను సార్... నమస్కారం...'' అంటూ ముందుకు నడిచాడు పినాకపాణి.

వెళ్లిపోతున్న పినాకపాణి వంక ఆప్యాయంగా చూశారు మాష్టారు.

వాడి వయసు ఎంత? వాడి ఆలోచనలు ఎంత ఎత్తులో ఉన్నాయి? తల్లి తప్ప తనకు ప్రపంచంలో ఎవ్వరూ లేరన్నట్లు ప్రవర్తించే వాడికి సాయం చేసేది ఎవరు? వాడిని ఆదుకునేది ఎవరు?

'బ్రోచేవారెవరురా?' అనుకున్నారు మాష్టారు.

* * *

ఒక వారం రోజులు గడిచిపోయాయి.

సుబుద్ధి దగ్గర్నుంచి ఎంతో కాదుకదా కనీసం ఉత్తరంకూడా రాలేదు.

అత్యవసరమైన ఖర్చులు మాత్రమే చేసినా ఆ యాభైలో పినాకపాణి దగ్గర ముప్ఫై రెండు రూపాయలు మిగిలాయి.

ఆ రోజు అనంతమ్మకు మళ్లీ తీవ్రంగా జ్వరం వచ్చింది. వచ్చి పరీక్షచేశాడు విశ్వేశ్వరరావు.

''ఒరేయ్!... ఈ మందులు తీసుకురా... ఈ ఇంజక్షన్ వెంటనే ఇయ్యాలి ఆమెకు. వెళ్లు...'' అంటూ ఒక చీటీ రాసి ఇచ్చేడు.


''నేను పావుగంటలో వస్తానుసార్... మీరు ఇక్కడే వుండండి...'' అన్నాడు పినాకపాణి.

సరేనన్నాడు విశ్వేశ్వరరావు.

సైకిలు తీసుకుని మందులషాపుకు వెళ్లాడు పినాకపాణి.

మందు చీటీ చూపించాడు. మనసులోనే





లెక్కకట్టి ''ముప్ఫై మూడు రూపాయలు...'' అన్నాడు షాపువాడు.

మందులు తీసుకుని జేబులోవున్న ముప్ఫై రెండు రూపాయలు ఇచ్చాడు.

''ఇంకో రూపాయి..'' అన్నాడు షాపువాడు.

''సార్... రేపు ఇస్తాను... ఈ మందులు ఇయ్యండి.. మా అమ్మకు వంట్లో బాగోలేదు..'' అన్నాడు ఆశగా.

''ఒంట్లోబాగాలేదు కనుకనే నీవు మందులు కొంటున్నావు... విడిగా చెప్పక్కర్లేదు...ఇలాంటి కథలు చాలా విన్నాం... వెళ్లి రూపాయి తీసుకొచ్చి ఇచ్చి మందులు తీసుకెళ్లు...'' బైట పెట్టిన మందులు లోపల పెట్టుకున్నాడు షాపువాడు.

ఒక నిముషం వాడివైపు చూశాడు. 'గొడ్డుటావుని పితికి లాభంలేదు...'అన్పించింది. అందుకే ఆలస్యం చెయ్యకుండా సైకిలుఎక్కి స్కూలుకి వెళ్లాడు.

శంకరం మాష్టారు ఏదో క్లాసులో పాఠం చెప్తున్నాడు. బైటకు పిలిచి – ''సార్... ఒక రూపాయి ఇయ్యండి... అర్జంటు... వివరాలు తర్వాత చెప్తాను...'' అన్నాడు. వాడిలోని కంగారు గమనించి ఏమీ మాట్లాడకుండా పర్సు లోంచి రెండు రూపాయలు తీసి ఇచ్చారు.

వాడు ఏదో చెప్పబోతుంటే – ''చిడినోటు లేదు... పట్టుకెళ్లు...పర్వాలేదు...'' అన్నాడు. రెండు రూపాయలు జేబులో పెట్టుకుని వేగంగా సైకిలు మీద బయలుదేరాడు మందులషాపుకి.

జంక్షన్‌లో మలుపు తిరగబోతుంటే ఒక పోలీసు అడ్డంగా నిలబడి ఆపేడు పినాకపాణిని.

ఆ పోలీసు పేరు శేషాచలం. బొద్దుమీసాలు, కుండలాంటి పొట్ట, వెడల్పు ముఖం, నల్ల రంగుతో యమదూతలాగ వున్నాడు. అతనికి పొద్దుట్నుంచీ కాఫీకికూడా డబ్బులు దొరకలేదు. అందుకని రోహిణీకార్తె సూర్యుడిలా మండి పోతున్నాడు. రాంగ్ సైడ్‌లో వస్తున్న

బ్రోచేవారెవరురా?

పినాకపాణిని చూడగానే బోలెడు సంతోషం కల్గింది. ఈ కుర్రవాడిని బెదిరించి డబ్బు గుంజవచ్చని అన్పించింది. అందుకే సైకిల్ ఆపాడు.

''నువ్వు నడిపేది సైకిలా, విమానమా ? అంత స్పీడెందుకురా? పైగా వన్‌వే ట్రాఫిక్‌లో రూల్సుకి వ్యతిరేకంగా పోతున్నావే ?'' దబాయించాడు పోలీసు.

''ఇది వన్‌వేనా ?'' అన్నాడు ఆశ్చర్యంగా పినాకపాణి.

''అవును. నిన్నట్నుంచీ వన్‌వే చేశారు. అది తెలియక, నువ్వు రాకెట్‌లా దూసుకు పోతున్నావు...''

''తప్పేసార్... క్షమించండి... అట్నుంచి వెళ్తాను...'' అంటూ సైకిల్ వెనక్కు తిప్ప బోయాడు. సైకిలుమీద చెయ్యివేశాడు శేషాచలం.

''ఎక్కడికి పోతావు ? ఫైను కట్టు...'' అన్నాడు.

''ఫైనా ?''

''అవును. తప్పుచేసి శిక్ష తప్పించుకుందా మనుకుంటున్నావా ?''

''ఈసారికివదిలెయ్యండి సార్...తొందరలో వున్నాను...'' బ్రతిమాలేడు పినాకపాణి.

''అదేం కుదరదు. పాతిక రూపాయల ఫైను కట్టు...'' కుర్రాడు కదా రూల్సు తెలియవని డబ్బు కోసం దబాయించాడు.

''డబ్బులేదు...'' అన్నాడు బేలగా పాణి.

బలవంతంగా జేబులో చెయ్యిపెట్టి డబ్బు బైటకు తీశాడు. ముప్ఫై నాలుగు రూపాయలు ఉన్నాయి.

''అబద్ధాలు ఆడతావురా గుంటవెధవా ?'' అంటూ పాతిక రూపాయలు ఉంచుకుని మిగతా డబ్బు పినాకపాణి చేతిలో వుంచి ''పోరా...'' అన్నాడు.

''సార్... మీకు దణ్ణం పెడతాను ఆ డబ్బు ఇచ్చెయ్యండి...మందుకోసం వెళ్తున్నాను'' అన్నాడు బ్రతిమాలుతూ.

''ఇప్పట్నించీ 'మందు' ఎందుకురా ? ఎదవ అలవాట్లు చేసుకోకు. నేనుకూడా'మందు'కే వాడుకుంటానులే ఈ డబ్బు. తాగి చాలా రోజులయ్యింది...'' అన్నాడు శేషాచలం.

''సార్... మా అమ్మ చచ్చిపోయేలా వుంది సార్...'' అన్నాడు ఏడుపు ఆపుకుంటూ.

''చచ్చేవాళ్లు మనం వద్దన్నా ఆగరురా... వెళ్లు...'' అన్నాడు శేషాచలం.

''దయ చూపండి సార్...కావలిస్తే ఒక్క రూపాయి వుంచుకోండి...''

''అంటే ? నేనంత చచ్చు ఎదవలాగ కనపడుతున్నానా ? పోరా... ఎదవా ?'' పొమ్మన్నట్లు సైగ చేశాడు.

పినాకపాణికి గుండెలు అదిరాయి. టైముకి మందు లేకపోతే తల్లి ఏమై పోతుందో !...

''సార్... ఆ డబ్బు ఇచ్చెయ్యండి... కావలిస్తే ఈ సైకిలు వుంచుకోండి...'' అన్నాడు పినాకపాణి. ఆ సమయంలో అంత కంటే ఏం తోచలేదు వాడికి.

శేషాచలం కళ్లలో మెరుపు. ఈ పాతికా ఇచ్చేస్తే సైకిలు తనది అవుతుంది. ఎంతలేదన్నా నూటయాభై విలువ చేస్తుంది. తను వెంటనే అమ్మేస్తే సరి... ఆ తర్వాత వీడు వచ్చినా తనకు సైకిల్ సంగతి తెలియదని దబాయించ వచ్చు.

పాతిక రూపాయలు తీసి పాణికి ఇచ్చేశాడు.

వాడి చేతిలోంచి సైకిలు లాక్కున్నాడు.

పాతిక రూపాయలు తిరిగి దొరికాయన్న ఆనందంలో సైకిలు గురించిన ఆలోచన రాలేదు పినాకపాణికి.

పోలీసువాడికి సైకిలు ఇచ్చి, మందులషాపు వైపు వేగంగా పరుగుతీశాడు.

*   *   *

తల్లి ఆరోగ్యంముందు సైకిలు విలువ వాడికి గుర్తురాలేదు.

రేపట్నుంచి తను స్కూలుకు నడిచివెళ్లా లన్న విషయం మర్చిపోయాడు.


తల్లి గురించి ఆందోళనలో పోలీసువాడి దౌర్జన్యం గమనించలేదు.

ఆ సమయంలో పాతిక రూపాయల క్యాష్, సైకిలు విలువ కంటె ఎక్కువగా తోచింది.

అందుకే డబ్బు అందుకోగానే మందుల షాపు వైపు పరుగుతీశాడు.

శేషాచలం మాత్రం మీసాలచాటున నవ్వు కున్నాడు. పొద్దున్నే మంచి లాభసాటి బేరం దొరికిందని మురిసిపోయాడు.

పినాకపాణి లాంటి అమాయక ప్రాణుల్ని శేషాచలం లాంటి రాబందుల బారినుంచి బ్రోచేవారెవరురా ? ? ? ★




మనిషికి నిర్వచనం!

బీహారుకు చెందిన పాదంపూరు అనే గ్రామంలో స్వామి చైతన్యదేవ్ అనే వో స్వామిజీ ''ఈర్ష్యా నివారణ కేంద్రం'' అనే కేంద్రం పెట్టి అందులో మనిషి ఈర్ష్యను జయించు టెట్లు అనే విషయం బోధన చేస్తున్నారట. ఈ బోధనా విధానంలో హిప్నాటిజం సబ్జక్టునుకూడా బలంగా తీసుకుంటున్నారట — హ్హా!! ఆయన వెర్రిగాపోతే ఈర్ష్య అనేది మనిషికి జీవపదార్థంవంటి దనాయనకు తెలియ వద్దా! ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, పరభాగ్యోపజీవి, నిత్యశంకితుడు, క్రోధనుడు, నిస్సంతోషి... అవి మానవుని రకాలు... యివేవీ లేపోతే మనిషెలా అవుతాడెవడైనా!

పెనంమీంచి పొయ్యిలో పడ్డ స్త్రీ!

గుజరాత్‌కు చెందిన ధరంపూర్ తాలుకా ఒక గ్రామానికి చెందిన వో 20 ఏళ్ళ ఆదిమవాసి స్త్రీ వంటరిగా యింటికి వెళ్తూండగా కొంత మంది ఆమెమీద వో అనువైన ప్రదేశానికి ఎత్తుకుపోయి, అచ్చట అంతాచేరి బృంద మానభంగం చేశారట. ఈ తన దుస్థితి ఆమె వో సాధుగారితో చెప్తే ఆయన చాలా సానుభూతి చూపి, రామ్మా విశ్రాంతి తీసుకువెళ్దువు అని లోపలకు పిలిచి, తానామెమీదపడి, తన కామ దాహం తీర్చుకున్నాడట.





శృతిమించిన దొంగ రవాణా!

1983వ సంవత్సరం జులై 30 నాటికి మన స్వతంత్ర భారతదేశపు అన్ని రాష్ట్రాలలోని జైళ్ళల్లోనూ దొంగ రవాణా నిరోధక చట్టం మూలంగా నిర్బంధితులై 307 మంది వున్నారట. 1982వ సంవత్సరం లెక్కల ప్రకారం 27 కోట్ల స్మగ్లింగ్ వస్తువులు పట్టివేయడం, 1983లో మార్చి వరకే 8 కోట్ల వస్తువులు పట్టివేయడం జరిగిందట— పట్టిన లెక్కలే యిన్ని వుంటే చేజారినలెక్కలెన్నుంటాయో... లెక్కలేనన్ని.

ఏడేళ్ల బాలిక మానభంగం!

మైసూరుకు చెందిన 27 ఏళ్ల జపదురై అనే వో యువకుడు తన పక్కింటివాళ్ళమ్మాయి ఏడేళ్ల బిందు అనే అమ్మాయిని పిలిచి, నీకు చక్కని కథ చెప్తాను నా రూముకు రా అని రూముకు తీసుకువెళ్ళి, తలుపు వేసి, ఆ పిల్లని బలాత్కరించాడట. ఈ నేరానిగ్గాను ఆపనికి కోర్టు ఆర్నెలలు శిక్ష, నూటయాభై అపరాధం విధించిందట — ఇంతేనా! ... బలాత్కారాలకు, మానభంగాలకు పెద్ద శిక్ష వుండేలా శిక్షాస్మృతి మార్చితీర్చాలి.

ప్రాణం తీసిన దశరథుని వేషం!


ఉత్తరప్రదేశ్‌కు చెందిన దోనామహినా అనే వో గ్రామంలో ''శ్రీరామ వనవాసం'' అనే వో నాటికలో దశరథుని వేషం వేసిన 60 ఏళ్ళ అర్జున్‌పాండే శ్రీరాముడు కానలకు వెళ్ళే సీనులో హా రామా, కానలకేగు చుంటివా అని తమభాషలో వాపోయి, అత్యద్భుతంగా తన నటనను ప్రదర్శించి సాక్షాత్తు అలనాటి దశరథునిలా మూర్ఛపోయాడట. ఆ సీనుకు ముగ్ధులయిన ప్రేక్షకులా అర్జున్‌పాండేగారి నభినందించడానికి తెరమీదకి వెళ్తే ఆయన దశరథునిలా చనిపోయాడట నిఝంగానే.

పట్టుబడిన పాదరక్షల దొంగ!

ఇంగ్లండ్‌కు చెందిన యార్క్ నగరంలో టామ్‌మోరిస్ అనే వో అవిటి (ఒకే కాలున్న వాడు) వ్యక్తి వొక చెప్పులషాపులో షో కేసులో వున్న వో షూ దొంగతనంచేసి చూసుకుంటే తన కాలికి సరిపోలేదట. ఛత్తెరికి అని ఆ షూ మళ్ళీ అక్కడే పెట్టేసి, తన కాలికి సరిపోయే మరో షూ వెతుక్కుని ఎంచుకోడంలో పట్టుబడి పోయాడట.

దివాలా తీయించిన ప్రకటన!


స్విట్జర్లండ్‌కు చెందిన ఒక నగరంలోని ఎలుకల బాధ భరించలేని పురజనులా పురపాలకుని మొరపెట్టుకుంటే ఆయన వో తెలివైన ప్రకటన చేశారట. ఆ ప్రకటన ప్రకారం ఒక ఎలుకను చంపి తెచ్చినవారికి ఒక ఫ్రాంక్ నాణెం బహుమతి పొందవచ్చునట. ఈ ప్రకటన విన్న డేనియల్ అనే వో స్కూలు విద్యార్థి కార్తవీర్యార్జునిలా విజృంభించి రెణ్ణెలల్లో రెండువేలయిదువందల ఎలుకలను చంపి, రెండువేలయిదువొందల ఫ్రాంకులు వొడేసి పుచ్చుకున్నాడట. దాంతో పురపాలకుని కళ్ళు వెళ్ళుబ్బి ఖజానా ఖాళీ అవడం చూసి కొయ్యబారిపోయాట్ట.



తనయుని హత్య!

పరమత్తి వేలూరు గ్రామానికి చెందిన 75 ఏళ్ల మారప్పగ వుండరు తన పొలాన్ని తన ముగ్గురు కొడుకులకూ గుత్తకిచ్చి తాను వో కోవెల చిన్న పొలం తీసుకుని సేద్యం చేసుకుంటు న్నాడట. ఏటికి నాలుగు బస్తాల వొడ్లు యివ్వాల్సిన కొడుకులు రెండు బస్తాలే యిచ్చారట. దాంతో మిగతా రెండు బస్తాలేవీ అని మారప్ప గవుండర్ నిలదీశారుట వారిని. దానికి అతని రెండో కొడుకు వీరప్ప తన తండ్రిని యీడ్చి వోటి తన్నాడట. ఆ దృశ్యం చూసిన మారప్ప గవుండరు పెద్దకొడుకు 50 ఏళ్ల చిల్లప్పకు, 42 ఏళ్ల మూడో కొడుకు కొళందైయ్యప్పనుకూ కోపంవచ్చి యిద్దరూ చేరి వీరప్పను చితకబాదారట. చిల్లప్ప చిరుకత్తి తీసుకు తమ్ముణ్ణి కసకస అని పొడిచాడట. ఈలోగా తండ్రి లేచివచ్చి ఆ వీరప్ప తలమీద రుబ్బురోలు పొత్రంపెట్టి ఒక్కటిచ్చుకున్నాడట. ఈ దెబ్బకూ, ఆ పోటుకూ వీరప్ప అక్కడికక్కడే చనిపోయాడట. ★

వ్యక్తిగతం



శ్రీయుతులు మొరార్జీదేశాయ్, సంజీవరెడ్డి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలని ప్రచురించి సంచలనం కలిగించిన పత్రికా రచయిత శ్రీ అరుణ్ గాంధీ ఎవరోకాదు, మహాత్ముడి రెండవ కొడుకు మణిలాల్ గాంధీ కొడుకే. ఈయన 1934లో దక్షిణ ఆఫ్రికాలో పుట్టాడు, 1956లో భారతదేశానికి మారిపోయాడు...



ఒకనాటి ఉషా అయ్యర్ నేటి ఉషా ఉతుప్. తమిళ యువతి ఇంగ్లీషు పాటలు పాడి పేరు సంపాదించుకుంది. కలకత్తాలోని మహాజాతి సదన్‌లో కచేరీఇవ్వబోయింది. ప. బెం. మంత్రి జతిన్ చక్రవర్తి ఆవిడ పాట "అపసంస్కృతి" అని ఒప్పుకోలేదు. ఉషా ఉతుప్ మంత్రిగారిమీద దావా వేసింది. జడ్జి బారువా ఆవిడనే సమర్థించారు. ఉషా ఉతుప్ తనకి రు. 20 లక్షలు పరిహారం కావాలని అంటోంది...



మహారాష్ట్ర మాజీముఖ్యమంత్రి శ్రీ అంతూలే ఇటీవల తీవ్రమైన వరదలకి గురైన కొంకణ్ ప్రాంతాన్ని పర్యటించారు. అంతవరకు ఆ ప్రాంతాన్ని ఏ రాజకీయ నాయకుడుగానీ, అధికారికానీ పట్టించుకోలేదు. కొన్ని గ్రామాలకి శ్రీ అంతూలే మోకాటి లోతు నీటిలో, బురదలో నడిచివెళ్లారు. ఈ పర్యటనలో ఆయనకి లభించిన స్వాగత సత్కారాలు ప్రజలలో శ్రీ అంతూలే పలుకుబడి ఎంతమాత్రం తగ్గలేదనడానికి నిదర్శనంగా ఉన్నాయి. కన్నవారిని చూడటానికి యింటికి వచ్చిన కుమారునిలా ఆయనని అక్కడివారు ఆదరించారు. తానింకో రెండేళ్ళపాటు అధికారంలో ఉండి ఉంటే ఇప్పుడీ వరదలవల్ల ఇంత అనర్థం జరిగి ఉండేది కాదని శ్రీ అంతూలే అన్నారు...

వారఫలం

7-10-1983 శుక్రవారం మొదలు 13-10-1983 గురువారం వరకు

♈ మేషం: మీ వ్యాపారంలో మెరుగు కనిపిస్తుంది. రాజకీయంగా ఆశించిన మేలు సుకరంగా అందే మార్గ మున్నది. విందు వినోదాలలో పాల్గొనవలసిన అవకాశం లభిస్తుంది. ధనాదాయం కూడా కొంత లేకపోలేదు. స్త్రీలకు: శుభ ప్రస్తావన లుండటం, గెలుపు గల వస్తు సేకరణకు అనుకూల సమయమని చెప్పాలి.

♉ వృషభం: ఒకటి రెండు మార్గాలలో మీకు ఆదాయం లభిస్తుంది. వ్యవహార మూలంగా లాభం చేకూరుతుంది. వ్యాపార విస్తరణ కార్యక్రమం కొందరకు అనుకూలత, చేకూర్చుతుంది. అప్పులు వసూలు అవుతాయి, అయిన వారి సహాయం లభిస్తుంది. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహించటం, వృత్తిలో పెంపు గమనించకుం చెప్ప దగిన అంశాలు.

♊ మిధునం: మీతో వ్యాపారంలో నో, వ్యవహారంలోనో, కళా సాహితీ రంగంలో నో, ఉద్యోగంలోనో పోటీ పడే వారుంటారు. ఆదాయం లభిస్తుంది. చాల కాలంగా నిలచిన ధనం మీ శ్రమ మూలాన ఈదినం లభిస్తుంది. మీ వృత్తిలో పెంపు కనిపిస్తుంది. భూములు కొనుగోలు చేయాలని కొందరు ఉబలాటపడుతారు. స్త్రీలకు: ఆశించిన విధంగా వృత్తిలో అభివృద్ధి గలవారం.

♋ కర్కాటకం: ఆదాయానికి లోపం లేదు. అవసరాలకు ధనం అధికంగా వెచ్చింపవలసి యున్నది. చాలమందికి ఆరోగ్య లోపం కనిపిస్తుంది. ప్రయాణాలు చేయగలరు, అవిలాభదాయకంగా ఉంటాయి. స్త్రీలకు: ఆదాయం, వృత్తిలో మేలు, ఆశించిన ఉద్యోగం లభించవచ్చు.

♌ సింహం: సుఖ సంపదలకు లోపంలేదు. వృత్తిలో వికాసమున్నది. యత్నించిన కార్యంలో విజయం సాధించగలరు. భూమి కొనుగోలు చేయటానికి అవకాశమున్నది. వృత్తిలోమార్పు కూడా కొందర విషయంలో చెప్పదగిన అంశం. స్త్రీలకు: యత్న కార్య సిద్ధి, ఉద్యోగ లాభం చేకూరే వారం.

♍ కన్య: మాటకు విలువ పెరగటం, ఆదాయం అభివృద్ధి చెందటం, ప్రజ్ఞ వికసించటం, ఉద్యోగలాభం చేకూరటం, అప్పులు వసూలు కావటం, ఆరోగ్య భాగ్యం అమరటం గమనించ మన్నారు. స్త్రీలకు: వ్యాపారంలో వృద్ధి, ఉద్యోగంలో అభివృద్ధి చెప్ప దగిన అంశాలు.

♎ తుల: నల్లని వస్తువులు విక్రయించేలాగైతే అధిక లాభం ఆర్జింప గలరు. చాల కాలంగా నిలిచిన ద్రవ్యం చేతి కందుతుంది. రాజకీయంగా మేలైన వారమే. ఏమయినా స్తోత్ర ప్రియులదరి జేర్చకండి. స్త్రీలకు: నూతన వస్తు సేకరణ, వృత్తిలో పెంపు సంభవం.

♏ వృశ్చికం: నిరాశతో సగంలో వదలిన ఒకానొక వ్యాపార విషయం, మరలా చేపట్ట మన్నారు. 'సినీ' రంగాను భవం గలవారికి నూతనావకాశాలుంటాయి. విడుదలకు సిద్ధంగా చిత్రం ఉంటే లాభిస్తుంది. స్త్రీలకు: కార్య విజయం, కళా రంగంలో ప్రసిద్ధి ఏర్పడుతుంది.


♐ ధనుస్సు: నూతన విషయాలు తెలిసికొంటారు. నూతన మిత్రులను కలిసికో గలరు. ఉద్యోగ రీత్యా చేసే నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. అధిక వ్యయాన్ని అదుకొనేటంతటి ఆదాయ మున్నది, గ్రహించి, శ్రమించండి. స్త్రీలకు: ఆరోగ్యలోపం, ధన లోపం కనిపిస్తుంది.

♑ మకరం: దూర బంధువులు యింటికి రాగలరు ప్రజా రంగంలో పేరు ప్రతిష్ఠలు రాగలవు. రాజకీయంగా మేలు పొందగలరు. ఉద్యోగరీత్యా చేసే ప్రయత్నాలు ఫలించి ఆనందాన్ని కలిగిస్తాయి. స్త్రీలకు: వస్తు సేకరణకు నూతన విషయాలు గ్రహింపునకు అవకాశం గల వారం.

♒ కుంభం: 'ప్రతి వారం యింతేనా' అని నిరాశ చెందకుండా రాజకీయంగా, సామాజికంగా మీకు అనుకూలత చెప్పవచ్చు. చేతికి ద్రవ్యం అందటం కూడా గమనిస్తారు. చాలమందికి దైవ కార్యానుకూలత కనిపిస్తుంది. స్త్రీలకు: పదిమందిలో పేరు ప్రతిష్ఠలు రానున్నవి. ఉద్యోగం లో ఒకమెట్టు పైకెక్క గలుగుతారు.

♓ మీనం: పోయిన వస్తువులను గూర్చి వేదనతో సంచరించటం ప్రయోజనం లేని వ్యవహారమే. వస్తువులు కొనుగోలు చేయ మన్నారు. ఒకవేళ గృహమో, వాహనమో సొంతం చేసి కోవాలని ప్రయత్నిస్తారు, సఫల మవుతుంది కూడా. స్త్రీలకు: నగలు కొనటమో, వస్త్రాలు సంపాదించటమో జరుగుతుంది. ఆదాయం కూడా సంభవమే గ్రహించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి


లైఫ్‌బాయ్
ఎక్కడో
ఆరోగ్యం అక్కడ
లైఫ్‌బాయ్‌తో స్నానం చేస్తే పరిశుభ్రంగా ఉంటారు మీరు ఆరోగ్యమైన తాజాదనపు అనుభూతి పొందుతారు. లైఫ్‌బాయ్‌తో జీవితం ఆరోగ్యప్రదం. గుర్తుంచుకోండి
లైఫ్‌బాయ్
మురికిలోని క్రిములను
వదలగొడుతుంది
LIFEBUOY
for health
LIFEBUOY
SOAP

సీరియల్

మానస చూరశి

కొమ్మూరి సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

పాతకాలంనాటి కుక్కిమంచంలో పడుకుని వుంది చందన. ఆమె ముఖంలో కళా కాంతులు లేవు. రేపో, మాపో చావబోయే మనిషిలా కళ్లలో ప్రాణాలు పెట్టుకుని వున్నది. ఆమెకు చిన్నప్పటి నుంచి పొడల వ్యాధి ఉన్నది. ముఖం నిండా, వంటిమీదా అక్కడక్కడా తెల్లటిమచ్చలు అల్లుకుని వున్నాయి. ఆ మచ్చలు చిన్నతనంలో అంతగా లేవు. వయసుతోపాటు పెరుగుతూ వచ్చాయి. ఆ దిగులుతోనే ఆమె నీరసించి, కృశించి టి.బి. తెచ్చుకుంది. రెండేళ్లనుంచి మంచంలోబడి రోజులు లెక్కబెడుతోంది—

సరియైన వైద్యం లేక, పుష్టికరమైన తిండిలేక—మృత్యుముఖంలోతలదూర్చిఅ గుక్కెడు ప్రాణాన్ని నిలుపుకోవాలని తెగ ఆరాటపడుతోంది. ఆలన పాలన చూసే దిక్కు లేదు. పక్కింటి బూబమ్మ వేళకింత తిండి వండి పెడుతుంది. బంధువు లెంతోమంది వున్నా— ఆస్తి పాస్తుల తల్లిదండ్రులు పోయాక ఆ గడప త్రొక్కిన వాళ్లెవరూ లేరు. చావలేక, బ్రతకలేక జీవచ్ఛవంలా మంచంమీద పడి వున్నది.

చందనను ఆ విధంగా చూసేసరికి ఆరడుగుల విజయ్ చిగురుటాకులా వణికి పోయాడు. గుండెమీద సమ్మెట దెబ్బలు తగిలినట్లు విలవిల్లాడిపోయాడు. సూట్‌కేసు ప్రక్కన పడేసి ఒక్క ఉదుటున ఆమె మంచం దగ్గరకు వెళ్లాడు.

''చందనా !'' అతని పెదవులు ఆర్తిగా ఆబగా ఉచ్ఛరించాయి.

చందన నెమ్మదిగా కళ్లు విప్పింది, గాజు గోళీలాంటి కళ్లను విప్పార్చుకుని చూసింది.

''బావా...!!'' ఎండిపోయిన ఆమెపెదవులు ప్రేమపూరితంగా పలవరించాయి. లోతుకు పోయిన ఆ కళ్లలో వెన్నెల దీపాలు వెలిగాయి.

''చందనా ! నిన్నిలా చూడాల్సివస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఎంత మారి పోయావు ..'' అతని హృదయాన్ని ఎవరో నొక్కిపట్టినట్లు కళ్లలో నీళ్లు తిరిగాయి. చందన మాట్లాడలేదు. కళ్లనిండుగా తన బావనే పరిశీలనగా చూస్తూ వుండిపోయింది. ఎన్నాళ్లు? ఎన్నేళ్లయింది ఈ వెన్నెల దొరను చూసి ? అబ్బ ఎంత అందంగా ఆరోగ్యంగా వున్నాడు బావ ! అని ఒక్కక్షణం ఆమె ఆడమనసు చెదరిపోయింది. ఎండిన ఆమె హృదయంపై పన్నీటి జల్లులు చిలకరించినట్లయింది. బావ చేతిని తనచేతుల్లోకి తీసుకుని నిమురుతూ వెక్కి వెక్కి ఏడ్చేసింది.

''చందనా! ఎందుకేడుస్తావు. ఊరుకోఁ... ఇక నేను వచ్చాగా—''

పసిపాపలా ఆమెను అనునయంగా ఓదార్చుతూ ఆత్మీయంగా ఆమె శిరస్సునిమిరాడు విజయ్. అంతటి ఆత్మీయతను ఆమె ప్రేమ హృదయం తట్టుకోలేక పోయింది. గుండెల్లోని భారం తీరేవరకు ఏడ్చేసింది. ఆమె ఏడుస్తుంటే అతను తట్టుకోలేకపోయాడు. రెండు కన్నీటి బొట్లను నేలకు జార్చాడు.

ఆమె హృదయం జవజవలాడి పోయింది.

కొద్దిసేపటికి వారి హృదయాలు కుదుట పడ్డాయి.

''ఎందుకిలా జరిగింది చందనా! అత్తయ్య, మామయ్య ఎలా పోయారు ? నాకు మాట మాత్రం కూడా తెలీదు. దేవుడు నీకు చాలా అన్యాయం చేసాడు.''

విజయ్ మాటలకు చందన పేలవంగా నవ్వింది.

''విధాత నా నుదుట ఇలా బ్రతకమని రాశాడు. ఏ జన్మలోనో నేను చేసుకున్న పాపం ఇలా శిక్షిస్తోంది. ఈ గుక్కెడు ప్రాణం పోతే ఏ సమస్యలు వుండవు. మృత్యువుకు కూడా నా మీద ఇంకా దయ కలగలేదు. నేనెందుకు బ్రతుకు తున్నానో నాకే తెలియదు—''

రంపంతో గుండెను కోసినట్లయిందతనికి.

''మంచివాళ్లనే దేవుడు ఎప్పుడూ పరీక్షలకు గురిచేస్తుంటాడు. నేను బ్రతికి వుండి కూడా నీకెలాంటి సహాయాన్ని అందించలేకపోయినందుకు సిగ్గుపడుతున్నాను.''

''ఇందులో నీ తప్పేముంది బావా ! నీ వెక్కడున్నావో నాకు తెలీదు. నా కిలాంటి పరిస్థితి వస్తుందని నీవు మాత్రం కలగన్నావా? అదీ నీ గురించి వారందినాల క్రితం బూబమ్మ తమ్ముడు చెబితే తెలిసింది. నీవు ఫలానా చోట వున్నావని తెలిశాక నిన్ను చూడకుండా వుండలేక పోయారు బావా, ఈ దీనురాలిమీద దయతో వచ్చావు. అంతే చాలు—నీ అండ నాకు కొండంత బలాన్నిస్తుంది—''

''నేనేం నీకు పరాయివాడినా ? నీకిలా వుందని తెలిశాక రాకుండా ఎలా వుండగలను ? ఈ బాధ లన్నింటికీ ఎలా తట్టుకున్నావో గానీ తలుచుకుంటేనే నా గుండె తరుక్కుపోతోంది. నిన్నిలా చూళ్లేను. పట్నం తీసుకెళ్లి మంచి డాక్టర్‌కు చూపించి వైద్యం చేయిస్తాను. నీవు పూర్ణ ఆరోగ్యంతో కళకళలాడుతూ తిరగాలి.

జరిగిన కథ — 13 : మానస ఉద్యోగం చేయడానికి ఒప్పుకోదు. ఈ నీచ వృత్తే నీకు ఇష్టం అని మానసను విజయ్ నిందించగా ఇన్ని మాటలకు బదులు తనను పెళ్లి చేసుకొని ఉద్ధరించమని అడిగి వెళ్లిపోతుంది. విజయ్ తను మానసను పెళ్లి చేసుకోడానికి నిర్ణయించుకున్నట్లు ఆమెకు చెపుతాడు. ఆమె అతనిని తన ఇంటికి తీసుకెళ్లి తన కుటుంబ సభ్యులను పరిచయం చేస్తుంది. మానస కోరిక ప్రకారం కోవెల్లో ఆమెను వివాహం చేసుకుంటాడు విజయ్. మానసను బలవంతంగా ఎత్తుకుపోయి రేప్ చేయబోయిన సుకుమార్ నుండి ఆమెను రక్షిస్తాడు విజయ్. ఈ సంఘటన తరువాత మానస ఇంట్లోంచి కదలకూడదని నిశ్చయించుకొంటుంది. తన చిన్ననాటి స్నేహితుడు శ్రీరాప్ వ్రాసిన ఉత్తరాన్ని చూసి మండిపడతాడు విజయ్. విజయ్ డ్యూటీలో వుండగా అతని దగ్గరకు 1 పేద బ్రాహ్మణుడు వచ్చి లేచిపోయిన తన కూతుర్ని వెదికి పెట్టమని ప్రాధేయపడతాడు. ముసలి బ్రాహ్మణుని కుమార్తె దమయంతిని, శశికర్‌ను రఘురాప్ లాడ్జిలో పట్టుకొని దమయంతికి మంచి మాటలు చెప్పి ఆమెను ఆమె ఇంటికి చేరుస్తాడు విజయ్. రాజశేఖరంగారి కుమార్తె వాసంతి వివాహ సందర్భంగా ఏర్పాటైన మ్యూజికల్ పార్టీకి వెళ్లిన విజయ్ అక్కడ చందనను చూస్తాడు. చందన తను చందన కాదని చెప్పగా వేదనతో ఇంటికెళ్లి గతాన్ని తలుస్తాడు. విజయ్‌కు చందన దగ్గరనుంచి ఉత్తరం వస్తుంది. గతంలో చందన తనకు చేసిన సహాయాన్ని, చూపిన అభిమానాన్ని తలుస్తాడు. ఆమెను చూడడానికి గండవరం వెళుతాడు.

అప్పుడే నాకు నిజమైన ఆనందం–'' ఉద్వేగంగా అన్నాడు విజయ్.

చందన కళ్లలో సన్నని ఆశాకిరణం తళుక్కు మన్నది. ఒక్కక్షణమే – వెంటనే వేదనా పూరితమైన నవ్వు తొంగిచూసింది పెదవుల పైన.

''నాకు అంతటి ఆశ లేదు బావా! నా జీవితం చివరి దశకు చేరుకుంది. ఈ గుండె కృశించి కృశించి ఎండిపోయింది. శరీరం కూడా రేపో, మాపో శిథిలమవడానికి సిద్ధంగా వున్నది. చివరిసారిగా నిన్ను చూడాలనుకున్నాను. చూసాను. ఆ తృప్తితో కన్ను మూయడం కన్నా మరే కోరికలు లేవు. అద్సరేబావా! నీ సంగతులేమీ చెప్పలేదే? ఇన్నాళ్లూ ఏంచేస్తున్నావు? ఆ కబుర్లు చెప్పకూడదు కాస్సేపు–'' అని మాట మార్చేసింది చందన.

ఆమెను తృప్తి పరచాలని ఏవేవో కబుర్లు చెప్పాడు విజయ్. ఆమె ఎంతో ఆసక్తిగా ఉత్సాహంగా వినసాగింది. వున్నట్లుండి ''పెళ్లెప్పుడు చేసుకుంటావు బావా?'' అని కుతూహలంగా అడిగింది చందన.

విజయ్ ఆ ప్రశ్నకు చిరునవ్వు నవ్వాడేగానీ సమాధానం ఇవ్వలేదు.

అందమైన తన బంగారు బావను తృప్తిగా చూసుకుంటుంటే ఆమె ఎదలో ఓ చిత్రమైన కోరిక రగులుతోంది. కానీ ఆ కోరికను బయటకు వ్యక్తీకరించడానికి సాహసించలేకపోతోంది. ఆమె మనసులో ఏదో ఉద్దేశ్యం వుందని సూచన ప్రాయంగా గ్రహించగలిగాడు విజయ్.

''ఏమిటి ఆలోచిస్తున్నావు చందనా?''

''ఏమీలేదు –'' అని మాట మార్చబోయింది. కానీ విజయ్ బలవంతం చెయ్యడంతో విరక్తిగానవ్వి ''పువ్వుల తోటలో ఎన్నో పూలు పూస్తాయి. పూచిన ప్రతి పువ్వు దేవుని పాదాల చెంతకు చేరలేదు. ఏటిగాలికి కొట్టుకుపోయేవి కొన్ని, ఎండ వేడిమికి రాలి నశించిపోయేవి మరికొన్ని, రక్కసుల పాదాల క్రిందపడి నలిగిపోయేవి కొన్ని–పోగా ఏ కొన్నో దేవుని సన్నిధికి చేరుకునేది. నేను గరిక పువ్వును బావా. అయినా ఆశ చూసావా ఒక్క క్షణమన్నా ఆ దేవుని చరణాల్ని స్పృశించాలన్న తలంపు కలుగుతుంది. ఏ భక్తుడో పొరపాటున నన్ను అక్కడకు చేర్చాలిగానీ స్వామి సన్నిధికి నేనెలా చేరగలను? నాకా అర్హత ఎక్కడుంది?'' అన్నది.

''చందనా! ఏమిటా మాటలు? ఎందుకు నిన్ను నీవు అలా కించపరుచుకుంటావు?'' మందలింపుగా అన్నాడతను.

''లేదు బావా నేను చాలా అల్పురాలిని. నా కోరిక మాత్రం చాలా తీవ్రమైనది.''

''కోరికా ఏమిటది?–''

''నా వికృతమైన రూపాన్నిచూసి నన్ను పెళ్లాడడానికి ఎవరూ ముందుకు రాలేదు.



నాకేమో అందరి ఆడవాళ్లలా తాళి కట్టించుకుని ఒక్క క్షణమన్నా భర్త ఒడిలో సేద దీరాలని–ఆపైన తృప్తిగా తనువు చాలించాలని కోరిక. ఆ కోరిక ఈ జన్మకు తీరదని తెలిసినా పిచ్చిమనసు అప్పుడప్పుడూ భ్రమకు లోనవుతోంది–''

ఆమె కన్నుల్లో నీటిపొర దిగింది.

విజయ్ ఖిన్నుడైనాడు. ఆమె ఆడమనసు– ఆ మనసులోని కోరికను సానుభూతిగా అర్థం చేసుకున్నాడు.

'చందన కోరిక అసహజమేమీ కాదు. అందరి స్త్రీల లాగా తనూ పెళ్లికూతురిలా పెళ్లి పీటల మీద కూర్చుని మూడు ముళ్ళూ వేయించుకోవాలని, సౌభాగ్యవతిలా విలసిల్లాలని కోరుకుంటుంది. ఈ కోరిక ఎలా తీరుతుంది ?'

దేవుడు ఆమెకు వికృతమైన రూపాన్నిచ్చి చాలా అన్యాయం చేసాడు. పైగా జబ్బుమనిషి. ఈ రోజుల్లో అన్నీ సక్రమంగావున్న ఆడపిల్లలకే పెళ్లికావడం కష్టంగా వుంది. ఇక చందనను ఎవరు చేసుకుంటారు ?

ఒకనాడు సిరిసంపదల మధ్యన మహారాణిలా పెరిగిన చందన, ఈనాడు ఏమీలేనిదై, ఎవరి తోడూ లేక – పెళ్లి కావాలని – తనకూ ఒక తోడు కావాలని అర్థిస్తోంది. ఆమె మనసులో ఆ కోరిక ఎంత బలంగా లేకపోతే అడుగుతుంది ?

తనే ఆమె కోరిక తీరిస్తే ?

మానస మురళి

ఆ ఆలోచన మనసులోకి రాగానే ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు విజయ్.

'ఏం ఆగిపోయావు ? నీ ఆలోచనను ఆచరణలోపెట్టు. నీ భవిష్యత్తుకోసం ఆమె ఒకనాడు మహాత్యాగం చేసింది. నీ క్షేమంకోరి వంటిమీది నగలన్నీ ఇచ్చి పంపింది. ఆమె ఆనాడు అంతటి త్యాగం చేయకపోతే నీకీనాడు ఇంతగొప్ప జీవితం వుండేదికాదు. ఒకరకంగా చెప్పాలంటే ఈనాటి నీ జీవితం ఆమె పెట్టిన భిక్షే! అలాంటి రాగమయికి నువ్వు ఇచ్చే బహుమానం ఏమిటి ? ఆలోచించు –' అని అతని అంతరాత్మ రెట్టించింది.

దానితో విజయ్‌లో సంఘర్షణ మొదలయింది. చాలాసేపు ఆలోచించాడు. ఆ ఆలోచనలలోకి మురళి దూసుకు వచ్చింది. మనసంతా కలచినట్లయింది. ముక్కలవుతున్న హృదయాన్ని స్థిమిత పరుచుకుని చివరకు చందన చివరికోరిక తీర్చడానికి సిద్ధమయ్యాడు.

తన నిర్ణయాన్ని వ్యక్తంచేసాడు.

"చందనా ! నీ కోరిక నేను తీరుస్తాను. నిన్ను నేను పెళ్లిచేసుకుంటాను సరేనా ?''

చందన హృదయం పరవశించిపోయింది. ఆశ్చర్యము, ఆనందమూ ముప్పిరిగొనగా, ఏదో రవ్వంత భీతి, గోరంత ఆశ ఆమెను ఊపేశాయి.

"బావా ! నా మీద నీకెందుకింత జాలి?''

"కాదు. అభిమానం –''

అంతే ఆమె హృదయం తట్టుకోలేకపోయింది. చటుక్కున అతని చేతిని అందుకుని ముద్దుపెట్టుకుని చెంపకు రుద్దుకుంది పులకింతతో.


28

విజయ్ ఆ రోజంతా చందనకు ఎన్నో కబుర్లుచెప్పి ఆమెను ఉత్సాహపరిచాడు. బూబమ్మవచ్చి వంటచేసిపెట్టి వెళ్లింది. విజయ్ స్వయంగా పళ్లెంలో అన్నంపెట్టి కలిపి తినిపించాడు. అతని ప్రేమానురాగాలకు ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. సంతోషమే సగం బలము అన్నట్లు ఇప్పుడు చందనకు ఎంతో ఉత్సాహంగా, శక్తి వచ్చినట్లుగా వున్నది.

తనకు ఒక్కరోజుకన్నా ఎక్కువ శెలవు లేదని – వెళ్లి శెలవు పొడిగించుకుని మళ్లీ వెంటనే వచ్చేస్తానని చందనను బలవంతం మీద అంగీకరింపజేసాడు విజయ్. బూబమ్మకు చందనను జాగ్రత్తగా చూస్తూ వుండమని చెప్పి వెళ్లిపోయాడు.

బావ వెళ్లిపోతుంటే తన శరీరంలోంచి ప్రాణం వేరు అవుతున్నట్లు బాధపడిపోయింది చందన. అన్నమాట ప్రకారం మూడోరోజునే వచ్చేశాడు విజయ్. వస్తూ వస్తూ ఆమెకు





బలమైన టానిక్కులు, మందులు, పువ్వులు, పండ్లు, కొత్తచీరె, తాళిబొట్టు అన్నీ తెచ్చాడు.

చందన సంబరం ఇంతా అంతా కాదు. తనకు పట్టబోయే అదృష్టానికి ఆమె హృదయంలో గులాబీలు పూచాయి. మందారాలు వికసించాయి; సంపెంగలు గుబాళించాయి. గొట్టంతో వసంతం చిమ్మినట్లు ఇన్నాళ్ళూ కలల్లో కనిపిస్తున్న కల్యాణమంటపం కళ్ల ముందు కదలాడింది. "నా తపస్సు ఫలించింది. నా దేవుడు కరుణించాడు. ఇంతకన్నా నాకేంకావాలి? నా బావ... నా బంగారు బావ నన్ను ముత్తయిదువును చేస్తున్నాడు. నేనూ ఇల్లాలిని కాబోతున్నాను—" గర్వంతో ఆనందంతో ఆమె పొంగిపోయింది.

విజయ్ దగ్గరుండి ఆమెచేత కొత్తచీరె కట్టించాడు. జడనిండా పువ్వులు తురిమాడు. నుదుట కుంకుమ రేఖ దిద్దాడు. నెమ్మదిగా దేవుని పీఠం ముందుకు నడిపించుకుని వెళ్ళాడు. బూబమ్మ అక్షింతలు కలిపి ఇచ్చింది. పూజకు ఏర్పాటు చేసింది. అక్షింతలు చల్లి, మిలమిల మెరిసే మంగళసూత్రాల్ని అందుకున్నాడు.

ఒక్కక్షణం ఎగిసిపడే హృదయాన్ని — ఆ హృదయంలో స్థిరంగా పీఠం వేసుకుని మురళిని బలవంతాన తుడిచేసుకుంటూ చందన మెడలో మూడు ముళ్ళు వేశాడు విజయ్.

చందన తనను తాను నిగ్రహించుకోలేక అతని ఎదమీద సోలివాలిపోయింది. ఆ విధంగా ఆమె కోరిక ఫలించింది. ఆమె పూజలు పండాయి

విజయ్ వున్న రెండురోజులూ రెండు క్షణాల్లా గడిచిపోయాయి చందనకు.

తిరిగి అతను డ్యూటీకి వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

"చందనా! నేను ఈ రోజు వెళ్లిపోతాను. నీవేం దిగులు పడవద్దు. నిశ్చింతగా వుండు. ఒక నెలరోజుల్లో నాకు ఎక్కడో ఓ చోట పోస్టింగ్ వస్తుంది. ఇల్లు చూసుకుని వచ్చి నిన్ను తీసికెళతాను. మంచి డాక్టరుకు చూపించి నీకు వైద్యం చేయిస్తాను. నా కోసం బెంగ

మానస మురళి

పెట్టుకోకు. వీలైనంత త్వరలో వచ్చేస్తాను—" అని చందనకు నచ్చజెప్పాడు విజయ్.

బూబమ్మను పిలిచి ఆమె చేతిలో రెండు వందలు పెట్టాడు. "చూడమ్మా! నీకు మేమెంతో ఋణపడి వున్నాం. ఇంకొక నెల రోజులు మా చందన భారం వహించు. ఆ తరువాత నేను వచ్చి తీసికెళతాను. ఈ డబ్బుతో చందనకు పాలు, పండ్లు తెచ్చి ఇవ్వు. నేను తెచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడు—" అని చందనను ఆమెకు అప్పగించాడు.

విజయ్ వెళ్ళాక చందన దుఃఖాన్ని ఆపుకోలేక వలవల ఏడ్చేసింది.

బూబమ్మ దగ్గరకు తీసుకుని ఓదార్చింది.

జరిగినదంతా తలుచుకుంటే కలా అన్నంత భ్రమ కలుగుతోంది చందనకు.

ఆ ఉత్సాహము, ఆ సంతోషము ఆమెలో నవచైతన్యాన్ని కలిగించాయి. ఆరిపోతాయనుకున్న జ్యోతులు — కొత్త ఆశల వత్తులతో దేదీప్యమానంగా వెలగసాగేయి.

కాలం ఎవరి కోసం ఆగనన్నట్లు రెండు వారాలు గిరున తిరిగిపోయాయి. ఈ కొద్ది రోజుల్లో చందన ఆరోగ్యం కాస్త కుదుటబడింది. మందుల వలన, పాలు, పండ్లువాడడం వలన కొత్త శక్తి వచ్చింది. ఇప్పుడిప్పుడే లేచి తిరగ్గలుగుతోంది. బావకోసం ఎదురుచూస్తూ ఆ నిరీక్షణలో కాలాన్ని గడపసాగింది.

ఇదుగో వస్తానని వెళ్లిన విజయ్ జాడలేదు. కానీ అతని దగ్గరనుంచి యం. ఓ., ఉత్తరం వచ్చాయి. 'నాకు డ్యూటీలో తీరికలేక రాలేకపోతున్నాను. నీ ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకో డబ్బు పంపిస్తున్నాను. నా కోసం దిగులు చెందవద్దు. త్వరలో వీలు చూసుకుని వస్తాను—' అని రాశాడు. ఆ ఉత్తరాన్ని పదేపదే చదువుకుని మురిసిపోయింది చందన.

'ఎందుకింత పిచ్చి సంబరం? బావ నిన్ను జాలితో పెళ్లి చేసుకున్నాడే తప్ప నిన్ను ప్రేమించాడా? నీ కోరిక తీర్చాలన్న సదుద్దేశ్యంతో నిన్ను పెళ్లి చేసుకున్నాడుగానీ, నీమీద ఇష్టంతో చేసుకోలేదు. అసలు నీ దగ్గర ఏమున్నదని ఇష్టపడతాడు? అందమా, ఐశ్వర్యమా! ఆరోగ్యవంతమైన శరీరమా?

నీవు బురదలోని కలువవి. అతను నింగిలోని జాబిల్లి. నీ వెంత ఆశపడినా అంత ఎత్తుకు ఎగరగలవా? పిచ్చి ఆశల మేడలు నిర్మించుకుంటున్నావు. ఇంత స్వార్థము పనికిరాదు. నీమీద సానుభూతితో నీ మెడలో తాళికట్టాడు. ఇప్పుడు నీవు అతని మెడకు గుదిబండవైనావు. నీవు వున్నంతకాలం అతనికి సుఖముండదు. నీ సుఖము, నీ స్వార్థమే చూసుకున్నావుగానీ అతన్ని గురించిగానీ, అతని భవిష్యత్తును గురించిగానీ ఆలోచించలేకపోయావు.

నీవు అతనికి తగినదానవు కాదు. నీ కోరిక తీరిందిగదా ఇక తప్పుకో! అతన్ని సుఖంగా — శాంతంగా బ్రతకనివ్వు. అతనిమీద నీకేమాత్రం అభిమానమున్నా అతని భవిష్యత్తుకు అడ్డుగోడలా నిలబడకు. వెళ్లిపో... అతని నుంచి దూరంగా వెళ్లిపో.

ఏ ఉద్దేశ్యంతో అతనిచేత తాళి కట్టించుకున్నావో అలాగే మిగిలిపో చివరిదాకా. నీవు తప్పుకుంటే అతను మళ్లీ జోడైన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. కొన ఊపిరితోవున్న నీకు తాళికట్టి ప్రాణం పోశాడు. అందుకు కృతజ్ఞతగా నీవతని సుఖాన్ని గురించి ఆలోచించాలి. స్వార్థాన్ని చంపుకుని నిస్వార్థంగా ఆలోచిస్తే నీవతనికి తగిన భార్యవు కాదని రూఢిగా తెలుస్తుంది. ప్రేమను త్యాగంగా మార్చుకో—' అని చందన అంతరాత్మ నిలదీసింది.

ఆమె సంఘర్షణ తీవ్రంగా మొదలయింది.

అది రోజు రోజుకు పెరిగి చివరకు ఆమె ఆ ఊరు వదిలి వెళ్లిపోయేట్లు చేసింది. వెళ్లే ముందు — 'బావా! చచ్చిపోతాననుకున్నదానికి ప్రాణం పోసి బ్రతికించావు. నేనిలా తిరిగి మామూలు మనిషి నవుతానని — నీ మెడకు

గుదిబండనవుతానని ఊహించలేదు. నీ మేలు కోరి దూరంగా వెళ్లిపోతున్నాను. నీవు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. అదే నా కోరిక –' అని రెండు కన్నీటి చుక్కల్ని నేలకు రాల్చింది చందన.

ఆ విధంగా దూరమైన చందన తిరిగి ఈనాడు గాయనిలా ప్రత్యక్షమయింది. తనను గుర్తించనట్లు ప్రవర్తించేసరికి విజయ్ అమితమైన బాధకు లోనయ్యాడు.

'ఈ చిన్న జీవితంలో ఎన్ని మజిలీలు! ఎన్ని మలుపులు? ఒకనాడు తన హృదయం నిండా మురళిప్రియ రూపం అల్లుకుంది. ఆమె తిరస్కృతితో ఇక జీవితంలో పెళ్లి చేసుకోకూడదనుకున్నాడు. కానీ, పరిస్థితుల ప్రాబల్యం వలన చందన మెడలో తాళి కట్టాడు. చందన అప్రయత్నంగా ఎక్కడికో వెళ్లిపోయింది. తిరిగి మానస ప్రవేశం – పెళ్లి – ఏమిటీ జీవితం? ఏ క్షణం ఎలా జరుగుతుందో ఎవరు చెప్పగలరు?'

29

మరుదినం విజయ్ డ్యూటీకెళ్లాడు. స్టేషన్‌లోకి వెళుతూనే కానిస్టేబుల్ రంగయ్య సెల్యూట్ చేసి "సార్ మీకు హోటల్ రిడ్జ నుంచి ఫోను వచ్చింది–" అని చెప్పాడు.

"ఎవరు చేశారు?"

"ఎవరో ఒక అమ్మాయి. పేరు చెప్పలేదు. పదహారో నెంబరు గదిలో వున్నాను. మీ సార్ రాగానే ఫోను చేయమని చెప్పింది. మీతో ఏదో అర్జెంటుగా మాట్లాడాలట–"

విజయ్ ముఖం ప్రశ్నార్థకంగా మారింది. 'ఎవరా అమ్మాయి? తనతో అంత అర్జెంటుగా మాట్లాడదలుచుకున్నది తనే రావచ్చుగదా?' అని ఒక్కక్షణం ఆలోచించి ఫోను అందుకుని నంబరు డైల్ చేసాడు.

"హల్లో...ఇనస్పెక్టర్ విజయ్ స్పీకింగ్–"

"నేను బావా నీ చందనను..." ఆ గొంతు, ఆ పేరు వింటూనే అతని ముఖం వికసించింది.

"సారీ బావా! నిన్న నీ మనసు కష్ట పెట్టాను కదూ! పదిమందిలో మాట్లాడ్డం ఇష్టంలేక అలా నటించాను. నన్ను క్షమిస్తావు గదూ?"

"చందనా!"

"అవును బావా! నీ చందననే. నా హృదయ రాగాలకు రూపం కల్పించి నాకు పునర్జన్మ ప్రసాదించావు. నేను ఎప్పటికీ నిన్ను మరిచి పోలేను. బావా! నాకోసం ఓ గంట కాలాన్ని వెచ్చించగలవా? నీతో ఎన్నో మాట్లాడాలని వుంది. ఏమేమో చెప్పాలని వుంది. ఈ గుండె బరువు దించుకోవాలని మహా ఆరాటంగా వుంది. తప్పకుండా వస్తావు కదూ?–" దీనంగా, అర్థిస్తున్నట్లుగా పలికింది ఆమె స్వరం. ఆ తరువాత వెంటనే ఫోను పెట్టేసిన శబ్దం అయింది.

విజయ్ రెండు క్షణాలు మాటల కందని భావాలతో చలించిపోయాడు.

* * *

తలుపుదగ్గర నిలుచుండిపోయిన ఇనస్పెక్టరు విజయ్‌ను చూసి చందన హృదయం ఉత్తుంగ తరంగమై ఎగసింది. కన్నులునిండా కాంతులు నింపుకుని, హృదయం నిండా జ్యోతులు వెలిగించుకుని చటుక్కున ముందుకువచ్చి అతన్ని కౌగలించుకుంది చందన.

"చందనా! ఏమిటిది? పద లోపల కెళ్దాం–" అని ఆమెను అనునయంగా లోపలకు తీసుకువచ్చాడు విజయ్.

"ఎన్నాళ్లయింది బావా నిన్ను చూసి?–" ఆమె కంటి రెప్పల్ని రెప రెప లాడించి నవ్వింది. ఆమెను చూస్తుంటే గుండెనెవరో నొక్కినట్లు బాధగా వుందతనికి.

ఏనాడో దూరమయిన చందన తిరిగి ఇలా ప్రత్యక్షమవుతుందని అతను ఊహించలేదు.

"చందనా! ఇన్నాళ్లూ ఎక్కడున్నావు? అసలు ఊరొదిలి ఎందుకు వెళ్లిపోయావు? నీకోసం వెదకని ప్రదేశం లేదు. నీవెందు కలాంటి నిర్ణయం తీసుకుని వెళ్లిపోయావో నాకు తెలీలేదు. నేను ఉద్యోగంలో స్థిరపడి నిన్ను తీసికెళ్దామని ఊరొచ్చాను. నీవు అప్పటికే వెళ్లిపోయావు. ఏమైపోయావోనని చాలా బాధ పడ్డాను. ఎందుకలా వెళ్లిపోయావు?–" నీలదీస్తున్నట్లు అడిగాడు విజయ్.

ఆమె కళ్లలో నీళ్లు ఊరాయి. భరించరాని బాధను అణుచుకుంటున్నట్లు ఆమె ముఖ భంగిమలే చెబుతున్నాయి.

వెంటనే మాట్లాడలేకపోయింది చందన.

రెండు నిమిషాల తరువాత భారంగా నిట్టూర్చి పెదవి విప్పింది.

"బావా! నాకోసం ఇంతగా బాధపడతావని తెలిస్తే అసలు వెళ్లిపోయేదాన్నికాదు. చావు బ్రతుకులమధ్య వున్న నా మెడలో తాళికట్టి నాలో కొత్త ఆశల్ని రేపి జీవంపోసావు. నీ అనురాగ బలమే నన్ను బ్రతికించింది. చచ్చి పోతాననుకున్న నేను బ్రతికి నీకు సమస్య నయ్యాను. నీ మీద ప్రేమతో నీచేత తాళి కట్టించుకున్నాను గానీ, భార్యగా నీ జీవితంలోకి అడుగుపెట్టే అర్హత లేనిదాన్ని. నాకు చదువు లేదు – అందంలేదు. ఐశ్వర్యములేదు. ఏరకంగా నీకు సరితూగనని తెలుసుకున్నాను. నేను బ్రతికి నంతకాలం నీకు సుఖముండదని –నీకు దూరంగా వెళ్లిపోయాను –"

జాలిగా చూసాడు విజయ్.

"ఎంత పిచ్చిగా ఆలోచించావు చందనా! నన్ను చాలా తక్కువ అంచనా వేశావు. నా భవిష్యత్తుకోసం ఆనాడు ఎంతో త్యాగంచేసావు. ఆనాటి సమాజం 'లేచిపోయినదాని కొడుకు' అని హేళన చేస్తుంటే చేరదీసి ఓదార్చావు. ఎవరి ప్రేమలకు నోచుకోనివాడిని నీచేత ప్రేమించబడి అదృష్టవంతుడను అయ్యాను. అలాంటి దేవతను బ్రతికించుకోవాలని ఎంత ఆరాటపడ్డానో ఆ భగవంతునికే తెలుసు –"

ఆ మాటలతో చందన మనసు తృప్తితో నిండిపోయింది.

"నీవు చాలా మంచి వాడివి బావా! నీ మంచితనాన్ని, ఔదార్యాన్ని భరించే శక్తి లేక నీకు దూరంగా వెళ్ళిపోయానే కానీ– నిన్ను తలవని క్షణం లేదు. ఎన్నోసార్లు చచ్చిపోదామనుకున్నాను. ఏ ప్రేమ పాశం నన్ను వెనక్కి లాగినట్లు బ్రతుకుమీద మమకారం కలిగించింది. నీవు ఎక్కడైనా కనిపిస్తావని వళ్లంతా కళ్ళు చేసుకుని వెదికేదాన్ని. ప్రాణం పోయే లోపల నిన్ను ఒక్కసారి అయినా చూడాలని ఎంతో తీవ్రమైన కోరిక వుండేది. ఆ కోరిక ఈ రోజు నెరవేరింది. నన్ను క్షమించు బావా! నీ ప్రేమ లేకుండా బ్రతకడం అసాధ్యమని తెలిసింది..." అంటూ విజయ్‌ను చుట్టుకుపోయి కన్నీళ్లు పెట్టుకుంది చందన.

విజయ్ కళ్లలో కూడా నీళ్లు తిరిగాయి. ఆమెమీద పుట్టెడు జాలి కలిగింది. ఆమె కేదో చెప్పాలని అనుకున్నాడు. కానీ గొంతు పెగల్లేదు.

(ఇంకా వుంది)

గాలి నుండి నీరు!

చౌకగా గాలినుండి నీరును తయారుచేసే పద్ధతిని జపానులోని మిట్సుబిష్ ఎలక్ట్రిక్ సంస్థ రూపొందించింది. అరబ్ దేశాలలో ఇది ఉపయోగకరంగా ఉండగలవని భావిస్తున్నారు. ఎడారి ప్రాంతంలోని వేడిగాలిని ఫ్యాన్ల ద్వారా ఒకదానిలోనికి సేకరిస్తారు– ఈ గాలిలోని తేమను అణుపాత్రలలోనికి సేకరిస్తారు. దీనినుండి ఎక్కువ ఉష్ణోగ్రత గల నీరు పాత్రలలోనికి వస్తుంది. చమురుక్షేత్రాలు గల ప్రాంతాలలోనూ, మారుమూల ప్రాంతాలలోనూ ఇది ఉపయోగ పడగలదని బావిస్తున్నారు. సముద్ర తీరాలలోనూ, సముద్ర జలం నుండి మంచినీరు తయారు చేయటం సాధ్యంకాని ప్రదేశాలలో కూడా ఇది ఉపయోగపడగలదు.

అవీ ఇవీ అన్నీ

చిలకల పందిరి

ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' (మదరాసు) వారు వినాయక చతుర్థి సందర్భంగా ఏర్పాటుచేసిన పూర్తి పంచరంగుల వినోద విచిత్రం 'చిలకల పందిరి'లో ప్రముఖ రచయిత శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ 'పందిరిలో అతిథి'గా పాల్గొని, పూర్తి కార్యక్రమాన్ని చక్కటి ప్రహసనాలతో ఉషశ్రీ వ్యాఖ్యానంతో నడిపించి, సరికొత్త ప్రయోగాన్ని జయప్రదంగా నిర్వహించినందుకు సంస్థని అభినందించారు. ఈ హాస్య కదంబ కార్యక్రమంలో అల్లుళ్ళున్నారు జాగ్రత్త, అభినవ శాకుంతలం, ప్రేమ పరీక్ష, కరువులో అధికమాసం, మర్యాదరామన్న, కళాసేవ, కుటీర పరిశ్రమ, ఆదిశేషయ్యగారి అపరిచయం, రాంగ్ నెంబర్, గ్లాసు పగిలింది, మగపెక్కు, చిలికి చిలికి గాలివాన మొదలైన చక్కటి స్కిట్స్ ప్రదర్శించారు. విజయవాడ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌వారు ప్రదర్శించిన, యీ కార్యక్రమాన్ని శ్రీరమణ అల్లగా, శ్రీయుతులు ఉషశ్రీ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, విన్నకోట విజయరాం, ఎస్. కబీర్‌దాస్, పాండురంగ, మురళీకృష్ణ, మల్లాది సూరిబాబు, జె. సదాశివ రావు, వై. రాజకుమారి, యన్. విజయభాను, ఎస్. రాధారాణి సమర్థవంతంగా నటించి ప్రేక్షకులను నవ్వులజల్లులలో ముంచేను. కార్యదర్శి శ్రీ ఎం. ఎ. సుభాన్ స్వాగతవచనాలతో ఆరంభమైన కార్యక్రమం ప్రొ॥ సాయిప్రసాద్ వందన సమర్పణతో ముగిసింది. — (ఒ. వి.)

ఉత్తమ కవితా సంపుటిగా 'మైలురాయి'కి 1982వ సంవత్సరానికి ఫ్రీవర్స్‌ఫ్రంట్ బహుమతిని అందుకున్న ప్రముఖ కవి డా. ఎన్. గోపి.



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను తిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఆరువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

హైదరాబాద్ నోట్‌బుక్

అంతర్జాతీయ తెలుగు సంస్థ 9వ స్థాపనోత్సవం :

అంతర్జాతీయ తెలుగు సంస్థ సెప్టెంబర్ 8వ తేదీన 9వ స్థాపనోత్సవాన్ని కొత్త గవర్నర్ శ్రీ రాంలాల్ ముఖ్య అతిధిగా వైభవోపేతంగా జరుపుకొన్నది. ఈ సందర్భంలో ఆంధ్రేతరులు తెలుగు నేర్చుకొనడానికి కొత్తగా కరెస్పాండెన్స్ కోర్సునుగూడ ప్రారంభించింది. సంస్థ డైరెక్టర్ శ్రీ ఎం. రామప్ప స్వాగతం చెప్పినపిదప సంస్థ అధ్యక్షుడు శ్రీ వందేమాతరం రామచంద్రరావు సంస్థ కార్యకలాపాలను వివరించిన పిదట గవర్నర్ శ్రీ రామ్‌లాల్ ప్రసంగిస్తూ, ఏ భాషను ప్రోత్సహించినా అంతర్జాతీయ అవగాహనకు, సౌభ్రాత్రానికి ప్రోదిచేసినట్టేనని అంటూ అంతర్జాతీయ తెలుగు సంస్థ కృషిని ప్రశంసించారు. ప్రథమ ద్వితీయ ప్రపంచ మహాసభలు అంతర్జాతీయ హృదయావగతికి సాంస్కృతిక, మానవీయ మూల్యాల పరిజ్ఞానానికి విశేషంగా తోడ్పడ్డందుకు గవర్నర్ సంతోషం ప్రకటిస్తూ, కింది స్థాయిలో అలాటి సభల ఏర్పాటు జరుగాలని సూచించారు. దానివల్ల ఎక్కువమంది పరస్పరం అవగాహన చేసుకొనేందుకు అవకాశం వుంటుందని, భాష ద్వారా మానవతామూల్యాల అవగాహనకు రాజమార్గం ఏర్పడి, వసుధైక కుటుంబభావనద్వారా స్నేహశాంతులు నెలకొనగలుగుతాయని గవర్నర్ అన్నారు. కరెస్పాండెన్స్ కోర్సును లండన్ ఆంధ్ర సంఘం అధ్యక్షులు, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి సోదర పుత్రులు శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభిస్తూ, తెలుగువారు తెలుగును అభిమానిస్తేనే ఇతర దేశాలలోను తెలుగుకు గౌరవం వుంటుందన్నారు. ఈ సంస్థ తెలుగు మహాసభలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరుపాలని, దానివల్ల తెలుగువారు తమ ప్రాచీన వైభవాన్ని తెలుసుకొనడానికి వీలు కలుగుతుందని అన్నారు. సమయ పాలనం తెలుగు వారికి అత్యవసరమని, దానివల్లనే ఆంగ్లేయులు ఘనవిజయాలు సాధించగలిగారని ఆయన అన్నారు. డాక్టర్ దాశరధి కృష్ణమాచార్యులు సంస్థ ప్రచురించిన 'పేపర్స్ ఆన్ తెలుగు సొసైటీ అండ్ కల్చర్' అనే వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం అంతర్జాతీయ తెలుగు సంస్థ స్థాపన దినోత్సవం ఒకటి కావడం విశేషమన్నారు. ఈ సంకలనంలో నాలుగు ఆంగ్ల వ్యాసాలు, ఐదు తెలుగు వ్యాసాలు ఉన్నాయి. ఆంగ్ల వ్యాసాలు, సంఘంలోని మార్పులకు మానసిక కారణాలు – శ్రీ బి. కుప్పుస్వామి, రంగు, గండరింపు ఆలేఖనాలతో కళ–శ్రీ ఎ. ఎన్. రామన్ సాంఘిక – సాంస్కృతిక భావనను పరిపుష్టం చేసిన తిక్కన పోతన వేమనలు – ఆచార్య బి. లక్ష్మీనారాయణ రావు, సంస్కృత సాహిత్యానికి తెలుగువారి సేవ– ఆచార్య పి. శ్రీరామమూర్తి ఉన్నాయి. తెలుగు వ్యాసాలు : రాయలసీమ జానపద కళలు – శ్రీ ఆర్వీయస్ సుందరం, తెలుగు జాతిని తీర్చి దిద్దిన సాహిత్యం– ఆచార్య అడపా రామకృష్ణ రావు, తెలుగు నాటకరంగం సంప్రదాయ వికాసాలు – శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి, ఆంధ్రులపై జైనమత ప్రభావం – శ్రీ ఆరుద్ర, దాక్షిణాత్య నాట్యసంగీతాలు – తెలుగు ప్రభావం – శ్రీ కొత్తపల్లి సీతారామ మూర్తి ఉన్నాయి. సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివరామమూర్తి వందన సమర్పణతో స్థాపన దినోత్సవం సమాప్తమైంది. శ్రీమతి గాలి ప్రభావతి తమ శ్రావ్యకంఠంతో ప్రారంభంలో వందేమాతరం, మా తెలుగుతల్లి ప్రార్థనగీతాలు, చివర జన గణ మన – జాతీయ గీతం ఆలపించారు.

బాణామతి భయం – ముఖ్యమంత్రి హామీ !

ఇటీవల తెలుగుదేశంలో అభిచార హోమాల, మంత్రతంత్రాల భయం – బాణామతి భయం మితిమీరిపోయింది. ఎవరికి ఏ మనోవికారం కలిగినా ఎవరో ఏమో చేశారనే అనుమానం భయం ప్రబలుతున్నాయి. ఈలాటి భయాన్ని రూపుమాపడం అవసరమని సంఘ సేవకులు శ్రీమతి హేమలతా లవణం, డాక్టర్ శ్రీమతి క్రాంతి, శ్రీ జి. వి. వి. ఎస్. డి. ప్రసాద్, ప్రఖ్యాత హిప్నాటిస్ట్ కె. నాగరాజ్, ప్రముఖ పాత్రికేయులు శ్రీ దామోదరస్వామి సెప్టెంబర్ 8న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావును సచివాలయంలో కలుసుకొని విజ్ఞప్తి చేశారు. వీరు బాణామతి దర్యాప్తు సంఘం సభ్యులు. వీరు మెదక్ జిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ అరవిందరావు ప్రోత్సాహంతో మెదక్ జిల్లాలోని పెక్కు గ్రామాలలో పర్యటించారు. బహిరంగ సభలలో ప్రసంగించి, హిప్నాటిజం, ఇంద్రజాలం ప్రదర్శనలిచ్చారు; బాణామతి అనేది కేవలం భ్రమ, మిథ్య అని, దానిని నమ్మి చిక్కులు పడవద్దని ప్రచారం చేశారు. శ్రీమతి హేమలతా లవణం బాణామతి ప్రభావానికి లోనయ్యారని అనుమానించేవారిని పరీక్షించడానికి వైద్య బృందాన్ని ఆయా ప్రాంతాలకు పంపి, పరీక్షించి, ప్రజల భ్రాంతిని పోగొట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. నరాల దౌర్బల్యంగల ప్రాంతాలవారికి పౌష్టికాహారం సరఫరా చేయడం అవసరమని కూడా ఆమె కోరారు. ముఖ్యమంత్రి వారి మాటలు ఆలకించి, తనకు భగవచ్ఛక్తిపై అఖండ విశ్వాసం ఉన్నప్పటికీ, మూఢవిశ్వాసాలను ప్రోత్సహించనని, బాణామతి భయ నివారణలో తన ప్రభుత్వం సంపూర్ణంగా తోడ్పడుతుందని అన్నారు. బాణామతి మూఢవిశ్వాసానికి లోనయిన ప్రాంతాల ప్రజలకు తోడ్పడడానికి అన్నివిధాల చర్యలు తీసుకోవాలని సంఘ సంక్షేమశాఖా మంత్రిణి శ్రీమతి ప్రతిభా భారతిని ముఖ్యమంత్రి కోరారు.

ఉపశ్రుతి

ఏం సార్, ఆ కవిగారికి మూత్రం బంధించిందట. ఆస్పత్రిలో వున్నారట. పాపం ! – అన్నారు నాతో ఒకరు. బంధించక ఏమౌతుంది? సన్మానాల రసీదుల రెవెన్యూ స్టాంపులను ఎంగిలిచేసి అంటించేవారాయన. స్టాంపుల బంక అడ్డుతగిలి వుంటుంది – అన్నారొకరు శ్రోతల నుంచి.

– తిరుమల రామచంద్ర ★

మినీ కవితల పోటీ

సింహపురి సాహితీ సమాఖ్య, నెల్లూరు వారు దీపావళి శుభసందర్భంగా నిర్వహించే మినీ కవితల పోటీకి రచనలు ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీకి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుంటాయి.

వివరములకు :– సింహపురి సాహితీ సమాఖ్య, 10–170, సంతపేట, నెల్లూరు–524001 కి రాయాలి.

అవీ - ఇవీ - అన్నీ

శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం ప్రతుల ఉచిత పంపిణీ

దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా శ్రీ దేవీ మఠం శిష్య బృందంవారి సహాయము దుర్గాసన, శ్రీ చక్రసహిత శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం ప్రచురించి, ఉచిత పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు కాపీలు కావలసినవారు పోస్టుకార్డుపై రాయవచ్చు. 100 లేక అంతకంటే ఎక్కువ ప్రతులు కావలసినవారు కాగితానికి అయిన కనీస ఖర్చుని చెల్లించి పొందవచ్చు. ప్రతులకి శ్రీ పురాణపండ రాధాకృష్ణ మూర్తి, జ్ఞాన మహాయజ్ఞ కేంద్రము, జయశ్రీ టాకీసు రోడ్డు, రాజమండ్రికి రాయాలి. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna.


"నాంపల్లి నాగు"లో
జ్యోతిలక్ష్మి



ఎంతోరుచి... ఎంతోరుచి...
ప్రియలోనే వుంది
priya
అన్ని రకాలలోను అనంతమైన రుచులు
కలబోసి అందిసై ప్రియ పచ్చళ్ళు.
తలచుకొంటే చాలు తరగిపోని
రుచిరానుభూతికి- ప్రియ.
ఈనాడే మీ ప్రియను మీ ఇంటికి
తీసుకు వెళ్ళండి.
ప్రియ ఫుడ్స్
Marketed by:
MARGADARSI MARKET